# మిత్రులూ - నేనూ

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

# మిత్రులూ - నేనూ

ప్రథమ భాగం

గొఱ్ఱెపాటి వెంకటసుబ్బయ్య

తొలిముద్రణ
1970

హక్కులు రచయితవి

వెల : రు. 15-00

[illegible]
దేశి బుక్ డిస్ట్రిబ్యూటర్సు
విజయవాడ-2

ముద్రణ :
విక్టరీ ప్రెస్, విజయవాడ-1.
ఫోన్ : 4432

అంకితం

మిత్రులకు

# తొలి పలుకులు

"తాను వ్రాసే గ్రంథం తనలో ఒక పరిపూర్ణ భాగం అని రచయిత భావించని పుస్తకాలు తన రచనకు ప్రసవవేదనలాంటి శ్రమ పడని పుస్తకాలు, — రచయిత ఉద్దేశాలు ఎంత సదుద్దేశాలైనప్పటికీ కూడ - సాధారణంగా చాలా తక్కువరకం పుస్తకాలవుతాయి."

— ఇల్యాఎహ్రెన్‌బర్గ్

మిత్రులు చాలామంది నా జీవితచరిత్ర వ్రాయమని కోరారు. "జీవితంలో ఎప్పుడూ బొస్వెల్ ఏనా, జాన్సన్ కావడం ఎప్పుడ"ని హెచ్చరించారు.

What life has taught me — 'జీవితం నేర్పిన పాఠం' అనే మకుటంతో వ్రాిద్దామనుకున్నా — ఈ ధోరణిలో అయితే ఏమన్నా లోకానికి వుపయోగకరంగా వుంటుందేమో అనుకొని.

నేను చాలా స్వీయచరిత్రలు చదివాను. వాటిని గురించి 'ఆంధ్రప్రభ'లో పరామర్శించాను. కొన్ని ఆత్మఘోషలు, సొంత సోదెలు.

'ఆత్మచరిత్ర' అనేపేరు గాంధీజీ వ్రాసుకున్నదానికే చెల్లుతుంది.

రాయసం వేంకటశివుడుగారు తనకథకు 'ఆత్మచరిత్ర'ని పేరు పెట్టి ఆంధ్రగ్రంథమాలలో ప్రచురించమంటే, ఆ పేరు మారిస్తే ప్రచురిస్తానన్నారు పంతులుగారు. తర్వాత 'స్వీయచరిత్ర'గా మార్చి ప్రచురించారు.

స్వీయచరిత్రలో కుటుంబ విషయాలు తగ్గించి, సమకాలిక విషయాలను పేర్కొంటూ దేశాభివృద్ధికి బలి అయినవారు, ఘనకార్యాలు చేసినవారు వ్రాసుకుంటే లోకం హర్షిస్తుంది.

స్వీయచరిత్ర రచన కత్తిమీద సాములాంటిది. ఈ కారణాలన్నిటిని ఆలోచించుకుని మానివేశా.

"అచ్చు వేయకపోతే మానె, మేమైనా చూచుకుంటాం. మీ సంగతి మీ చేతులమీదుగా రాయండి నాన్నా" అని కృష్ణాబాయి కోరితే విద్యార్థి దశవరకు వ్రాశాను.

"మీ చరిత్రంతా వ్రాయడం మీకు ఇష్టంలేకపోతే, మీ సాహిత్యభాగం మట్టుకైనా వ్రాయండి" అని గ్రంథాలయ పితామహులు శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారు మరికొందరు మిత్రులు కోరితే, మనుమడు వేగుంట మోహనప్రసాద్ చేత వ్రాయించాను.

చిత్తూరునుంచి పనిగట్టుకొనివచ్చి, రామకృష్ణారెడ్డిగారు, "మీరు వ్రాయనైనా వ్రాయండి, లేకపోతే నేను వ్రాస్తాను" అంటే "నాయనా ! దీనిలో సాధక బాధకాలు తెలుస్తవి వ్రాయ"మని ఆ భాగాలు యిచ్చి, మరికొంతచెప్పగా, ఆయన 'చరిత్రకారుని చరిత్ర'గా వ్రాశారు. ఆయనకు కృతజ్ఞుడను.

స్వీయచరిత్ర వ్రాయనీ, జీవితచరిత్ర వ్రాయనీ, సాధారణంగా ఆ వ్యక్తి కార్యకలాపాలు వ్రాస్తారు. అది చరిత్రా ? ఆయన మనో హృదయాలను బయటపెట్టినపుడే అది చరిత్ర కాగలదు.

ఆ వ్యక్తి ఏమిచేశాడని కాదు, ఏమిగా మారాడనేది కావాలి.

There are two lives to each of us — the life of our actions, and the life of our minds and hearts. History reveals men's deeds and their outward characters but not themselves. There is a Secret of Self that has its own life unpenetrated and unguessed

— Bulwer

అనేకులు నాకు సాహిత్యపరంగా తోడ్పడినవా రున్నారు. వారిని మిత్రులుగా భావిస్తున్నాం. ఇంకా వ్యక్తిగత జీవితంలో మిత్రులున్నారు.

"Differences of outlook ought not to affect Sympathies, and I never gave theories and opinions a decisive role in my relations to people."

— Gorky.

1940 నుంచి నా దగ్గరవున్న మిత్రుల ఉత్తరాలన్నీ విడతీశాను. కృష్ణాబాయి, కనకరామ బ్రహ్మంగార్లకు నేను వ్రాసిన ఉత్తరాలను తరిచాను. ఇదంతా ఒక యజ్ఞం చేసినంత పనయింది. కూర్చుని వ్రాయప్రారంభించాను. కొందరినిగురించి వ్రాసిన పిమ్మట మిత్రులు గొట్టిపాటి బ్రహ్మయ్య, సంజీవదేవ్ గార్లకు చూపించగా "మంచి పనే. పూర్తిచెయ్యండి ఇలాగే" అని ప్రోత్సహించారు.

ఎందరో నాకు పుస్తకాలిచ్చారు. వారినిగురించి వ్రాద్దామనుకొన్నాను, అది పడలేదు. నా మిత్రులు కొందరు ఇహలోకయాత్ర చాలించారు. వారినిగురించి పత్రికలకు వ్రాయసంకల్పించాను, అదీ సాగలేదు. ఈ కారణాలన్నిటిని పురస్కరించుకొని ఈ పద్ధతిని వ్రాయపూనుకొన్నాను. ఇందులో మిత్రులు ప్రధానం, నేను అప్రధానం. ఇది వారి చరిత్రప్రధానంగా వ్రాసిందికాదు. ఇది వారి, నా సంబంధం. ఈ కృషిలో ఎంతవరకు కృతార్థుడనయ్యానో ఇతరులు కదా చెప్పవలసింది!

నేను నాల్గవతరగతి చదువుతున్నప్పుడు, ప్రతిరోజూ పలుదోముపుల్లకై వేపచెట్టుకు, దిగినతర్వాత చెట్టుకి నమస్కరించేవాడిని, చెట్టు

నన్ను పడకుండా భద్రంగా దింపినందుకు కృతజ్ఞతను ఆ రకంగా వెల్ల డించేవాడిని.

ఇప్పుడా దశను తల్చుకొని నాలో నేనే నవ్వుకొంటాను. చెట్టు ఎవరిని పడదోయదు, మనం జాగ్రత్తగా దిగడం నేర్చుకోవాలి.

అట్లాగే ఈనాడు నేను 72 సంవత్సరాలు జీవించినందుకు, ఈ నా స్థితిగతులకు ఈశ్వరుడే కారణం అనుకోవడం నాకు నమ్మశక్యం కాకుండావుంది. దేవుని అస్తిత్వాన్ని గురించి నేను ప్రశ్నించడంలేదు. దేవుడున్నాడా లేడా అనేది ఈనాటిది కాదు, అది తేలేదీకాదు. ఎవ రికి వారు సమాధాన పడవలసిందే. ఆస్తికుని మూర్ఖునిగాను, నాస్తి కుని పాపందునిగాను నేను భావించను. కాని ఈశ్వరుని విశ్వసించిన మనసు, ధిక్కరించిన మనసు ఉత్తమగుణా లందుకోకపోతే వృథా అని భావిస్తాను.

మా వూళ్ళో కార్తీక పౌర్ణమికి జలధీశ్వరాలయంలోని రెండు ధ్వజస్తంభాలకు వరిగడ్డితో వెంటి కట్టేవారు. దేవాలయంనుండి అర్చ కుడు అగ్నిహోత్రం అంటించేవాడు. దీనిని జ్వాలాతోరణ మంటారు. ఆ తోరణంలోని గడ్డి పరకలకోసం ఒకరిమీద ఒకరుపడి లాక్కొని పోయేవారు. ఆ పరకలను తీసుకుని పశువులకు వేసే ఏ జబ్బు రాదని ఒక విశ్వాసం. నన్నెక్కడతొక్కి వేస్తారోనని దూరంగానిలబడి చూస్తూ వుండేవాడిని. ఎక్కడన్నా ఒక పరక దొరికితే నా అంత అదృష్టవంతుడు లేడనుకొనేవాడిని.

మొదటినుండి నేను నోరులేనివాడిని, క్రియారహితుడను, ఉపేక్షాశీలిని. ముఖ్యేవళ్ళు వచ్చాకకూడా ఈ లోక వ్యవహారాలకు రోసి, సన్యసించాలని అనుకొనేవాడిని.

మొదటినుండి నాది మత దృక్పథమే. బందరులో క్రైస్తవ కళాశాలలో చదవడం, బ్రహ్మమందిర ప్రాంగణంలో వుండడం, ముట్నూరి కృష్ణారావు, కాశా శ్రీరామశాస్త్రి, చెరుకువాడ నర

సింహంగార్ల శిష్యరికం దీనికి దోహదం చేశాయి. మహాత్మాగాంధీ తత్వానికి వశుడనై, స్వాతంత్ర్యసమరంలో పాల్గొని, జైల్లో భగవద్గీత బట్టీ పెట్టాను. భర్తృహరి సుభాషితం, కృష్ణకర్ణామృతం కొంతవరకు కంఠస్థం చేశాను.

జైలునుండి బయటకు వచ్చినతర్వాత "శుష్క-వేదాంత తమో భాస్కరం', 'జీవబ్రహ్మైక్య వేదాంతసారము' మొదలైన గ్రంథాలను పఠించాను.

ప్రతిదినం స్నానంచేసి బొట్టు పెట్టుకొని గీతాపారాయణమో, భక్తి శతకాలలోని పద్యాలనో పారాయణంచేసిగాని, భోజనంచేసే వాడినిగాను.

తర్వాత వివేకానందస్వామి, స్వామిరామతీర్థ, దయానందసరస్వతి గ్రంథాలు చదివాను. అవి నాలో ఆలోచనలు రేకెత్తించినవి. నన్ను నవ్యమానవునిగా చేసినవి.

దయానంద సరస్వతి, 'సత్యార్థప్రకాశిక' అన్నిమతాలను, అవతారాలను, పురాణేతిహాసాలను ఖండించి, వేదమతాన్ని వినిపించింది. ఆ వాదనే ఆ వేదమతాన్నికూడా తోసివేయాలనే పూనిక చేకూర్చింది.

అయితే నేను నిరీశ్వరవాదినిగాను, ఈశ్వరభక్తునిగాను, దేవుడు ఈ నరకకూపంలో పడేశాడని, ఆయన్ని స్మరించితేగాని, ముక్తిలేదని నేను నమ్మలేను.

మత విశ్వాసాలు ఆచరణకు అసాధ్యమైన గుదిబండలని, మానవుని ప్రేమించడం సాధారణమైనదని, ప్రయోజనమైనదని గ్రహించాను. నా దృష్టి ఇప్పుడు హేతువాదంవైపుకు, మానవతా వాదం వైపుకు పోతున్నది.

"మరణంకంటె జీవితం ముఖ్యమని, దేవుడికంటె కళ్ళముందున్న మానవుడు ముఖ్యమ"ని అన్న కన్‌ఫ్యూషియస్ అభిప్రాయం నచ్చింది.

తోటిమానవుని సేవచేయడం చేతగాని మనం దేవతలను, దేవుళ్ళను మెప్పించగలమా ?

మానవులను పరస్పరం బంధించేది ప్రేమ. ప్రేమే పెన్నిధి. ప్రేమించడమంటే పెరగడం.

నన్ను నేను మరమ్మతు చేసుకుంటూ అన్యసుఖాపేక్ష లేనిది. ఆత్మ సుఖం లేదనుకుంటున్నా — కాదు — అన్యసుఖాపేక్షే ఆత్మ సుఖాపేక్షగా భావించుకొంటున్నా.

నాకిప్పుడు మతంమీద, గతంమీద మోజు పోయింది. జీవితంలో విజ్ఞానజ్యోతిని చేపట్టి, ప్రేమ పథాన పయనించ పూనుకొన్నా.

'No quality will get a man more frinds than a disposition to admire the quality of others '

— Boswell.

మానవుని స్వభావాన్ని, ప్రవర్తనను నిర్ణయించే ప్రధానశక్తిని జీవితసూత్రం అంటారు.

మా గురువులు కీ॥ శే॥ ముట్నూరి కృష్ణారావుగారు "రసానందో బ్రహ్మ" మంత్ర రహస్యార్థ విబోధితులు. అనగా వారి జీవిత సూత్రం రసపిపాస. వారి ఉపాస్యదైవం నిఖిలరసామృతమూర్తి.

"పిత్రార్జితమైన ఆ పాత యింటికే నాజూకులు, నగిషీలు, మందువాచుట్టూ రంగవల్లులను చెక్కించడమో, హాలులో అక్క-

దక్కడ ఆగ్రా చలువతాళ్ళను తాపించడమో, స్తంభాలకు చెక్కడపు ఆర్చీలను పెట్టించడమో, సింహద్వారంపైన పద్మపీఠిపైన లక్ష్మిని కుడ్యాలంకారంగా బిగించడమో, ఏదో ఒకటి తోస్తూనే వుంటుంది ఆయనకు. ఆ సందుగొందుల ఆఫీసులోను అంతే. ఆ వున్న జానెడు బెత్తెడు ఆవరణలోను శిలావిగ్రహాలు, పర్ణశాలలు, కాసారాలు, లతాకుంజాలు, ఆతిచపటాలు, తోటపసందులు, నందనవనం సృష్టించాలని సంకల్పం.

"కృష్ణాపత్రిక తయారుగోకూడ రసప్రవాహం గోచరిస్తూంటుంది ఆ బొమ్మలు, ఆ మకుటాలు – గ్రహించేవాళ్ళకు తెలుస్తుంది వాటి విలువ !

"ఈ రసకాంతే కృష్ణారావుగారి దుస్తులలోగూడ అగుపిస్తుంది. ఆయన అతి మోహాన వేషధారి. మొదట్లో కాలర్ కోట్లతోనూ, నెక్‌టైలతోను, క్లిప్పులతోను ఆయన మురిసిపోయినా, పంజాబు హత్యల కాలంనాటినుంచీ ఒకే మోస్తరు ఖద్దరువేషాన్ని ఖాయపరిచారు ... కాని అందులోనూ ప్రత్యేకత."

అట్టి నా గురుదేవులకు జోహారులర్పించి, యిక నా సంగతి.

ఎవరిలో, ఏ రచనలో, ఏమాత్రం గుణంవున్నా ప్రశంసించకుండా వుండలేను. ఇది నా జీవితసూత్రం. నేను ఇన్ని జీవితచరిత్రలు వ్రాశానంటే ఇందుకే. ఆమాటకొస్తే నా రచనలన్నీ అందుకే. ముఖ్యంగా 'అశ్రురాభిషేకం', 'శరద్దర్శనం', 'చలం'.

'మిత్రులూ – నేనూ' కూడ అందుకోసమే.

ప్రశంస ఎంతో ప్రయోజనకరమైనది. కాని దీని ప్రయోజనం మనలో చాలామంది గమనించనందుకు విచారం. ప్రశంస అనే ఒక మాట ఎంతో ఆహ్లాదకరమైనది.

తల్లి చంకనున్న బిడ్డను చూచి "ఎంత చక్కని బిడ్డమ్మా" అంటే ఆమె ఆనందానికి అంతుండదు.

దంపతులుకూడా పరస్పర ప్రశంసవల్లనే ఆనందం పొందగలరు. సహచరణిని కాస్త ప్రశంసిస్తే, ఎంతో ఆనందిస్తుంది నీవిచ్చే చీరలు, నగలకంటె.

తల్లులు పిల్లల్ని దుమ్మెత్తి పోసినందువల్ల అనర్థమేకాని లాభం వుండదు. ప్రశంసవల్లనే వారు పెంపొందుతారు. ఉపాధ్యాయులు కూడ విద్యార్థులను కొట్టి తిట్టేకంటె మెచ్చుకోవడంవల్లనే వారిలో మార్పు వస్తుంది.

There is a magic in a word of praise.

కాని ప్రశంస పెదవులనుండికాక హృదయపద్మంనుండి రావాలి. ఒక దయగల మాట, ఒక చల్లని చూపు, ఒక చిరునవ్వు, మంచిమాట మానవహృదయాలను బంధిస్తుంది.

కష్టంలో వున్నవారియెడల సానుభూతి చూపడంవల్ల ఉపశాంతి పొందుతారు. సానుభూతి బ్రదుకుభారాన్ని తగ్గిస్తుంది.

మానవుల వేదనకు మన హృదయం స్పందించాలి. మెత్తని మనసు కావాలి.

పరస్పరం స్తోత్రం చేసుకోరాదు. స్తోత్రం అనేది లేనిసంగతి చెప్పడం. ప్రశంస ఉన్నసంగతి గురించి. దీని వలన మనలో ఉన్నత గుణాలు వృద్ధిచెందుతాయి. మనలోని అనురాగలత పెంపొందుతుంది.

విద్యార్థిదశనుండి మిత్రులు కావాలనే ఆకాంక్ష నాలో ప్రబలంగా వుండేది. కాని సహజంగా సిగ్గరిని. అరవైఏళ్ళు వచ్చాకనే, నాకు జీవితం అంటే ఏమిటో కొంతవరకైనా అర్థమయింది. అప్పటినుండి నా కృషి స్నేహసంపద కొరకే. అది నా కానందం. ఇప్పుడు నాకు కావలసినంతమంది మిత్రులున్నారు. అయినా నాకు తనివి తీరదు ...

‘సుబ్బయ్యా, నీ మిత్రులు, ప్రేమకు, ఆప్యాయతకు మారు మూర్తులూ నీవొక ప్రేమరాజ్యాన్ని నిర్మించుకున్నావు. నీ మిత్రులలో స్వార్థంలేదు. అదే నిజమైన మైత్రి. నీవు చాలా అదృష్టవంతుడవు. అని అంటాడు మిత్రుడు గొట్టిపాటి బ్రహ్మయ్యగారు.

అసలు స్నేహమనేది యిద్దరు పరాయి వ్యక్తులను పరిచితులను చేసి, వారిమధ్య ఆత్మీయతను అభివృద్ధి పరుస్తుంది.

“ఎవరితోనైనా గాఢంగా మైత్రి పెంచుకోవాలని వుందానీకు? అయితే ఆ మనిషితో మాట పట్టింపు పెట్టుకోకు ఎప్పుడూ. ఇచ్చి పుచ్చుకోవడాలు పెట్టుకోకు. ముఖ్యంగా అతని భార్యతో మాటా మంతీ పెట్టుకోకు !” ఇది వెనకటి మాట! నాకు స్నేహితుల భార్యలతోనే మాటామంతీ ఎక్కువ. నాది వ్యక్తి స్నేహంకాదు, కుటుంబ స్నేహం. అయితే నా పెద్దరికం (వయసు) వలన ఆ చనువు అపార్థాలకు దారికాదు. నా నేస్తం కాళోజీకూడ వ్యక్తితోనే స్నేహంచేసి వూరుకోడు. ఆ కుటుంబంలో తానూ ఒక మనిషిగా కలిసి మెలసి పోతాడు.

“కష్టసుఖాలు పంచుకుంటూ, జీవితమార్గానికి వెలుగు చూపిస్తూ ఉత్సాహపరిచేవాడే నిజమైన మిత్రుడు.”

"కలుసుకుంటే బాధకలిగిస్తాడు శత్రువు. కలుసుకోకపోతే బాధ కలిగిస్తాడు మిత్రుడు."

"స్నేహితులు ఫిడేలు తీగ వంటివారు. తీగను ఆట్టే బిగించ గూడదు."

"పరిహాసానికైనా స్నేహితుని మనసుకు శూలంగా గుచ్చుకునేది, కష్టంకలిగించేవిసిగుపరిచేవి, మాటలు, బుద్ధిమంతుడుపలకరాదు."

నా మిత్ర సంపద పెరిగింది ముఖ్యంగా వేగుంట కనకరామ బ్రహ్మం, తుమ్మల కృష్ణాబాయిగార్ల వలన. వారికి నా కృతజ్ఞత.

శ్రీ సంజీవదేవ్‌తో అనేకులను మైత్రిచేకూర్చిన అదృష్టం కలిగినందుకు ఆనందిస్తున్నాను.

నేను నేర్చుకున్నది స్వల్పం. ద్వేషంకంటె సానుభూతి ఉత్తమమైనదని, న్యాయబుద్ధికంటె కనికరం మంచిదని, స్నేహపూరిత నేత్రాలతో లోకంవంక చూచేవారికి ఎక్కువమందిఆప్తులులభిస్తారనిమాత్రమే తెల్సుకున్నాను.

మైత్రిని దృఢపరుచుకోవడానికి ప్రయత్నిస్తూ, వారి యోగక్షేమాలు తెలుసుకుంటూ, వారి అభిరుచుల అభివృద్ధికై ఉత్తరాల ద్వారా కృషిచేస్తూ. అప్పుడప్పుడు వారిని సందర్శిస్తూంటాను. ఇది నా ధోరణి.

ఒక వ్యక్తి ఏ మార్గాన్ని అనుసరించినా, అది అతని స్థాయిని పెంచగలిగితే అది మంచిదే. అయితే అతడు తన అభిప్రాయాలను, నమ్మకాలను మిత్రులమీద రుద్దరాదుగదా !

"మనుష్యులు ఎదిగినకొద్దీ రక్తబాంధవ్యానికిగాక, భావ బాంధవ్యానికే ప్రాధాన్యమిస్తారు."

"స్నేహం అంటే వయసుతోపాటు పరిణతినొందే మానసికానుభూతి. స్నేహం చేయడంకంటె, నిలుపుకోవడంలో మానవ స్వభావ సౌశీల్యాలు వెల్లడవుతాయి."

"చాలామంది తను కుపయోగపడే స్నేహాలు చేస్తారుతప్ప హృదయసౌరభంకోసం స్నేహాలు చేయడం నేర్చుకోరు."

నా స్నేహం ఎదుటి వ్యక్తిలోని ఆత్మీయతను పెంపొందించి, హృదయసౌరభం పొందడానికే.

స్నేహం స్నేహం కొరకే.

'ఈ వార్ధక్యంలో, "మిత్రులూ-నేనూ'' ప్రారంభించానమ్మా ఎలా పూర్తవుతుందో, నంటే మనుమరాలు హేమ "తాతగారూ! మీరు సరైన సమయాన ప్రారంభించారు. ఇప్పుడు మీ వయస్సు, మనస్సు పండాయి. మీరు పూర్తికానివ్వండి" అని తన చెల్లెలు 'కాంతం'కు వ్రాతపనిలో నాకు సహాయంగా అప్పగించింది. ఆమె యెంతో ఓర్పుతో, నేర్పుతో సహాయపడింది. ఇతర మిత్రుల ప్రోత్సాహం సహకారాల ఊతగాగొన్నారు.

ఈ మిత్రమండలి ఒక్కొక్క-సమయాన నా హృదయంలో బాగా ప్రవేశించింది. కొందరు తర్వాతకూడ మొదాలేదు. అయినా వారిని వదల్లేదు. ఒకసారి మైత్రి, జీవితపర్యంతం మిత్రుడుగానే భావించాను.

మరికొందరు ఇహలోకయాత్రచాలించారు. వారిని వీడలేదు.

ఈ మిత్రమండలి అంతా వివిధ కుసుమాలు - నేను దారాన్ని. దీన్ని ఇలా దండకట్టాను.

ఈ పుష్పాలన్నీ సుగంధభరితాలే. మాలను కూర్చటంలో నేర్పులేకపోయినా, వాటి అందచందాలు, సువాసన పోదుకదా ?

ఇది నా అదృష్టంగా భావిస్తున్నాను. ఇదొక వినూతన మార్గము. దారంవున్నా కనబడదు. దండదే సౌరభం. అయినా దారం లేకపోతే దండ వుండదు. పరస్పరం శోభిస్తవి.

చివర కోర్కె-మనవి. "Be to their fauts a little bli nd, Be to their Virtues very Kind"

ఇతరుల దోషాలను విస్మరించి, మంచిని గ్రహించండి. మానవుడంటే మిశ్రమ గుణాలు గలవాడు. నీవు మంచిగా వుండి, మంచి గ్రహించు.

ఘంటసాల }
1-3-1970 }

గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

# పరిచయము

ఆంధ్రసోదరులారా!

మనకందరకు సోదరులును, ప్రియమిత్రులును, ఆప్తులును, భాషా సేవకులును, పండితులును అగు, శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య అన్నగారిని యెరుగని ఆంధ్రులులేరు. ఈయన నిరాడంబము, సౌజన్యము జూచి లోకమున ముగ్ధులగుట ఆశ్చర్యముగాదు. ఈ పవిత్రమూర్తి మనవలెనే భారతస్వాతంత్రోద్యమమున పాల్గొని, చిరునవ్వుతూ చెరసాలల కేగిన స్వాతంత్ర్యయోధులు. వీరు తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో పండితులు.

భారతస్వాతంత్ర్య పోరాటమున మహాత్ముని శిష్యులై, ఆంధ్ర దేశమున పట్టణములు, పల్లెలు, స్వయముగ సంచారముచేసి, జ్ఞానులను, యువకులను, విద్యార్థులను ఉద్రేకపరచి, స్వాతంత్ర్య యోధులుగ తయారుచేసి, భారత దేశమున మన ఆంధ్ర దేశమునకు ఖ్యాతిదెచ్చిన రాజకీయయోధులు, ఏకైక ఆంధ్రనాయకులని భారత వర్షమున ఆంధ్రజాతికి కీర్తి దెచ్చిన మన ప్రియమైన, ఆదర్శమైన నాయకులు శ్రీ టంగుటూరి ప్రకాశంపంతులు జీవిత చరిత్రను వ్రాసి ప్రకటించిన త్యాగి మన వెంకటసుబ్బయ్య అన్నగారు.

తత్వవేత్తలు, పండితులు, విశ్వదాత, ఆంధ్రపత్రిక సంపాదకులు అగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారి జీవితచరిత్ర వ్రాసి ప్రకటించిన ధన్యులు, మన అన్నగారూ. ఆంధ్రదేశమున పంతులుగారి సహాయములేని సంస్థ, ఉద్యమము లేదని చెప్పవచ్చును. గ్రంథాలయోద్యమమునకు, హరిజనోద్ధరణకు, కాంగ్రెస్ ఉద్యమమునకు, కాంగ్రెస్ యోధులకు, కవులకూ, పండితులకు లక్షలకొలది రూప్యములు దానముచేసిన త్యాగమూర్తులు మన పంతులుగారు.

ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయమున విద్యార్థి సంఘమునకు కార్యదర్శిగ నెన్నుకొనబడిన ప్రథమ భారతీయులు. ఆయన ఆంధ్ర, ఆంగ్ల భాషలలో పండితులై, భారత దేశమున విజ్ఞాననిధి యని కీర్తి దెచ్చుకొనిన ధన్యులును, ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు వైస్ చాన్సలర్ అయి, భారత విశ్వవిద్యాలయములలో ముఖ్యమైన విద్యాలయ కోవకు చెందునటుల ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు కీర్తిదెచ్చిన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారి జీవితచరిత్రమును వ్రాసిన ధన్యులు మన అన్నగారు. పాంచాల దేశ కేసరి, భారతనాయకులలో అగ్రగణ్యులును, స్వాతంత్ర్యయోధులును, భారతయువకులను మేల్కొల్పిన రాజకీయ నాయకులైన లాలాలజపతిరాయ్ జీవితచరిత్ర వ్రాసిన పూజ్యులు మన అన్నగారు.

భారత దేశ రైతుఉద్యమ నాయకులును, పార్లమెంటు సభ్యులును అగు శ్రీ ఆచార్య రంగాగారి జీవితచరిత్రమునుకూడా వ్రాసిరి. ఆంధ్రశాసన పరిషత్తు అధ్యక్షులును, కాంగ్రెస్ నాయకులును, మన రైతుపెద్ద శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి చరిత్రను కూడ ప్రకటించిరి.

ఆంధ్రుల చరిత్రము శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారును, ఆంధ్రకవుల చరిత్రములు శ్రీ కందుకూరి వీరేశలింగంపంతులుగారు ప్రథమమున ప్రచురించి ఆంధ్రులకు మార్గదర్శకులైరి. వారు మద్రాసు ఓరియంటల్ లైబ్రరీలోను, శాసనములు దొరకు చోట్లకును వెళ్ళి అనేకవిధముల కష్టములుపడి ఆయా చరిత్రములు ప్రచురించి ఆంధ్ర భాషామతల్లిని అలంకరించి ధన్యులైనారు. ఆ విధముగనే మన అన్నగారు వెంకటసుబ్బయ్యగారు యింకను యెక్కువ శ్రమచేసి వారికి పరిచయమైన కవులతోను, పండితులతోను, సంఘ సేవకులతోను పరిచయము, స్నేహమే గాక, నూరుమందికంటె యెక్కువ మిత్రులతోను, వారికుటుంబ సభ్యులతోను, అంటే వారి శ్రీమతులకు అన్నగాను, వారిబిడ్డలకు తాతగాను పరిచయమై వారి ఆదరాభిమానములు అందుకొని వారికి తన ఆదరాభిమానములు అందించి, వారి కుటుంబ

సభ్యులుగా మారినవారు మన అన్నగారు. అంతేగాక వారి మిత్రులతోకూడ కలిసికొనుటకు, అనేక పట్టణములకు, పల్లెలకు స్వయముగా వెళ్ళి అనేకమానసములు సంచారముజేసి చరిత్రలు సంపాదించిన ధీరులు. కొందరు తమను విసిగించవలదని విసుగుకొనినను, నెమ్మదిగ వారిని ప్రతిమాలి చరిత్ర విశేషములు తెలిసికొని చరిత్రములు వ్రాసిన పూజ్యులు అన్నగారు. అనేక వందలమంది ప్రజలతో పరిచయమును, ఆదరాభిమానములు పొందిన దివ్యమూర్తి అన్నగారు. మిత్రుల చరిత్రములతోపాటు వారి సంగతినికూడా ప్రచురించుట యొక క్రొత్త పద్ధతి అన్నగారిది.

పైన వ్రాసిన చరిత్రములేగాక ఈ క్రింద నుదహరించిన కవుల, పండితుల, సంఘసేవకుల చరిత్రలుకూడ వ్రాసి ఆంధ్రభాషాదేవి కరకమలములందుంచి ఖ్యాతిగాంచిన వెంకటసుబ్బయ్య అన్నగారు ధన్యులు.

మాగంటి బాపినీడు, చెరుకువాడ నరసింహం, తెలుగులెంక, తుమ్మల సీతారామమూర్తి చౌదరి, పింగళి లక్ష్మీకాంతం, వేలూరు శివరామశాస్త్రి, ఆంధ్ర, సంస్కృత, ఆంగ్ల, వంగ, హిందీ పండితులగు శ్రీ సంజీవదేవ్, చింతా దీక్షితులు, కాళోజి నారాయణరావు, చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీవాత్సవ, శ్రీ బుచ్చిబాబు, శ్రీ బూదూరు రామానుజులురెడ్డి, పూతలపట్టు శ్రీరాములురెడ్డి, చెరుకుపల్లి జమదగ్ని, కాకాని నరసింహారావు, గోపీచంద్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, దర్శి చెంచయ్య, పిల్లలమర్రి వెంకటహనుమంతరావు, నార్ల వెంకటేశ్వరరావు, దిగవల్లి వెంకటశివరావు, అడుసుమల్లి నారాయణరావు, శ్రీమతి కృష్ణాబాయి, హేమా, వడ్లపట్ల లలితాంబ, కలిదిండి నారాయణరాజు, రంధి సోమరాజు, ఆచంట జానకిరామ్, జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, వేగుంట కనకరామబ్రహ్మం, వెలమాటి పద్మనాభం, గొర్రెపాటి వెంకటేశ్వర్లు, కొత్త భావయ్యచౌదరి, అయ్యంకి వెంకటరమణయ్య, మల్లెల శ్రీరామమూర్తి వల్లభనేని కాశీవిశ్వ

నాథం, డాక్టర్ సదాశివరావు, మాగంటి సీతారామదాస్, లింగం వీరభద్రయ్య, జి. వి. నరసింహారావు, వెలమాటి శ్రీమన్నారాయణ మూర్తి, శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య అన్నగారు, వేగుంట కనకరామబ్రహ్మం, పండితులు సంజీవదేవ్, కలిదిండి నారాయణ రాజుగార్లు ఆంధ్రదేశమున మిత్రమండలిని స్థాపించి సంక్రాంతి పండుగలలో రెండురోజులు సభలు జరిపి, కవులను, యువకవులను, పండితులను, విజ్ఞానులను సమావేశపరచి ఉత్సాహం కలుగజేయు చున్నారు. వెంకటసుబ్బయ్య అన్నగారు కొంచెం సుస్తీజేసి ప్రస్తుతం నీరసముగ నున్నందుకు విచారముగ నున్నది. వారికి చక్కని ఆరోగ్యము కలుగజేసి చిరంజీవిగజేసి వారు యింకను సేవజేయ భగవానుడు ఆశీర్వదించగోరుచున్నాను.

కూచిపూడి
1-5-70

ఇట్లు,
శరణు రామస్వామిచౌధరి

# పరిక్రమము

సృష్టిలో మైత్రికిమించిన మధురిమలేదని, వేంకటసుబ్బయ్యగారి మిత్రులకు అవగాహన అయినట్లుగా, మరొకరికి కాదంటే అత్యుక్తి కాదు. అనేక జీవితచరిత్రలను, యితర గ్రంథాలను రచించి తెలుగు భాషాసమితి, ఆంధ్రసాహిత్య అకాడమీద్వారా ప్రభుత్వ బహుమానాలను బడసిన వేంకటసుబ్బయ్యగారు, తన జీవితచరిత్రను వ్రాయకపోవడం ఆంధ్ర సారస్వతానికి ఒక విధంగా లోటనిపిస్తుంది. వారి స్వీయచరిత్రను రచించవలసినదిగా అనేకమంది స్నేహితులు వారిని పదేపదే కోరిన దానికి ఫలితమే యీ "మిత్రులూ-నేనూ" అనే గ్రంథం.

ఆంధ్రదేశంలో అనేక రంగాలలో తనకు మిత్రులతోగల సంబంధాలను వ్యక్తంజేస్తూ, వివిధ వుద్యమాల స్వరూపాన్ని చక్కగా సమీక్షించారు యీ గ్రంథంలో, వెంకటసుబ్బయ్యగారు. తన జీవితచరిత్రను, తన మిత్రులద్వారా చిత్రించడం, మన సాహిత్యంలో ఒక క్రొత్త ప్రక్రియ. ఇది కేవలం తన చరిత్రమాత్రమేగాక ఆయనకు సన్నిహితులయిన చాలమంది చరిత్రలుకూడా ఒకరకంగా చూస్తే. ఈ విధంగా తెలుగు సాహిత్యంలో యింతవరకు ఎవరూ attempt చేయలేదేమో !

జీవితచరిత్ర వ్రాయుటలో గొర్రెపాటివారు పొందిన శ్రమ ఏ రచయితా పొందియుండడనుకుంటూ. తన రచనలకు విషయసేకరణ నిమిత్తం శ్రీకాకుళంనుండి చిత్తూరువరకు తిరిగి ఎందరెందరినో కలుసుకొని నిజమయిన చరిత్రను, ఎన్నో వివరాలను తెలుసుకొనిగాని తన రచన కుపక్రమించరు. తన రచనలోని నిజాయితీ వుంటేనేగాని అసలు సుబ్బయ్యగారు వ్రాయరు.

యనభైమూడ్వ పడిలోపడ్డా వెంకటసుబ్బయ్యగారు యింకా స్టూడెంటు మోస్తరుగా నోటుబుక్కు జేబులోపెట్టకొని క్రొత్తక్రొత్త విషయాలను నోటుచేసుకుంటూ వుంటారు.

ఆంధ్రదేశంలో అన్ని మండలాల్లోను ఆయనకు సారస్వత మిత్రులున్నారు. ఆ మిత్రుల పరివారమంతా ఆయనకు ఆత్మబంధువులే. ఆయన ఎవరింటికివస్తే ఆ యింటిలోని పసిపిల్లలనుండి పండు ముసళ్ళవరకు పండుగలా ఫీలవుతారు. మమత, మానవత మూర్తీభవించిన మహామనీషి ఆయన. అందరికీ "నానాడే". అందరిని ఒకే రకంగా ప్రేమించే విశ్వప్రేమి. ప్రతివారిలోవున్న మంచిని వెదకటమే అందని లోతులలోగల ఆయన మంచికి తార్కాణం. నిష్కాపట్యానికి, నిరాడంబరత్వానికి, శాంతానికి, సహనానికి చిహ్నం ఆయన మూర్తి. ఆయన మిత్రులలో ఎవరికయినా కించిత్తు ఆపద తటస్థించిందంటే అక్కడకు రెక్కలు కట్టుకు వాలాలిసిందే. ఆ ఆప్యాయతకు ఏ షరాబు విలువ కట్టగలడు? అది హృదయగతంతప్ప మాటల్లో మలచడం అసాధ్యం.

తనకు సన్నిహితులయిన ప్రతివారిని కులమత భేదముల కతీతంగా వారి వరుసలతో పిలుస్తూ సంభాషణలో సున్నిత హాస్యాన్ని మేళవిస్తూ పూలచెండులు విసరినట్లు మాటలు విసురుతూ అందర్నీ ఆనందపరుస్తూవుంటారు. ఆయన సాన్నిధ్యం నిజంగా నిండు పూర్ణిమా జ్యోత్స్న. ఒక్కసారి ఆయన పరిచయాన్ని చవిచూచినవారు యింక ఆయన్ను వదలలేరు.

"Goodness must be joined with knowledge, more goodness is not of much use as I leave found in Life." అని అన్నారు మన జాతిపిత ఎక్కడో ఒకచోట. ఈ మాట మన గొర్రెపాటివారికి చక్కగా అన్వయం అవుతుంది. విజ్ఞానం, వివేకం చెట్టాపట్టాలు పట్టుకొని ఆయనలో పుంజీభవించాయి. అమృతంతోనిండిన ఆయన హృదయం, పైవాటికితోడై ఒక అపూర్వ వ్యక్తినిగా మలచింది ఆయన్ను.

"మధురజీవన" కర్తలై ఎందరికో మధుర జీవనంపట్ల ఆసక్తిని కలుగజేస్తూ, సౌభ్రాతృం, సౌమనస్యం, సర్వమానవలోకంలో వెల్లివిరియటం సాధ్యమేనని తలస్తూ విశ్రాంతి తీసుకొనే వయస్సులో కూడా ఓపిగ్గా, శ్రద్ధగా తెలిసిన ప్రతి ఒక్కరిని పరామర్శిస్తూ చెప్పడానికే తప్ప సామాన్యుడు ఆచరించడానికి వీలుకాని ఆశయాల నెన్నింటినో ఆయన జీవితంలో మేళవించికొన్న ఆదర్శప్రాయాలు శ్రీ వెంకట సుబ్బయ్యగారు.

ఈమధ్య ఆయనకు బాగా అనారోగ్యం ఏర్పడ్డప్పుడు ఆయన మిత్రులంతా తమకు పెద్ద ఆపద తటస్థించినట్లుగా భావించడం వీరందరి హృదయాలలో ఆయనకుగల స్థానం వెల్లడవుతుంది. అట్టి స్థితిలో అనేక గ్రంథాలను రచించి స్వయంగా ప్రచురించుకొన్న ఆయనకు, యీ గ్రంథం అచ్చుముచ్చటలభారం ఆయన మిత్రులు వహించి గ్రంథాన్ని సమర్పించి ఆయన్ను సన్మానించడం అన్నివిధాల బాగుంటుందని మా మిత్రులు నారాయణరాజుగారికి, మా చెల్లాయి, కృష్ణాబాయికి, నాకు అనిపించి, గ్రంథప్రచురణకు ఆర్థికసహాయం నిమిత్తం ఒక "విజ్ఞప్తి"ని పంపించాం. దాన్ని పురస్కరించుకొని చాలమంది మిత్రులు తమ తమ విరాళాలను పంపారు. వారందరికి మా కృతజ్ఞత.

ఈ గ్రంథమునకు పరిచయము వ్రాసిన పెద్దలు శరణు రామస్వామిచౌదరిగారికి వందనము లర్పిస్తున్నాను.

శ్రీ వెంకటసుబ్బయ్యగారికి యిప్పుడిప్పుడే కొంత స్వస్థత చేకూరుతూవుంది. వారు త్వరలోనే పూర్తిగా ఆరోగ్యవంతులయి మనందరి మధ్య యింకా పది కాలాలపాటు మని మనకందరకు ఆనందం అందించాలని నా మనఃపూర్వకమయిన వాంఛ.

ఏలూరు
1-8-1970

ఇట్లు
వేగుంట కనకరామబ్రహ్మం

# వందనాలు

ఈ విధంగా మిత్రులు తోడ్పడి, దీన్ని వెలుగులోనికి తీసుకొని వచ్చినందుకు వందనాలు.

దీనిలో సత్యాన్నే చెప్పటానికి ప్రయత్నించాను.

కొన్ని పొరపాటు లుండవచ్చు. 'ప్రమాదోధమ తామసి' అన్నారుగదా ! క్షమించ వేడెదను.

ఈ శరీరయంత్రాన్ని, ఇదివరకే నేను, నిర్దాక్షిణ్యంగా బాధ పెట్టాను.

ముసలితనమూ, వ్యాధీ, దీన్ని ఇంకా కృంగతీస్తున్నాయి.

ఈ పుస్తకంద్వారా, మిత్రులఋణం తీర్చుకొన్నానని తృప్తి.

దీన్ని, మిత్రులందరకు రామబ్రహ్మంగారు అందేటట్లు చేస్తాడు.

విజయవాడ }
10-8-70 }

సెలవు
గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

# వి షయ సూ చి క


1. శ్రీ గొర్రెపాటి వెంకటేశ్వర్లు .... .... 17
2. శ్రీ మాగంటి బాపినీడు .... .... 21
3. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య .... .... 26
4. శ్రీ వేమూరి సీతారామయ్య .... .... 30
5. శ్రీ అయినపూడి గోపాలకృష్ణయ్య .... .... 33
6. శ్రీ కొల్లిపర సూరయ్య .... .... 36
7. శ్రీ లింగం వీరభద్రయ్య చౌదరి .... .... 39
8. శ్రీమతి గొర్రెపాటి కుటుంబం .... .... 41
9. శ్రీ చెరుకువాడ వెంకటనరశింహం .... .... 53
10. శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రి .... .... 60
11. శ్రీ వేమూరి నాగయ్య .... .... 63
12. శ్రీ కిసాన్, గొట్టిపాటి వెంకటసుబ్బయ్య .... .... 65
13. శ్రీ దోనేపూడి సీతారామయ్య .... .... 71
14. శ్రీ ముమ్మనేని లక్ష్మీనారాయణ .... .... 75
15. శ్రీ తుమ్మల సీతారామమూర్తి .... .... 79
16. శ్రీ కవిపాదుషా పువ్వాడ శేషగిరిరావు .... .... 85
17. శ్రీ కాకాని నరసింహారావు .... .... 89
18. శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య .... .... 92
19. శ్రీ మల్లెల శ్రీరామమూర్తి .... .... 94
20. శ్రీ పాతూరి నాగభూషణం .... .... 95
21. శ్రీ శరణు రామస్వామి చౌదరి .... .... 97
22. శ్రీ వేమూరి వెంకట్రామయ్య .... .... 100
23. శ్రీ తుమ్మల గోపాలకృష్ణయ్య .... .... 107
24. శ్రీ కొత్త భావయ్య చౌదరి .... .... 110
25. శ్రీ గద్దె లింగయ్య .... .... 113
26. శ్రీ టొండలపాటి శివరామకృష్ణ ✓ .... .... 115
27. శ్రీ వేలూరి శివరామశాస్త్రి .... .... 120
28. శ్రీ చింతా దీక్షితులు .... .... 125

| | | | |
|---|---|---|---|
| 29. | శ్రీ గోపీచంద్ | .... .... | 129 |
| 30. | శ్రీ మునిమాణిక్యం నరసింహారావు | .... .... | 134 |
| 31. | శ్రీ శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి | .... .... | 142 |
| 32. | శ్రీ కావూరి వెంకట్రామయ్య | .... .... | 147 |
| 33. | శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ | .... .... | 150 |
| 34. | శ్రీ డా॥ శ్రీపాద గోపాలకృష్ణమూర్తి | .... .... | 153 |
| 35. | శ్రీ దర్శి చెంచయ్య | .... .... | 158 |
| 36. | శ్రీ నార్ల చిరంజీవి | .... .... | 177 |
| 37. | శ్రీ పిల్లలమర్రి వెంకటహనుమంతరావు | .... .... | 183 |
| 38. | శ్రీ దిగవల్లి వెంకటశివరావు | .... .... | 186 |
| 39. | శ్రీ నార్ల వెంకటేశ్వరరావు | .... .... | 194 |
| 40. | శ్రీ పింగళి లక్ష్మీకాంతం | .... .... | 211 |
| 41. | శ్రీ కలగర నాగభూషణచౌదరి | .... .... | 214 |
| 42. | శ్రీ ఆచార్య రంగా | .... .... | 220 |
| 43. | శ్రీ నెల్లూరి వెంకట్రామానాయుడు | .... .... | 234 |
| 44. | శ్రీ సంజీవదేవ్ | .... .... | 239 |
| 45. | శ్రీ కోట అప్పయ్య శాస్త్రి | .... .... | 250 |
| 46. | శ్రీ కాళోజి నారాయణరావు | .... .... | 252 |
| 47. | శ్రీ కోగంటి దుర్గామల్లికార్జునరావు | .... .... | 267 |
| 48. | శ్రీ అడుసుమల్లి నారాయణరావు | .... .... | 269 |
| 49. | శ్రీ రాంషా | .... .... | 272 |
| 50. | శ్రీ శశాంక | .... .... | 276 |
| 51. | శ్రీ సోమసుందర్ | .... .... | 278 |
| 52. | శ్రీ డి. రామలింగం | .... .... | 283 |
| 53. | శ్రీ మహీధర జగన్మోహనరావు | .... .... | 288 |
| 54. | శ్రీ దేవులపల్లి రామానుజరావు | .... .... | 292 |
| 55. | శ్రీ దాశరథి | .... .... | 296 |

# శ్రీ గొర్రెపాటి వెంకటేశ్వర్లు

"జీవితం ఒక పుష్పం. ప్రేమ దాని సౌరభం" — విక్టర్ హ్యూగో

ఈయన 20 వ శతాబ్దంలో ప్రథమంగా ఆంగ్లభాష చదివేందుకు ఘంటసాలనుండి బయలుదేరిన యువకుడు.

బందరు నోబుల్ కాలేజీలో చదువుతూ 'బ్రహ్మ సమాజం గది'లో వుండేవారు. వందేమాతరం ఉద్యమ ప్రభావం, ముట్నూరి కృష్ణారావుగారి ఉపదేశంతో ఉత్తేజితుడై 1910 లోనే సాంఘిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొన్న దేశాభిమాని.

ఈయనకు మహాపురుషుల జీవితచరిత్రలు చదవడంచాలాఇష్టం. ఎంత కొత్తవారితోనైన చిటికెలో స్నేహం చేసుకునే స్వభావం గలవారు. డ్రాయింగు బాగా వేసేవారు. గ్రామంలో పార్టీలు లేకుండా ఐక్యతతో వుండేందుకు కృషి చేశారు. నిర్మొగమాటి, నిష్కపటి.

మంచి విద్యాభిమాని ఘంటసాలనుండి మాత్రమేగాక, ఇతర గ్రామాలనుండికూడ అనేకమంది యువకులను ప్రోత్సహించి, ఆంగ్ల భాషా పఠనానికై బందరు తీసుకొనివచ్చి, వారందరకు సంరక్షకుడుగా వుండి, వారి ఆరోగ్య విద్యా విషయాలను శ్రద్ధగా చూచేవారు. భోజన వసతికి, కానూరి వెంకట చలపతయ్యగారి సాయంతో హాస్టలు కూడ ఏర్పరిచారు. తన సంరక్షణలో వున్నవారికి మంచి నడవడి, సంఘసేవ, దేశసేవ, పెంపొందింపజేసిన యువజన నాయకుడు.

వెంకటేశ్వర్లుగారు గొర్రెపాటి వెంకయ్య, ఆదెమ్మ దంపతులకు 1893 లో జన్మించారు ఆయన బందరులో ఇంటర్ తప్పినందువలన కలకత్తాలో చదవాలని వెళ్ళారు. అక్కడ సీట్లు దొరకక నాగపూర్ వెళ్ళి, అక్కడ విషజ్వరంవలన 30-8-1916 లో అకాలమరణం చెందారు. ఆయన మరణం అందరికీ తీరని నష్టం.

కానూరి వెంకట చలపతయ్యగారు కృష్ణా పత్రికలో "ఆదర్శ వంతుడగు ఒక విద్యార్థి అస్తమయం" అనే శీర్షికతో ఆయనను గురించి వ్రాశారు.

మావూరి కుర్రకారు ఆయన వెంట వుండేవారు. విద్యార్థిదశ లోనే గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని, నన్ను స్వచ్ఛంద సేవకులుగా సభలకు తీసుకువెళ్ళి సాంఘిక సేవాభిలాష కలిగించడమేగాక, ఆ సభ లకు వచ్చిన నాయకులను గురించి తెలిపేవారు.

తన దగ్గరున్న బెంగాలీ పుస్తకం నాకిచ్చారు. బెంగాలీలో పండితుడైన కౌతా శ్రీరామశాస్త్రిగారివద్ద నాకు బెంగాలీ నేర్పించిం దాయనే.

వెంకటేశ్వర్లుగారి ద్వారానే కానూరి వెంకట చలపతయ్య గారి వంటి రైతు నాయకులతోను, ముట్నూరి కృష్ణారావుగారివంటి దేశ నాయకులతోను నాకు పరిచయ భాగ్యం కలిగింది.

1916 లో నన్ను కలకత్తాలో బ్రాహ్మో బాయిస్ హైస్కూల్‌లో చేర్పించింది ఆయనే.

ఘంటసాలలో రామమోహన గ్రంథాలయం 1914 లో స్థాపించిందికూడ ఆయనే. ఆయన తర్వాత మిత్రుల సాయంతో బ్రహ్మయ్యగారు, నేను దానిఅభివృద్ధికి పాటుపడ్డాం. ఆ గ్రంథాలయం ద్వారానే వయోజన విద్యా ప్రచారం కొంతచేశాం. ఆ గ్రంథా లయపు ప్రభావంతోనే దేశసేవ, సాహిత్యసేవ చేయాలనే అభిలాష మాకు కలిగింది. ఆ గ్రంథాలయమే నా రచనకు పునాది.

అందుచేత నా సాహిత్యసేవకు, దేశారాధనకు, ఒక్క మాటలో చెప్పాలంటే నా జీవిత సౌధానికి పునాదిచేసిన ప్రముఖులు వెంకటేశ్వర్లుగారే. నేనేగాక, మా గ్రామ యువజనులు ఈయన అడుగుజాడల్లో నడిచి దేశసేవకు అంకితమయ్యారు.

బ్రహ్మయ్యగారు, నేను, మరికొందరు ఆయనను ఆప్యాయంగా "అన్నయ్యా!" అని పిలిచేవాళ్ళం. ఆయన మాకు అన్ని విధాలా అన్నగారే. ఆయన చనిపోయినపుడు నేను చాలా విచారించాను. ఆయన గురించి మా వ్యాస సంగ్రహ గ్రంథంలో వ్యాసం వ్రాశాను.

అప్పట్లో నా భావాలు 'జీవనవేదము' అనే పేరుతో వ్రాస్తూ వుండేవాడిని. అలాగే వెంకటేశ్వర్లు అన్నయ్యను గురించి 1_9_1916న ఇలా వ్రాశాను. "నీవలె నాకు సుద్దులు చెప్పే మిత్రులు ఎక్కడ లభించెదరు? నీ ఋణమెట్లు తీర్చుకొందును? నీ ఆశయము లడుగంటునని చింతిల్లకుము.నీ ఆశయము నేను నెరవేర్చెదను. ఎన్నెన్నో కార్యములు చేసెదనని నాతో చెప్పివుంటివి. నీ గ్రామసేవ, దేశసేవ స్మరణీయం.నీవు మృత జీవుడవు"

"తండ్రీ! నా మిత్రుని ఆత్మకు శాంతి కలిగించెదవుగాక! అని నిన్ను ప్రార్థిస్తున్నాను"

3-9-1917లో మరల 'జీవన వేదము'లో ఇలా వ్రాశాను.

"నేను నీ వుద్దేశములను నెరవేర్చగలనా? నేను సాత్వికుడను. కచ్చితముగా మాట్లాడలేను. నాకు వుపదేశము చేసెడి వారెవరు? నా మాట వినెడి వారెవరు? కష్టములకు నే నెట్లు నిలువగలను? అయ్యో, స్వరాజ్యము రాకముందే పోతివా?

"పరమాత్మా! నీవు దయామయుడ వందురు! ఇదెట్టి కార్యము?

"నాకేదియు తోచడము లేదు.వెంకటేశ్వరా! నీ వుద్దేశ్యములు నెరవేరబడుగాక!"

"మన సారథి మన సచివుడు
మన వియ్యము మన సఖుండు మన బాంధవుడున్
మన విభుడు గురుడు దేవర,
మనలను విడనాడి చనియె"

అని అర్జునునివలె ఆక్రోశించా చాలకాలం.

నా జీవితాభ్యుదయానికి కారకు లెవరని ఆలోచించుకోగా ముగ్గురు కనిపిస్తున్నారు.

"అయిదుగురు ఆడపిల్లల తర్వాత రాళ్ళకు, రప్పలకు, చెట్లకు, పుట్టలకు మొక్కి నిన్ను కన్నాను. నిన్ను విడిచి వుండలేను. నీవు బందరు చదువుకోసం వెళ్ళవద్దని మా అమ్మ రత్తమ్మ కంట తడి పెడుతూ కూర్చుంది.

తల్లి తరువాత తల్లివంటిది మా పెద్దక్క సీతమ్మ. ఘంటసాల పాలెంలో వున్న ఆమెవద్దకు వెళ్ళి నా చదువు గొడవ చెప్పాను ఆమె దయామయి, భక్తురాలు, వివేకవతి కూడ ఆ అక్క ఇంటిపద్ద కొంత కాలం పెరిగాను. ఆమెకు పిల్లలు పుట్టిపోయారు. ఆమెకు నాయందు అమితప్రేమ. "ఇంటి గోడమీద 25 రూ॥లు పెట్టి కుండ బోర్లించా న"ని చెప్పి ఆ మూట ఇచ్చి "నాయనా! నీవన్నా చదువుకొని బాగు పడుమ"ని దీవించింది.

రెండవవారు వెంకటేశ్వర్లు అన్నయ్య He was my friend, philosopher and guide. ఆయనకు నా మొదటి పుస్తకం "గాంధీమహాత్ముని నిర్బంధం" 9-1-1922న అంకితమిస్తూ "సద్గుణ సంపన్నుడు, నిష్కపట హృదయుడును, దేశాభిమానియు, అస్మదియ మిత్రుడునగు గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారి కర కమలములకు ఈ చిన్ని పొత్తం అర్పించుచున్నాను" అని స్మరించాను.

ఇక మూడవవారు మా అల్లుడు శివరామకృష్ణ. ఆయన 'దేశి కవితామండలి' స్థాపించి నా గ్రంథాలను ప్రచురించడం వల్ల నే, నేను ఉత్సాహంతో గ్రంథ రచనచేసే అవకాశం కలిగింది.

ఈ మూర్తిత్రయం నా అభ్యుదయానికి కారకులు. వారికి నా స్మృత్యంజలి.

# శ్రీ మాగంటి బాపినీడు

జననం: 14, ఆగస్టు 1895

బాపినీడుగారిని ఆంధ్రదేశంలో ఎరుగని వారుండరు. ఈయన బందరు, కాకినాడలలో కొంతవరకు చదివి, కలకత్తా సిటీ కాలేజీలో బి. ఏ. పూర్తిచేసి, స్కాలర్‌షిప్‌మీద అమెరికాలో యం. యస్. సి పాసయ్యారు. 1923లో ఇండియాకు తిరిగివచ్చి, గాంధీగారి నాయకత్వంలో జాతీయోద్యమంలో పాల్గొని, జీవితాన్ని దేశసేవకు అంకితం చేశారు. ఆ మాటకొస్తే మాగంటివారి వంశమే దేశసేవకు పెట్టింది పేరు. వీరి సోదరీమణులు కలగర పిచ్చమ్మ, బొప్పన మాణిక్యాంబగార్లు కాంగ్రెస్ కార్యకర్తలు. బాపినీడుగారి భార్య అన్నపూర్ణాదేవి గొప్ప దేశభక్తురాలు. ఈమె మహాత్ముని ప్రశంసనుగూడ అందుకొన్న మహిళామణి.

బాపినీడుగారి సేవ, కార్యకలాపాలు రాజకీయాలకు మాత్రమే పరిమితమైనవి కావు. ఈయన నిర్మాణ కార్యక్రమంలో అందెవేసిన చెయ్యి. సాహిత్యం, గ్రంథాలయాలు, హరిజనసేవ యీయనకు కొట్టినపిండి. ఈయన గొప్ప సంఘ సంస్కర్త.

ఈయన రాజకీయ జీవితం కొనియాడదగింది. 1937లోనే శాసనసభ్యుడు. పార్టీ విప్‌గా కూడ పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడుగా, రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్‌కమిటీ సభ్యుడుగా, ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడుగా చాలాకాలం వున్నారు. కొంతకాలం రాష్ట్ర కాంగ్రెస్ పబ్లిసిటీ ఆఫీసర్‌గా కూడ పనిచేశారు ఆంధ్రా యూనివర్సిటీ సిండికేట్ మెంబర్‌గా ఈయన ఎనలేని సేవచేశారు. ఈయన గొప్ప ఆర్గనైజర్. నిర్మాణదక్షత బాగా ఎక్కువ. అందుకే హరిజనసేవలో ఈయన పేరుగాంచారు. హరిజన విద్యార్థులకు ఈయన ప్రేమపాత్రుడు. ఈయన అండదండలతో అనేకమంది విద్యార్థులు

చదువులలో బాగా పైకి వెళ్ళారు. బాపినీడుగారు తన చేతిమీదగా ఎన్నో హరిజన దేవాలయ ప్రవేశాలు చేయించారు. ఆ రోజుల్లో అది గొప్ప సంచలనం. అందులో ముందంజ వేయడంవలన ఆయన గాంధీ గారికి ఆప్తుడైనాడు. ఆంధ్ర దేశంలో హరిజనోద్ధరణ నిమిత్తం గాంధీ గారి సంచార కార్యక్రమం ఏర్పాటుచేసింది బాపినీడుగారే. బాపినీడు గారిని హరిజనబంధువు అనవచ్చు. ఆయన ఆంధ్ర హరిజన సేవకసంఘ కార్యదర్శి.

బాపినీడుగారు ప్రచురించిన 'ఆంధ్ర సర్వస్వం' నిజంగా గర్వ కారణం. ఒక్క మాటలో చెప్పాలంటే అది తెలుగుదేశానికి నిలువు టద్దం లాంటిది. అందులో తెలుగువారి సాంఘిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ, వ్యవసాయ, వాణిజ్య వగైరా విషయాలన్నిటిమీద ప్రముఖులచేత వ్యాసాలు రాయించారు బాపినీడుగారు. 'ఆంధ్ర సర్వస్వం' ఆనాటి యువకులకు ఎనలేని విజ్ఞానాన్ని అందించింది. ప్రతి లైబ్రరీలో ఆ పుస్తకం విధిగా వుండేది. తెలుగులో ఉత్తమగ్రంథాలు ప్రచురించే వారంతా ఆయన సలహాలు తీసుకునేవారు.

బాలసాహిత్యంలో కూడ యీయన మొనగాడు. ఈయన పిల్లలకోసం చాలా పుస్తకాలు రాశారు. అందులో 'పిల్లల బొమ్మల భారతం' అనే పుస్తకానికి ప్రభుత్వం బహుమతిఇచ్చింది. మహిళాభ్యు దయంకోసం కూడ యీయన అనేక పుస్తకాలు రాశారు.

బాపినీడుగారి శక్తిసామర్థ్యాలను, రాజకీయ, సాంఘిక, సాహిత్య సేవలను ఎవరూ సరిగా గుర్తించలేదనే చెప్పవచ్చు. నిజానికి ఈయన మరెంతో పేరు ప్రఖ్యాతులు పొందవలసినవాడు.

బాపూజీ పూరించిన శంఖారావంతో భారతనారీలోకం కూడ కదిలింది. తెలుగుదేశంలో మహిళలు బాగా ముందుకొచ్చారు. అలాంటివారిలో విశిష్టవ్యక్తి శ్రీమతి మాగంటి అన్నపూర్ణాదేవి. ఈమె బాపినీడుగారి అర్థాంగి. బాపూజీ మాటలలోనే యీమెను బొమ్మకడతా.

"1921 వ సం॥లో విజయవాడలో జరిగిన మహిళా సమావేశంలో ఖద్దరు వస్త్రధారిణియై ఉత్సాహంతోను, దీక్షతోను సభా వ్యవహారాలు శాంతంగా నడపడానికి కృషిచేస్తున్న సమయాన అన్నపూర్ణను తొలిసారి నేను చూచాను. నాటి సమావేశానికి వచ్చిన వారందరిలోను ఖద్దరు ధరించిన స్త్రీ ఆమె ఒక్కతే! నాకు జ్ఞాపకమున్నంతలో తన ఆభరణాలను, చేతి గాజులను నాకు మొట్టమొదట అర్పించినదికూడ ఆమెయే 1 "నీ తలిదండ్రుల అనుమతి పొందినావా?" అని ఆభరణాలు అర్పించే సమయంలో నే నామెను ప్రశ్నించాను. "ఇట్టిపనులకు నా తలిదండ్రు లెన్నడు నన్ను అడ్డుపెట్టరు" అని ఆమె బదులు చెప్పినది"

అన్నపూర్ణాదేవిగారు బాపినీడుగారికి మేనగోడలే. కలగరరామస్వామి, పిచ్చమ్మగార్ల కన్నకూతురు. 1914 లో ఆమెను బాపినీడుగారే కలకత్తా బ్రహ్మ బాలికా విద్యాలయంలో చేర్పించారు. అప్పుడే ఆమెలో సంఘ సంస్కరణాభిలాష కలిగింది. ఈమె సాహిత్యంలో బాగా కృషిచేసింది. పండితగోష్టి అంటే ప్రాణాలు వదిలేది. ఎన్నో బెంగాలీ పుస్తకాలను తెలుగులోకి తర్జుమా చేసింది.

బాపినీడుగారు అమెరికాలో వుండగా ఆమె రాసిన ఉత్తరాలు ఆమె హృదయ సౌకుమార్యాన్నే గాక, మనోనిబ్బరాన్నికూడ తెలియజేస్తాయి. ఆమె గొప్ప దీక్షాపరురాలు అందుకే ఆ లేఖలలో ఒకచోట అంటుంది "నన్ను మరచినా, దేశమును మరువవద్దు." తర్వాత ఈ లేఖలన్నిటిని బాపినీడుగారు స్వయంగా ప్రచురించారు. వాటిలో ఆయనను ఆమె విమర్శించిన లేఖలుకూడా చాలా వున్నాయి.

---

1 = ఆమెకూడ బాపినీడుగారితో అమెరికా వెళ్లాని అన్నీ సిద్ధం చేసుకొన్నది. ఇంతలో అసహాయోద్యమం ఆరంభమైనందున ప్రయాణం మానుకొని ఆ వుద్యమంలో పాల్గొన్నది.
ఆమె కొక కుమార్తె, ఝాన్సీ.

వాటిని యథాతథంగా ప్రచురించడం బాపినీడుగారి విశాల హృదయా
నికి తార్కాణం.

ఇక, బాపినీడుగారితో నా స్నేహాన్ని గురించి ముచ్చటిస్తా. మా గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారు, ఈయన కలిసి బందరులో చదివారు. ఆ పరిచయమే పెంపొందింది. ఆయనతో కలిసి కలకత్తా విద్యాభ్యాసానికి 1916 లో వెళ్లాను. తర్వాత నేను 1920 లో బాపినీడుగారి పెళ్ళికికూడ వెళ్లాను. ఆ పెళ్ళి బ్రహ్మ వివాహ పద్ధతిలో జరిగింది. అప్పట్లో ఆ పద్ధతి నన్ను బాగా ఆకర్షించింది. బాపినీడుగారు, నేను తరుచుగా కాంగ్రెసు సభలలో కల్సుకుంటుండేవాళ్ళం. 1923 లో ఆయన "రైతుసంఘా లెందుకు ?" అనే కరపత్రం ప్రచురించారు. అది చాలామందిని రైతుసేవకు పురికొల్పింది.

ఆయన 'ఆంధ్రసర్వస్వము'లో మా ఘంటసాలలో దొరకిన రోమను శాతవాహన నాణెములు, దివితాలూకాలోని ప్రసిద్ధ గ్రామాలను గురించి వ్రాయగా అందులో ఆయన ప్రచురించాడు.

'ఆంధ్రవీరాంగనలు' అనే గ్రంథంలో నేను కొందరిని గురించి వ్రాశాను. ఆయన 'మాగంటివారి చరిత్ర' నుచూచే నేను "గొర్రెపాటి వారి చరిత్ర' రచించాను. ఈ మాదిరిగా మాకలయిక జరిగింది.

అన్నపూర్ణ దేశస్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నది. 1921 నుండి 27 వరకు కాంగ్రెసు కార్యకర్తగా ఆమె పేరు గాంచినది.

భారత స్వాతంత్ర్యసమరం ముగియకుండానే ఆమె కన్ను మూయడం దురదృష్టం. 1927 లో ఆమె చనిపోయినపుడు మహాత్మా గాంధీ తమ సంతాపాన్ని తెలియజేశారు.

"ఆమె మరణంవలన ఒక భక్తురాలినే కాదు — కేవలము ఒక పుత్రికనే కోల్పోయినట్లు నేను భావిస్తున్నాను. భారతపురంధ్రులలో చాలమందిని పుత్రికలుగా భావించుకునే భాగ్యం నాకు కలిగింది. కాని అట్టి వారందరిలోను ఈమెయే అత్యుత్తమురాలు. నిశ్చల

భక్తితో ఫలాపేక్షలేకుండ ఆమె దేశసేవ చేసింది. ఆమెవలె భారత నారీమణులందరు పవిత్ర హృదయలై, పతివ్రతలై, తమ అనురాగ బలంచేత తమ భర్తలను తమ కనుకూలురుగను, సన్మార్గ వర్తనులు గాను చేసికొనవలెనని నా అభిమతము. నా ఆదేశంమీద దేశసేవకు పూనుకొని, శరీరాన్ని శుష్కింపజేసుకొన్నదని శ్రీ బాపినీడు నాపై మోపిన నింద యుక్తమైనదే. ఆమెవలె యువతీయువకులింకను ఎందరో దేశారాధనలో ప్రాణసమర్పణ చేసినగాని, భారతదేశం స్వతంత్రం పొందజాలదనుట నిస్సంశయం" (19-10-1927)

అన్నపూర్ణాదేవిగారు చనిపోయాక బాపినీడుగారు కాపుకులం లోని అమ్మాయిని చేసుకున్నారు. అంతేగాక తమ బిడ్డలకు కూడ వర్ణాంతర వివాహాలు చేశారు.

బాపినీడుగారితో నా మైత్రి కనక రామబ్రహ్మంగారి ద్వారా మరింత పెరిగింది. ఆయన తన 75 వ ఏట 19-9-1969 లో చని పోయారు. ఆయనను స్మరించడంకోసమే ఆయన వుత్తరాన్నికూడ పొందుపరిచాను.

మద్రాసు,
1-3-65

సోదరా !

నమస్తే. ఆలింగనములు, ప్రేమగల.

చాలా రోజులైంది కలసి. ఆమధ్య పక్షపాతం వచ్చింది. తట్టు కొని తిరుగుతున్నాను. ఒక మీటింగ్‌లో అన్నట్లు, యముడికి స్టే ఆర్డర్ యిప్పించాను. కాని మూలాల్పూరి రంగయ్యమీద పడి ఎత్తుకు పోయాడు.

ఈ మధ్య ఏలూరువెళ్ళి భూమి తనఖా బ్యాంకిలో వుండుట తటస్థించినది. మీ 'మధురజీవనం', మీ రామబ్రహ్మంగారిని బాగా

తెలుసుకొనుట జరిగింది. నిజంగా మీరు రాసినట్లు అమృతహృదయుడే. ఇప్పుడు ఆ గ్రంథం అప్పుడప్పుడు రెండేసి పేజీలు బాగా చదువుతున్నాను. భలే బుక్కు రాశారు. అన్నానుగదా రామబ్రహ్మంతో "ఆ గ్రంథం నాకు అంకితమివ్వాల్సింది. అంతానాదే!" అని కొన్ని నా మాటలే, నా వూహాలే. ఎక్కడ సంపాదించారు చక్కని సూక్తులు - మాటలు! బుద్ధుడు అన్నట్లు భ్రమరం అన్ని పువ్వులమీద వాలి రసం తెచ్చియిస్తున్నట్లే, మీరు ఎందరెందరి సుభాషితములనో సొగసుగా చేర్చారు. అన్నట్లు, పుష్పాలు ఒకరివి. అన్నీ కలిపే దారం మీరు. ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ప్రక్కనయుండు మీ 'మధురజీవనం' అభినందనములు, ఆశీస్సులు. మీ 'మధురజీవనము'మీద తేనె చల్లితే ఎట్లా?

పోతునూరు వెళ్ళాను నన్ను పెంచి పెద్దవాడను చేసిన * మా అక్కయ్యకు చెప్పాను ఆ గ్రంథంగురించి. చెప్పింది, మీరు ఆప్యాయంగా పలకరించి వెళుతుంటారని. ఆమె ఒక దేవత..."

ప్రేమతో
మీ బాపినీడు.

# గొట్టిపాటి బ్రహ్మయ్యగారు

"A good life is only religion."

జననం: 1898 డిశంబరు 13

బ్రహ్మయ్యగారు, నేను ఘంటసాలవాసులము. ఆబాల్య మిత్రులము. ధర్మసోదరులము. మేము బౌద్ధక్షేత్రమైన కంటకసాలలో జన్మించినా, ద్విజత్వం చెందినది, సాంస్కృతిక నిలయమై ప్రసిద్ధ

* బాపినీడుగారి అక్క మంచి మాటకారి, ప్రేమమూర్తి. ఈమెతో నేననేకమార్లు సంభాషించాను. నా యందెంతో వాత్సల్యం చూపేది. మనుషులు పోతారు, మాటలుంటాయి.

గాంచిన బందరులో. మేము ఒకే గదిలో చదువుకుంటూ, బందరు నోబుల్ కళాశాల హైస్కూలు శాఖలో విద్యార్థులంగా ప్రవేశించాం. ఆయన ఫోర్తుఫారము, నేను థర్డుఫారము.

మా గురువులు విఖ్యాతులైన ముటూ్నరి కృష్ణారావు, చెరకువాడ వేంకటనరసింహంగారలు. నాకు కవితా శ్రీరామశాస్త్రి గారు, పట్టాభిగారు. ఆయనకు మరొక గురువు. కానీ ఈ నలుగురు మిత్రులే. వీరందరూ బ్రహ్మర్షి వెంకటరత్నం నాయుడుగారి శిష్యులు.

బ్రహ్మ మందిరంలో మేముంటూ వారి సాన్నిధ్యమున మెలగుట మా ఆత్మవికాసమునకు హేతువులు.

మా దేశసేవ 1917 లో కాంగ్రెసు లీగు స్కీము సంతకములు చేయించుట ద్వారా ప్రారంభమైనది. మే మిరువురము మహాత్ముడు ప్రారంభించిన స్వాతంత్ర్య సమరంలో పాల్గొని మా గ్రామాన్ని కాంగ్రెస్‌కు పెట్టని కోటగా చేసితిమి. ఆయన కాంగ్రెస్‌కు అంకితుడై రాజకీయరంగంలో ప్రసిద్ధిగాంచాడు.

ఆయన జీవితయాత్రలో ప్రస్ఫుటంగా కనుపించేది – కాంగ్రెసు కార్యకర్తగా ప్రారంభమై పంచాయతీబోర్డు సభ్యుడిగా ప్రవేశించి, శాసనమండలికి అధ్యక్షత వహించటం. పల్లెటూరిలో పుట్టి, పెరిగి, సామాన్య భూవసతి, విద్య కలిగి కాంగ్రెస్ కార్యరంగంలో రాష్ట్ర కార్యదర్శిగా, అధ్యక్షుడిగా చేసిన సేవ, పెద్దరికం గమనించ తగినది.

ఇంతేకాదు, ఆయన ఏ కార్యం చేస్తున్నా - తాను రైతునని తన కేపదవి వచ్చినా అది కర్షకులను గౌరవించినట్లుగా భావిస్తాడు. ఆయనదంతా కర్షక దృక్పథం. అందుచేతనే "మన రైతుపెద్ద" అనే పేరుతో ఆయన జీవితచరిత్రకు రచించాను.

"నేను 1933 నుండి సాహిత్యానికి అంకితుడనై పోయాను.

అయినప్పటికీ నాకు రాజకీయాలతో సంబంధమున్నట్లే ఆయనకు సాహిత్య పరిచయం వున్నది.

నేను రచించిన కొన్ని గ్రంథాలను ఆయనకు వినిపించి ఆయన సూచనలను పాటించాను.

నేను వ్రాసిన "ఆచార్యరంగా" "డాక్టరు సి. ఆర్. రెడ్డి" గార్ల చరిత్రలకు ఆయన నా కోర్కెపై పరిచయ వాక్యాలు వ్రాసి, ప్రసిద్ధి తెచ్చాడు.

ఆయన "జాతి వెలుగులు" "కాలనక్రమము _ మన కర్తవ్యం" అను రెండుపుస్తకములను రచించటమే గాక "నా జీవన నౌక" అనే పేరున విపులమైన స్వీయచరిత్ర రచించి ఖ్యాతిగాంచాడు. "ఆంధ్ర జ్యోతి"లో ప్రతివారం ధారావాహికంగా ప్రచురింపబడుచూ అశేష పాఠకుల ప్రశంసల నందుకొంటున్నది

"మన రైతుపెద్ద" అనే పేరున ఆయన చరిత్రను వ్రాసి ఆయన యెడల నా ఆదరాభిమానములను చూపించే అవకాశములిగినందులకు ఆనందిస్తున్నాను.

"పండిత గొట్టిపాటి వెంకటసుబ్బయ్య నేను ఆబాల్య మిత్రులము. ఒకరు పొందిన గౌరవ మర్యాదలు, రెండవవారికి భాగ స్వామ్యముగలదని ఆనందించువారము" అని అంటాడు ఆయన.

"నిష్కామంగా మన కర్తవ్యం మనం నిర్వహించిన యెడల దైవం మనకు తోడ్పడగలడు. అట్టి సంస్కారం మనకు పెద్దల సాంగత్యమువలన వచ్చింది. శేషజీవితం ప్రశాంతంగా గడపాలని ప్రార్థిస్తున్నాను..." 29_1-1967.

"రెండురోజుల క్రితం శ్రీ నారాయణరాజుగారినుండి వుత్తరం వచ్చింది. ఆప్యాయతకు, ప్రేమకు, మారురూపైన యిట్టి మిత్రులు లభించడం అదృష్టం. నేను మిక్కిలిగా యిందుకు ఆనందిస్తున్నాను." 6_2_67.

"నీవు ప్రతి వుత్తరంలో నన్ను గురించి ఎంతగానో అభినందిస్తూ వ్రాస్తున్నావు. ఇది నీ ప్రేమకు నిదర్శనం. అహంకారము లేకుండా అందరి ప్రేమను చూరగొనేటట్లుగా వ్యవహరించుటకు నీ వుత్తరాలు నన్ను మిక్కిలి ప్రోత్సహిస్తున్నాయి. చాల సంతోషం..."

21_3_67

"నీవు వ్రాసినట్లు ఘంటసాలలోని పరిస్థితులు ఎట్లున్నా తర తరాలు ఘంటసాల చరిత్ర చిరస్థాయిగా వుంటుంది. నీ కృషి, నీ రచన భావితరాలు సైతము ప్రశంసించక తప్పదు..."

2-3-67

"సుబ్బయ్యా ! నీవు అలౌక్యుడవని, నేను లౌక్యుడనని అను కొంటారు. నీవే లౌక్యుడవని నాకు తెలుసు, లోకానికి ఏమి తెలుసు" అంటాడు మిత్రుడు.

ఎవరు ఏమనుకున్నప్పటికీ మా యిద్దరి మైత్రి అటువంటిది. మాలో చాటుమాటు లేదు. చెప్పుకోని సంగతులు లేవు. రహస్యాలు అంతకంటే లేవు

బ్రహ్మయ్యగారు నన్నుగురించి ఏమి చెప్పినా ఆయన ప్రతిభ వేరు. నా ప్రతిభ వేరు.

ఆయన నాకు ప్రాణస్నేహితుడు.

మా ఉభయుల మైత్రి పరస్పరాభివృద్ధికి, గ్రామ ప్రతిష్ఠకు, దేశసేవకు ప్రధానమైనందుకు ఆనందం.

బ్రహ్మయ్యగారూ, నేనూ సాయంత్రం షికారుకు వెళ్ళి పిచ్చాపాటి మాట్లాడుకుంటూ వుంటాం. ఒకనాడు "నీ అభివృద్ధికి కారణ మేమిటి" అన్నాను. నీతినియమాలు భగవదేచ్ఛ కారణాలు. నేను ఉపాధ్యాయవృత్తిలోకి పోదామనుకుంటే మీ వల్ల దేశానికి చాలా మేలు కలుగవలసివున్నది చేరవద్దన్నారు పింగళి వెంకయ్యగారు. నేను

ఖాయిదా వ్యాపారంలో ప్రవేశిద్దామంటే, "తాలూకాబోర్డు ప్రెసిడెంట్ చేసిన నీవు గల్లాపెట్టెవద్ద కూర్చుంటావా?" అని కొల్లిపర సూరయ్యగారన్నారు. దానితో అదీ పోయింది. కనుక నేననుకొన్నవి అవలేదు. ఇవే కాదు ఏవిన్నీ. అంతా భగవదేచ్ఛ.

"నా అభివృద్ధికి ఎడతెగని పరిశ్రమ" అన్నాను. ఆయనకంతా ఈశ్వర కృపగా తోస్తుంది.

"మన జీవితాన్ని సింహావలోకనం చేసుకొంటే మన స్థితిగతులను గమనించుకొంటే, మనం ఆనందించవలసిన స్థితిలో వున్నాం. దేవుని దయ. పెద్దల ఆశీర్వచనము మనకు గలవు. Self Purification కావాలి."

"ఆత్మ నైర్మల్యంకొరకు నా తపస్సు. నా ప్రార్థన. ధనవ్యయమైనా తరచు మిత్రులను కలుసుకుంటూ ఆనందంతో కాలం గడుపుట నీ కర్తవ్యంగా భావించుటకు ఇప్పుడు నేను ప్రోత్సహించుట విధిగా భావిస్తున్నాను."

A true friend is one soul in two bodies.

# శ్రీ వేమూరి సీతారామయ్య

ఈయన నేను సమవయస్కులం, సహాధ్యాయులం, సహచరులం. నా మిత్రులందరికంటే చిన్నతనములోనే ఆయన నేను వీధిబడిలో ఘంటసాల నర్సయ్యగారివద్ద చదివాం. తరువాత బోర్డు బాలుర పాఠశాలలో గొర్రి నారాయణమూర్తిగారి హయాంలో ప్రవేశించి 4 వ క్లాసులో ఉత్తీర్ణులమయ్యాం, 1911 లో. ఆ హెడ్మాష్టరు స్కూలు ఎలా అభివృద్ధి కావలననే ఆలోచన కలవాడు. ఆయన వచ్చిన తరువాతనే ఆ పాఠశాల ఎంతో పెంపు సొంపులను కూర్చుకుంది.

ఆ తరువాత వారణాసి చిన అచ్చన్నగారి ఇంగ్లీషు ప్రయివేటు స్కూల్లో ప్రవేశించాం. ఆయన మంచిబోధకుడే గాక లౌక్యుడు

కూడ. సంస్కృతం. కేవలము పాఠాలనే గాక లోకవ్యవహారములను కూడ చెప్తూవుండేవాడు. ఘంటసాల స్టూడెంట్సు క్లబ్బు అని ఒకటి ఏర్పాటుచేశాడు. మేము వచ్చేసరికే గొట్టిపాటి బ్రహ్మయ్య, వేమూరి నాగయ్యగార్లను థర్డుఫారమ్‌లో ప్రవేశపెట్టాడు. అప్పట్లో దాదాపు ఇరువదిమంది పిల్లలుండురని నా అభిప్రాయము. ఆయన సీతారామయ్య, ఐనంపూడి గోపాలకృష్ణమ్మ థర్డుఫారమ్‌లో 1913 లో ప్రవేశపెట్టాడు. ఆ తదాది మేము బ్రహ్మమందిరములో ఉంటూ, కమ్మ విద్యార్థి వసతిగృహములో భోజనము చేస్తూ 1916 వరకు కలసి ఉన్నాం.

1917లో నేను కలకత్తా వెళ్ళటం, స్కూలుఫైనలులో ప్రవేశించటం ఆయన బందరు స్కూలుఫైనలులో ప్రవేశించి కీళ్ళవాతంవల్ల స్కూలు విడనాడి ఘంటసాలలో ప్రవేశించాడు. నాకు కళ్ళు జబ్బు చేసి ఘంటసాల వచ్చాను మా సేవావిధానము 1917 లో కాంగ్రెసు లీగు స్కీముకు పట్టాభి సీతారామయ్యగారి సలహా చొప్పున చుట్టుపట్ల గ్రామాదులలో సంతకాలు చేయించుట ద్వారా సాగించాము.

తరువాత మే మిద్దరము కలసి ఉరుదూ చదివాం, హిందీ పఠించాం.

గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, ఈయన, నేను తదితర విద్యార్థులం మా గ్రామములో శ్రీ రామమోహన పుస్తక భాండాగార పెంపే మా పెంపుగా భావించి కృషిచేశాం. మేము ఏమిచేసినా గ్రామ సౌభాగ్యానికి చేశాంగాని మా పేరు ప్రతిష్టలకు చేయలేదు. మాదంతా ఒకేమాట–ఒకేబాట ఆ ఐకమత్యమే మా గ్రామానికి, మాకు దేశానికి అభ్యుదయం చేకూర్చింది. మా అందరిలోను బ్రహ్మయ్యగారిది Driving personality. మేమంతా ఏక వయస్కులం చదువుసంధ్యలు ఒకటే; గ్రామం ఒకటే. ఆయనలో చురుకు చొరవ మా నాయకత్వానికి, దేశనాయకత్వానికి తోడ్పడటం ఆనందదాయకం.

మా గ్రామంలో కంటే అధికంగా జైలుకు వెళ్ళిన గ్రామాలు ఎన్నో ఉన్నాయి. కాని మా వలె Team Spirit గా పనిచేసిన వారు చాలా తక్కువ. మా గ్రామపెద్దలుకూడ దీనికి దోహదం చేశారు.

మాతో కలిసి సీతారామయ్యగారు 1930వరకు కృషి చేశాడు. 1930 లో మాతోపాటు శ్రీ కృష్ణజన్మస్థానమునకు మాత్రము రా లేదు.

ప్రథమంలో కాంగ్రెసులో చేరినవారు అరుదు. బ్రహ్మయ్య గారు, సీతారామయ్యగార్లు, నేను ముగ్గురము కృష్ణాజిల్లా కాంగ్రెసు సభ్యులమే.

1920 లో వేమూరి లక్ష్మయ్యగారి ప్రోత్సాహమువల్ల బ్రహ్మయ్యగారి నాయకత్వంతో దివితాలూకా కాంగ్రెసు సభ జరిపాం. తద్వారా కాంగ్రెసు ప్రబోధము కావటానికి ఎక్కువ అవకాశం కలిగింది. అప్పుడు మమ్ములను క్రెంటు పెత్తందారులని, కానుమోలు, శ్రీమతే రామానుజాయ నమః అనేవాడు. ఈ శీతా రామయ్య, బ్రహ్మయ్య, నేను పంచాయతీ బోర్డులో ప్రవేశించి పన్నులు మేమే వసూలుచేసి గ్రామమంతా తిరిగి ఎక్కడ ఏ పని జేయాలో చూచి చాలా కృషి చేశాం. మాతో పెద్దలు సహకరించారు. ఇందులో గొర్రెపాటి బ్రహ్మన్నగారి కుమారుడు వెంక య్యగారు మాకు ఇంజనీరు. ఆయన గ్రామంలో నీరు ఎలా నడుప వలసింది, ఎక్కడ ఎంత మన్ను పోయవలసిందీ, గ్రామైక్యతకు అధి కంగా తోడ్పడినది ఆయనయే. ఈ సంగతంతా బ్రహ్మయ్యగారు తమ స్వీయచరిత్రలో ఉదహరించారు.

ఇంకా గ్రామంలో రైతుల కట్టుబాట్లకు_ రైతుల అభివృద్ధికి ఆయన అనేక ప్లానులు వేశాడు. ఆ విధంగా షేమంతా ఆయనకు తోడ్పడ్డాం. మా గ్రామ పంచాయతీకి 16 సంవత్సరాలు వేమూరి వెంకయ్యగారు అధ్యక్షులుగాయుండి ఐక్యకంఠంగా పని చేశారు.

ఆయనకు చైర్మన్ వెంకయ్యగారని పేరు. వైస్ ప్రెసిడెంటుగా గొట్టిపాటి నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారు ఉండేవాడు. ఆయన గ్రామ పెత్తందారు. ఊళ్ళో కులాలు కుటుంబాలు ఆలోచించి ఏకమత్యంగా సభ్యులను పెట్టి కలిసి ఆలోచించి కృషి చేశాం.

ఈ మాదిరిగా ఇంకా ఎన్నో గ్రామైకమత్యానికి సౌభాగ్యానికి తోడ్పడే కార్యకలాపాలను నిర్వహించాం.

ఈ పూర్వస్మృతులన్నీ తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇదంతా మనవల్ల జరిగిందా! పెద్దల చలువ, గాంధీయుగ ప్రభావం.

వేమూరి శీతారామయ్యగారికి వెంకటరత్నం అనే ఒక అమ్మాయి మాత్రమే. ఆమె, మా పెద్దమ్మాయి కలిసి చదువుకున్నారు. అప్పటినుండి ఇప్పటికీ కూడ వారు స్నేహితులే. ఆమె అత్తవారు మా గ్రామసమీపాన కల దేవరకోట. నేను ఆ గ్రామం ఎప్పుడు వెళ్ళినా ఆమెను చూచుటకు తప్పకుండా వెళ్తాను. మామయ్యా! అని నోరారా పలుకరించి మా అమ్మాయి సంగతి అడుగుతుంది.

వేమూరి శీతారామయ్య మా అందరిలోకి కొంచెం సనాతనుడు. ఆయన క్రాపింగు ఎప్పుడూ పెట్టలేదు. ఎక్కువగా దేవాలయ ధర్మాదాయాలను చూస్తుంటాడు. ఆయన హిందీ, ఇంగ్లీషు మధ్య మధ్య మాట్లాడుతుంటాడు. ఆయన నాతో సమవయస్కుడు. ఒకవైపుకు వంగిపోయాడు. ఆయనను చూస్తూంటే బాధాకరంగా ఉంటుంది.

# శ్రీ అయినవూడి గోపాలకృష్ణయ్య

గొట్టిపాటి బ్రహ్మయ్య, ఈ గోపాలకృష్ణయ్య, వేమూరి సీతారామయ్య, నాగయ్యగారులు మేమందరము సమవయస్కులము, మిత్రులము.

గోపాలకృష్ణయ్య, నాగయ్య హాస్యప్రకృతి కలవారు. అందులో గోపాలకృష్ణయ్య మరీను. ఆరంభంనుంచి నాయందు యెంతో అభిమానంతో వుండేవాడు. నాతో మాత్రం హాస్యం ఆడేవాడు కాదు. నాతో ధరుహారం, ఘోరుహారం, ఫిఫుహారం కలసి చదివాడు. మేమంతా ఒకే చోట వుండేవాళ్ళం. నవ్వించటం, కవ్వించటం తప్పితే ఆయనకు యితర ఆలోచనలు పట్టేవి కావు.

తరువాత కొంతకాలం వ్యవసాయంలో వుండి అనంతరం షోలాపూర్ వెళ్ళాడు. అక్కడ చాలకాలం మిల్లులో బాయిలర్ ఇనస్పెక్టరుగా వుండేవాడు. ఘంటసాల రాగానే మా ఇంటికి వచ్చేవాడు. నేను ఆయన ఇంటికి వెళ్ళేవాడిని. ఆయనకు సుబ్బారావు, విఠల్, రత్తమ్మ, బాపనమ్మలు సంతానం. ఆయన ఎంచుకొని అంగలూరు వాస్తవ్యుడు త్రిపుర్నేని రామచంద్రరావు బి. కామ్. యం. ఎ కు బాపనమ్మనిచ్చి, వివాహం చేశారు గోపాలకృష్ణయ్య సంతానంలో సుబ్బారావు, బాపనమ్మ నన్ను పితృతుల్యునిగా భావించుకొంటారు. గోపాలకృష్ణయ్య బిడ్డలందు నాకు మమతానుబంధాలు ఎక్కువ

మిత్రుడు గోపాలకృష్ణయ్య 1959_1 21 ఇహలోకయాత్ర చాలించాడు. విజయవాడనుండి నేను చూడటానికి వెళ్ళేసరికి బాపనమ్మ నన్ను చూచి స్పృహలేకుండా పడిపోయింది.

రామచంద్రరావు కో_ఆపరేటివ్ ఇన్‌స్పెక్టర్. వారు అవనిగడ్డలో వుండగా ఆమె నేనువెళ్ళగా నన్నెంతో మర్యాదచేసి మురిసిపోయింది. మానవునిలో యెంత మాధుర్యముందో అర్థమయింది.

అలాగే వారి తమ్ముడు సుబ్బారావు 1969లో వారి బాబాయ్ అయినపూడి సీతారామయ్యగారి కుమార్తె వివాహానికి వచ్చినపుడు నన్ను చూచి మామయ్య ఆరోగ్యంగా లేడు అని మందులు కొన్ని యిచ్చాడు. ఆయన షోలాపూరులో మెడికల్ రిప్రజెంటేటివు.

కొంతమంది గోపాలకృష్ణయ్య షోలాపూర్ వెళ్ళి ఏం సంపా

దించాడు అంటూవుంటే, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, ఆయన చక్కని సంతానాన్ని సంపాదించాడు. అంతకంటే యింకేంకావాలి అన్నారు. ఆయన భార్య చాలాకాలం క్రిందటనే చనిపోయింది. ఈ బిడ్డలు ఆదరాభిమానాలతో తండ్రికి సపర్యలు చక్కగా చేశారు. ఇంతకంటే కావల్సిన దేముంది.

పూజ్యులైన శ్రీ వెంకట సుబ్బయ్యగారికి — అవనిగడ్డ
రామచంద్రరావు నమస్కరించి వ్రాయునది. — 31-8-1967

మీకు మాయందు గల అభిమానమునకు మా దంపతులము కృతజ్ఞులము మీరు మా యింటికి వచ్చి నూ ఆతిథ్యము స్వీకరించ ప్రార్థన. ఆగస్టు 9 వ తేదీన "మాస్టర్ ప్లాను" ప్రారంభోత్సవము అవనిగడ్డలో ముఖ్యమంత్రి చేయును. ఆ సందర్భములో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు వచ్చెదరని తెలియుచున్నది. మీరుకూడ అప్పుడు అవనిగడ్డ రాగలరని తలంచుచున్నాను. మీ రిచ్చిన "ఘంటసాల చరిత్ర" చదివితిని. చాలా ఉత్తేజపూరితముగా నున్నది. మీకు భగవంతుడు ఆయురారోగ్యముల నిచ్చుగాత.

టి. రామచంద్రరావు.

పూజ్యులైన శ్రీ మామయ్యగారికి అనేక నమస్కారములు.

ప్రస్తుతం అవనిగడ్డలోనే కాపురం వుంటున్నాము.

మీ ఆరోగ్యం జాగ్రత్త. శ్రీమతి అత్తమ్మగార్ని, శకుంతల వదినగార్ని అడిగినట్లు చెప్పగలరు. అప్పుడప్పుడు మీరిల్లాగే ఉత్తరాలు వ్రాస్తూ వుండండి. మా నాన్నను మీలో చూచుకొను చున్నాను.

ఇట్లు
మీ కోడలు
తిపిర్నేని బాపనమ్మ

పూజ్యులైన శ్రీ సుబ్బయ్య మామగారికి, జగ్గయ్యపేట
బాపనమ్మ నమస్కరించి వ్రాయునది.

నేను జగ్గయ్యపేట వచ్చేముందు బెజవాడవచ్చి మీకు కనబడి వెళదామని అనుకొన్నాను. కానీ వీలుపడలేదు. మీ అబ్బాయిగారు మీకు నమస్కారములు చెప్పమన్నారు. మీరు నన్ను మరువవద్దు. ఎప్పుడైనా యిటువస్తే మా యింటికి తప్పకరావలయునని ప్రార్థన.

ఇట్లు
మీ అమ్మాయి
తిపిర్నేని బాపనమ్మ

# శ్రీ కొల్లిపర సూరయ్య

"వ్యక్తులను ఆకర్షించడానికి దయ, స్నేహం, దానం, మధుర వాక్కులకు మించినవి ముల్లోకాలలో లేవు"

—వ్యాసుడు.

సూరయ్యగారిని ఆంధ్ర కాంగ్రెసు క్షేత్రములో ఎరుగనివారుండరు. చాలా సౌమ్యుడు, వినమ్రుడు, మితహితభాషి, మంచి రూపసి, మధురమైన చిరునవ్వులు గలవాడు. బ్రహ్మయ్యగారెంత మాటకారో యీయనంత మౌని. ఆయన సజ్జనుడేకాదు, అజాత శత్రువు. ఆయన సభలు, సమావేశాలకు వచ్చినా ప్రసంగాలు చేయడు, మంచి శ్రోత.

ఆయన తండ్రి రత్నంగారు సజ్జనుడు, దాత. ఆకాలంలో ఆయన ఆంధ్రజాతీయ కళాశాలకు 1116 రూ॥ దానం చేశారు. తండ్రిగారి దాతృత్వం సూరయ్యగారిలో కూడా తొణికిసలాడింది. అందుకే తండ్రి చనిపోయినప్పుడు సూరయ్యగారు ఆంధ్ర జాతీయ కళాశాలకు 1000 రూ॥ విరాళ మిచ్చారు.

సూరయ్యగారు, నేను ఆబాల్యమిత్రులమే. మేమిద్దరం థర్డు ఫారం నుంచి కలిసిచదివాము. మేము ఒకే మెస్‌లో భోజనం చేసే వాళ్ళం. ఆనాడు మా అందరకు గొర్రెపాటి వెంకటేశ్వర్లుగారు పెద్ద. ఆయన మావూళ్ళో రామమోహన లైబ్రరీ స్థాపించినట్లే సూరయ్య గారు కూడా వూళ్ళో వీరేశలింగం లైబ్రరీ 6-12-1915న స్థాపించారు. అప్పుడు మావూరి గొట్టిపాటి బ్రహ్మయ్య, అయినపూడి గోపాలకృష్ణయ్య, వేమూరి సీతారామయ్య, నేను మొదలైనవారం వున్నాం.

ఆరోజుల్లో ఆయనతోపాటు కొల్లిపర నాగయ్య, తాతినేని సీతారామయ్య మొదలగు ఆ గ్రామస్థులుకూడ చదువుతూ వుండే వారు. మా అందరిది ఒకేమాట, ఒకేబాట.

చదువుకొనేటప్పుడే సూరయ్యగారికి నేనూ, బ్రహ్మయ్య మిత్రులమైనట్లే – కొండాలి ఆంజనేయులు, విశ్వనాథ సత్యనారాయణగార్లు కూడ మిత్రులే. నాటినుండి నేటివరకు పై అందరిలో మైత్రి అవిచ్ఛిన్నంగా సాగుతోంది. విశ్వనాథ సత్యనారాయణగారు తన 'నర్తనశాల' నాటకాన్ని ఈయనకే అంకితమిచ్చారు.

సాహితీప్రియులకు 'సాహితి' పత్రిక గురించి వేరే చెప్ప నక్కరలేదు. సాహితీసమితి తరఫున 1920 నుండి తెనాలిలో శివశంకర శాస్త్రిగారి ఆధ్వర్యాన వెలువడుతుండేది. 1922 నుండి 1925 వరకు ఆంజనేయులుగారి సంపాదకత్వాన బెజవాడనుండి నడిపేవారు. 'సాహితి' పోషకుడు సూరయ్యగారే. ఆ పత్రిక పాతసంచికలను మిత్రులు సూరయ్యగారు నాకు బహూకరించారు.

విశ్వనాథ సత్యనారాయణగారు, కొండాలి ఆంజనేయులుగారు కలసి 'సత్యాంజనేయులు' అనే పేరుతో రచనలు చేసేవారు.

"వర్ణ వైషమ్యంబు వాడిపోయినదయ్య
అర్ణ వైశాల్యమైన నీ ఆత్మలో

శారద జ్యోత్స్నా వర్షా తుషారమ్ములు
నీ రమ్యమూర్తిలో నిగ్గుతేలినవయ్య
చిగురు వేదములు వాసించు నీ లోపల
నగరయ్యలె యశోనవ్య వల్లరులకు
రమణీయ పూర్వ సారస్వత ప్రేమలో
కమనీయుడైన భాగస్వామివై నావు."

—విశ్వనాథ సత్యనారాయణ,
కొడాలి ఆంజనేయశర్మ.

సూరయ్యగారు తూర్పు కృష్ణాజిల్లా సంఘానికి ప్రెసిడెంటుగా, రాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యనిర్వాహక సభ్యుడుగా ఎనలేని సేవ చేశారు. 1926లో కాళేశ్వరరావుగారితోపాటు ఆయన కూడా కాంగ్రెసు శాసనసభా అభ్యర్థిగా నిలబడ్డాడు. అప్పట్లో ఆయన విజయం గాంచకపోయినా, 1946లో శాసనసభ్యుడయ్యాడు.

ఆయన ఉభయగోదావరీ కృష్ణాజిల్లాల రీసెటిల్‌మెంట్ ఆందోళనలో పాల్గొని జైలుకు వెళ్లాడు. ఇంకా ఎన్నోసార్లు శ్రీకృష్ణ జన్మస్థానమునకు పోయిన దేశభక్తుడు.

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడైనందుకు ఆనందిస్తూ ఆయనకు 1962లో విందుచేశాడీయన. తన మిత్రుల నందరినీ ఆహ్వానించాడు. నా సంగతి పొరబడ్డాడు. బ్రహ్మయ్యగారు హైద్రాబాద్ నుండి వస్తూ బెజవాడలో నన్ను కలుసుకుని మన సూరయ్యగారు డిన్నరిస్తున్నారు రా వెళ్దాం అన్నాడాయన. నన్నుపిలవలేదని సంకోచం పెట్టుకోకుండా బయల్దేరాను. నన్ను ఆయన చూసి "సుబ్బయ్యా, పొరబాటు జరిగింది" అన్నాడు. నాకది ఉంటేగా అన్నాన్నేను. ఆ సమయంలో బ్రహ్మయ్యగారికి నూతన వస్త్రాలు ఇచ్చి బహూకరించారు. దానికి కృతజ్ఞత చెపుతూ "నా మిత్రులలో సూరయ్యగారు, మా సుబ్బయ్యలతో నూ కొటు

వంటి అభిప్రాయభేదములు కలుగలేదు. అరమరికలులేని మా మైత్రి మా శేషజీవితంలో కూడ జరగాలి" అన్నాడాయన.

మేము కలిసినపుడు మనసులు విప్పుకొని మాట్లాడుకుంటాం. నా మిత్రులందరు అన్నిసంగతులు నాతో చెప్పకుండా వుండలేరు. నా భాగ్యం అది !

సూరయ్యగారు శాంతస్వభావులు. అందరితో సౌమ్యముగా పోదామన్నదే ఆయన తత్వం. ఆయనను మిత్రుడుగా పొందడం నా భాగ్యం. ఆయన స్వగ్రామం కృష్ణాజిల్లాలోని కపిలేశ్వరపురం.

# శ్రీ లింగం వీరభద్రయ్యా చౌదరి

చౌదరిగారు జననం 25_6_1898.

ఈయన నా ఆబాల్యమిత్రుడు. బందరులో కలసి చదువుకున్నాం.

నా మిత్రులలో, విదేశానికి వెళ్ళి ఉన్నతవిద్య అభ్యసించి, ఉద్యోగం చేసింది యీాయనే. ఆక్సుఫర్డ్ యూనివర్సిటీలో పట్టభద్రుడై, బారిస్టరై,అసిస్టెంట్ ఇన్‌కంటాక్సు కమీాషనరై 1-7-1953లో రిటైరయ్యారు. చేసింది ఉన్నతోద్యోగమయినా, అచ్చంగా రైతు. పశుపోషణలో అభిరుచికలదు. లలితకళలంటే ఎంతో ఆసక్తి. ఉత్తమ కళాఖండాలను ఎన్నిటినో తనఇంట్లో అలంకరించుకున్న కళాప్రియుడు. ఆయన ఇల్లు చిన్న మ్యూజియం. ఈ అభిరుచివల్లనే ఈయన లలిత కళా అకాడమీాకి సభ్యుడుగా వరించబడ్డారు. అటునుండి సాహిత్య అకాడమీాకి ఎన్నుకోబడ్డారు. ఈయన ఉత్తమ కళాపోషకుడు. దాదాపు పదివేలరూపాయల కళాఖండాలను కొన్న కళాప్రియుడు. ఈ కళాప్రియత్వమే, విజయవాడలో నార్లవారి అధ్యక్షతన ఏర్పడిన ఆంధ్ర ఎకాడమీా ఆఫ్ ఆర్ట్సు ఉపాధ్యక్షుడిగా ఉన్నారు.

సాహిత్యాభిరుచికూడ వుంది. మంచి పుస్తకం దొరికితే కొన కుండా వుండరు. ఈయనవద్ద ఆంధ్ర, ఆంగ్ల గ్రంథాలెన్నో వున్నాయి. ఈయన 'భారతి'లోను, ఇతరత్రా రాసిన వ్యాసాలు, ఆంగ్ల రచనలు అముద్రితంగానే వుండిపోయాయి. వెలుగులోకి తీసుకువస్తే బాగుం డును. * ఎన్నో మాసపత్రికలకు చందాదారు.

ఆయన నిష్కపటి, నిష్కర్షి, వితరణశీల, స్నేహశీలి. ఈ మిత్రునకు "సంజీవ దేవ్ లేఖలు" 13-1-1965 న, మైత్రికి చిహ్నంగా కృతి ఇచ్చినపుడు నన్నెంతో ప్రేమాభిమానాలతో సత్కరించారు.

ఈయన పుట్టింది గుడివాడతాలూకా, బొమ్మలూరులో. మెట్టింది దివితాలూకా పెదసనగల్లు. సిరిసంపదలు గలవాడు. ప్రాచ్య, పాశ్చాత్య సంస్కృతులు ఈయనలో మేళవించినాయి.

"..... ఆంధ్రప్రదేశ్ లలితకళా అకాడమి సభ్యత్వం పొందినందుకు మీరు పంపిన అభినందలకు కృతజ్ఞుడను. సహృదయు లగు మిత్రులెప్పుడు చిన్నవిషయములనుగూడ పెద్దవిగా నెంచి, సంత సించుట సహజం. అట్టిదే ఇది కూడా. నేను లలితకళలలో పండితు డను కాకపోవుట అటుంచి, విజ్ఞుడనుకూడ అంతగా కాదు. ఏదో కొంచెము ఆసక్తి, అనురక్తి, పరిచయమున్న మాట వాస్తవము..."

"...మీరనినట్లు, మిక్కిలి దగ్గరగా నుండియు, ఆబాల్య స్నేహితులమయ్యు మిక్కిలి అనుకూలముగా కలసి కొనకపోవుట విచార్యమే. ఇకనైనను తప్పక ప్రయత్నించెదను. మీరనుకొనినంత ఆరోగ్యవంతుడను కాను. కాని కార్యాచరణలో కొంత ఉత్సా హము కనపరచుట నా స్వభావం. అయినా, మీ వంటి మిత్రుల సద్భావము వ్యక్తిత్వమునకు చేయూత నొసగును. మిక్కిలి సంతోషము..." (26-5-'67)

---

* ఇటీవల గ్రంథరూపేణా వచ్చినందుకు సంతోషం.

"...మనము చిరకాలమిత్రుల మనుమాట మీా ఉత్తరమువచ్చి నపుడల్లా స్మృతిపథమునకు వచ్చును. ముసలితనమున మనుమలు కూడా జ్ఞాపకముండ రేమెా! ఎప్పుడో కాని, కలసికొని మిత్రులమాట ఎట్లు చెప్పగలము? అయినను, మీా పట్టుదలచేతనైన, మరచిపోవు టకు అవకాశముండదనియే తోచుచున్నది. మీా పట్టుదల కాకపోతే, నా వంటి అల్పజ్ఞునకు, ప్రతిభావంతుడు, తత్వవేత్త, పండితుడు, కవి, చిత్రలేఖకుడు అయిన శ్రీ సంజీవదేవ్ అమూాల్యసందేశములు, చర్చలు, ఆలోచనలు వగైరా గల గ్రంథమును అంకిత మివ్వవలెనని తలంపు ఏల?"

(1-4-'63)

ఆయన ఉద్యోగిగా ఉన్నపుడు ఒకసారి మాయింటికి వచ్చాడు. నాకు స్నేహితుల ఇళ్ళకు వెళ్ళడం సరదా. ఒకరోజు ఆయనను చూచుటకు వెళితే, లేరు. ఆయన భార్య అన్నపూర్ణమ్మగారు మంచి కలుపుగోరు మనిషి. "మీా స్నేహితుడు లేరని వెళ్ళిపోతారా? ఉండండి" అన్నది.

"స్నేహితుడు లేడని, ఎక్కడకు వెళ్ళినా, నేను వెళ్ళిపోయేది లేదు. ఇంటిలోని వారంతా నాకు బంధువులే, మిత్రులే" అని వుండి పోయాను.

మా మైత్రి అటువంటిది.

# శ్రీమతి గొ్రెపాటి కుటుంబం

నా కిప్పుడు 72 ఏళ్ళు. జీవితంలో ఎన్నో కష్టసుఖా లనుభవిం చాను. దాంపత్యజీవితంగురించి అనేక గ్రంథాలు చదివాను. చాలా మందితో చర్చించాను. అన్నింటికీ మేళవించి యిది వ్రాస్తున్నాను.

పూర్వపు వర్ణాశ్రమ ధర్మాలు అంతరించినట్లే, వెనుకటి భార్యాభర్త సంబంధాలు గతించాయి. అసలు భార్యాభర్త అనే సంబంధమే బానిససమాజానికి చెందినది. భర్త అంటే పోషించే

వాడు, భార్య అంటే పోషింపబడేది. ఇది యజమాని, సేవక సంబంధం మన పెద్దల దృష్టిలో ఆడది అంటే ఆటబొమ్మ, వంట లక్క, కాని మగవాడికి తోడునీడ కాదు. ఇవన్నీ బూజుపట్టిన భావాలు. మానవజాతి ఎంతో ముందడుగు వేసింది.

మనది ప్రజాస్వామ్యయుగం. వ్యక్తి వికాసం దాని జీవ లక్షణం. వ్యక్తి వికాసాన్ని పెంపొందింపజేసేవి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను అందరం ప్రాణపదంగా ఎంచు కుంటాం. ప్రజాస్వామ్యయుగంలో పుట్టి పెరిగి, స్వేచ్ఛాస్వాతంత్ర్యాల ఛాయలలో వికాసం చెందిన ఇద్దరు వ్యక్తుల మధురమైన మైత్రీ బంధమే నేటికాలపు దాంపత్యం. అందుకే దాంపత్యం అనేది బానిసత్వం కాదు, బాంధవ్యం. ప్రేమ, అనురాగాలు దాంపత్యానికి పునాది. అందుకే నవయుగ వైతాళికుడు గురజాడ గానం చేశాడు.

"మగువలకు మగవారి కొక్కటె
బ్రతుకు సుఖము
ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన, ప్రేమ నిలుచును..."

ఆదర్శజాతి అంటూ ఎలా లేదో ఆదర్శ దాంపత్యమంటూ కూడ లేదు. అన్నీ సాధనవలెనే నెరవేరునట్లే ఇదీను.

పూర్వం పురుషుడు తన దృష్టితో స్మృతి, గ్రంథాలు అన్నీ రాశాడు. భార్య ఎలా వుండాలో వ్రాశాడు గాని భర్త ఎలా వుండాలో వ్రాయలేదు.

"కార్యేషు దాసి, కరణేషు మంత్రి......" ఈ మాదిరిగా వ్రాసుకు పోయాడు. ఆ గుణాలు గల పత్ని యెక్కడైనా దొరుకు తుందా ?

స్త్రీకి విద్య, శిక్షణ ఏది—బోధ, బాధ తప్ప ?

ఒంటిచక్రంబండి సర్కసులో మాత్రమే నడుస్తుంది. జీవితంలో

కుదరదు. జీవితం రెండుచక్రాలబండి—స్త్రీ, పురుషుడు. ప్రతిపని లోను యిద్దరు సహకరించుకుంటేనే నూతనబలం చేకూరుతుంది.

జీవితానికి సరైన సఖి లభ్యమవుతుందా అనేది ముఖ్యంకాదు. ఆమెకు నేను తగినవాడినేనా అని ఆలోచించుకోవాలి.

ఒకరినొకరు చూచుకోవడం చాలదు. ఇద్దరూ కలిసి ఏకోన్ముఖంగా చూడడమే ప్రేమ అనిపించుకొంటుంది.

వివాహమంటే విభిన్న వాతావరణంలో పెరిగిన ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు తెలుసుకుంటూ, అర్థంచేసుకుంటూ, ఒకరి అవసరాలు మరొకరు మెలకువతో గుర్తిస్తూ, పొరపులు లేకుండా స్వార్థరహిత దృక్పథంతో ఒకరికోసం మరొకరు అన్నట్లు జీవితయాత్ర సాగించడం.

స్త్రీని అర్ధాంగిగా గాక, అన్యాంగిగా భావించడంవల్లనే అనర్థాలు వస్తున్నవి.

అనురాగం సంవత్సరాలు గడచినకొద్దీ వృద్ధి అవుతుంది. అది వయసు, అందం_అన్నిటిని మించి మనసును మనసులో ఏకంచేస్తుంది. ఇందుకు సహచర్యం, స్వార్థత్యాగం, ప్రయత్నం ముఖ్యం. ఇది వివాహం అయిన అనంతరం కొంత పొంగు తగ్గిన తర్వాత కాని జరగదు. వయసు గడచినకొద్దీ ఈ అనురాగలత వృద్ధిగాంచుతుంది.

ఇంటిగుట్టు బయట చెప్పడం, బయటి తగాదాలు ఇంటికి తేవడం వలన తమకు తామే నాశనం చేసుకున్నట్లవుతుంది.

పురుషునికి ప్రేమ జీవితంలో ఒకభాగం, స్త్రీకి ప్రేమే జీవితం.

జీవితానికి వెలుగు ప్రసాదించే దేవిగా స్త్రీని ఆరాధించాలి. అందుకు అనుగుణంగా ఆమె ప్రవర్తించాలి.

జీవితంలోగాని, దాంపత్యంలోగాని సరిపెట్టుకుని పోయేవారే సుఖపడతారు. సరిపెట్టుకునే గుణం స్త్రీలో అధికం.

పెళ్ళాం అనగా యౌవనంలో చెలికత్తె, మధ్యవయసులో తోడునీడ, వయసు మళ్ళిన తర్వాత దాది.

ఇక మా సంగతి వ్రాస్తాను.

మా ఆవిడ పేరు కుటుంబమ్మ. ఈమె పుట్టిల్లు మా గ్రామానికి నాలుగుమైళ్ళలో వున్న లంకపల్లి. ఈమెకు ఒకసోదరుడు లక్ష్మినారాయణ, సోదరి కాశీ అన్నపూర్ణ. వీరి తండ్రి గ్రామమునసబు వీరమాచనేని భూషయ్యగారు, తల్లి పున్నమ్మగారు.

మా వివాహం నా 19 వ యేట 10_6_1917 న జరిగింది. అప్పటికి ఆమె వయసు 14 సం॥లు. 1918లో కాపురానికి వచ్చింది.

మా ప్రథమ సంతానం సీతారామయ్య వివాహం అయిన తర్వాత అతను గతించాడు. తర్వాత అతని భార్య ద్వితీయం చేసుకొనడం సంతోషం.

1925 లో శకుంతల. జాతీయవాదిని గనుక గుంటూరు శారదా నికేతనంలో చదివించాను. అక్కడ సంస్కృతం, హిందీ, ఇంగ్లీషు చదివింది. 27-3-1942 లో ఆమె వివాహం బొందలపాటి శివరామకృష్ణతో వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ ఆధ్వర్యాన, వర్జం, వారం చూడకుండా ఆ వివాహం జరిపించాను. ఇది ఆనాటి పరిస్థితుల ప్రభావం. వారికి శివాజి, సుజాత, రాంబాబు, కృష్ణ - నలుగురు సంతానం. దేశికవితామండలి అనే ప్రచురణ సంస్థను స్థాపించి, నూతన పోకడలు పోయి, యశస్సు సంపాదించి, 45 వళ్ళ వయసుననే అస్తమించడం దురదృష్టం (2_6_63).

శకుంతల తర్వాత ఇద్దరు మగపిల్లలు పుట్టిపోయారు. పురుషునికి భోగాపేక్ష, స్త్రీకి సంతానాపేక్ష. శకుంతలకు ఆడతోడు లేకుండా పోతుందని మా ఆవిడ దిగులుపడేది.

24_12_1934న సుగుణ పుట్టింది. బి.ఏ. వరకు చదివింది. 1954 లో ఆమె వివాహం నిమ్మగడ్డ వెంకటరంగారావు (దొండపాడు)తో

జరిగింది. ఆయన హైద్రాబాద్‌లో లాయరు. వారికి ఆనంద్ అనే కుమారుడు. 1958లో మరొక మగశిశువుని ప్రసవించి 3-12-58న సుగుణ మమ్మలను దుఃఖంలో ముంచిపోయింది. రెండునెలలకు ఆశిశువు తల్లిని అనుగమించాడు.

సుగుణ తర్వాత మాకు రాధాకృష్ణ పుట్టాడు. అతనికి వ్యవసాయంమీద అభిరుచి. శ్రీ గొట్టిపాటి వెంకటకృష్ణయ్యగారి కుమార్తె జయప్రద(భట్లపెనుమర్రు)తో 1956లో అతని వివాహంజరిగింది వారికి మురళీకృష్ణ, రామకృష్ణ, సుగుణ సంతానం. మాకోడలు వచ్చి అత్తగారి పుత్రికాదుఃఖాన్నుపశమింపజేయడం సంతసింపదగిన సంగతి.

ఇక మా దాంపత్యం సంగతి.

"పూర్వంమీగొడవలో, మీచదువులో మీరుండేవారు. మీరు పలకరించడంలేదని బాధపడేదానను కాను. ఒకప్పుడు పలకరించకపోతే, బాధ. ఎప్పుడూ ఒకమాదిరిగావుంటే ఏమీవుండదు.

"ఇప్పుడు మీరు తరుచు పలకరిస్తూంటే, వయసుమళ్ళిన తర్వాత పవిత్రమైన ప్రేమకలుగుతుంది కాబోలునని అనుకుంటున్నా.

"అబ్బాయి కృష్ణకు చిన్నతనంలో తలమాడైనపుడు, అతనితో నేనుసతమవుతూండేదాన్ని. ఎప్పుడూ చేతుల్లో పెట్టుకుంటూండేదాన్ని. అప్పుడు మీరువచ్చి మీచేతుల్లోకి తీసుకుని అన్నంతినమనేనారు. ఆ దృశ్యమే నన్ను ఎప్పుడూ మీకువసురాలిని చేసుంది. వాడితలకురుపులు చూచి, ఆవయసులో మీరు నాకోరకు వాడిని ఎత్తుకోవడం నాకేగాక, చూచినవారందరకు కూడ అబ్బురంగా వుండేది. నా కష్టసుఖాలపట్ల మీకు గల గాఢాభిమానం నేను జన్మలో మరువలేను.

"మీ అమ్మకూడా "ఎందుకే వాడింకా బతికి బట్టకడతాడా, నువ్వెందుకు పథ్యపానాదులతో ఎండిపోతావు" అనేది. అప్పట్లో నా పథ్యం ఉసిరిపచ్చడి, మజ్జిగన్నం. దీనితోను, వాడిని కనిపెట్టుకు వుండడంతోను బాగా శుష్కించిపోయాను"

అన్నది మా ఆవిడ పాతసంగతులన్నీ గుర్తు చేసుకుంటూ. "వాడిని నువ్వు బ్రతికించుకున్నావు తల్లి ప్రేమతో. ఇప్పుడు నిన్ను నీ కోడలూ, అబ్బాయీ బ్రతికించుకున్నారు. నీ ప్రేమకంటే వాళ్ళ ప్రేమ గొప్పది" అని నేనంటే నవ్వుకున్నది.

తల్లి బిడ్డను ప్రేమించడంలో గొప్పలేదు. సంతాన ప్రేమ పశు ప్రేమ. తల్లిని ప్రేమించడమే మానవప్రేమ. అది దైవత్వానికి సంబంధించినది. (ఆమెకు 1969 లో పెద్దజబ్బు చేసినపుడు వారు తమ దగ్గరకు తీసుకువెళ్ళారు.)

నన్ను ఎప్పుడూ ఆమె "వడ్డించాను, భోజనానికి రండి" అనదు. "వస్తారా?" అంటుంది. ఇందులో ఆమె సంస్కారం కనబడుతుంది.

అలాగే అమ్మాయి శకుంతలకూడ "నాన్నా, వస్తారా!" అంటుంది.

ప్రతి స్త్రీ తన భర్త ప్రేమ, ఆదరణ, ఆప్యాయత, పలకరింపు కోరుకుంటుంది.

ఇటీవల అమ్మాయి మాటల సందర్భంలో తనతో ఒకామెయిలా అన్నదని చెప్పింది_ "అమ్మాయి! మీ అమ్మతో బావగారెలా మాట్లాడతారో అలా నాతో మీ బాబాయి మాట్లాడరు గదా" అని.

మానవుడు కోరేది హృదయాన్ని. హృదయమిచ్చి హృదయాన్ని తీసుకోవాలి. అన్నిటికంటె అతి మధురమైనది హృదయానుబంధం.

ఇప్పుడు వయసుమళ్ళిన తర్వాత మే మిద్దరం కలిసిమెలిసి జీవిస్తున్నాం.

ఒకరితో ఒకరం అరమరిక లేకుండా మాట్లాడుకుంటున్నాం.

ఒకరి కష్టసుఖాలు మరొకరం గ్రహిస్తున్నాం.

నిజమైన జీవితం ఇప్పుడే ఆరంభమైనదనుకొంటున్నా.

నేను ఇంతవరకు తనను ఏమీ కష్టపెట్టలేదని, తూలనాడ లేదని అంటుంది మా ఆవిడ.

పడుచుతనంలో నాకేమైనా కోపం వచ్చినా, సహించక పోయినా, పళ్ళెం విడిచి వెళ్ళిపోయేవాడినని, మరింకేమీ అనేవాడిని కానని అంటుందామె.

మమ్ములను వీడిపోయిన మా మరదలు కానూరి కాశీ అన్న పూర్ణ తాలూకు భూమి అమ్మి, మా ఇంటావిడ పేరనే వ్రాయిం చాను. దాని తాలూకు జమ ఖర్చు వ్రాసి, కొంతకాలానికి ఆ మొత్తం అంతా ఆమెకు అంద జేయబోయాను.

అందుకు ఆమె "సంసారములో 'నాది' అని 'నీది' అని ఏమి టండి? ఎవరిది వారికే అనుకుంటే సంసారం ఎలా సాగుతుంది? చాలు చాల్లెండి, నా కక్కర్లేదు" అన్నది.

ఆమె మామూలుగానే తన సహజధోరణిలోనే అన్నది. కాని ఆలోచిస్తే చాలా సత్యమని తోస్తుంది. ఇలా కాకుండా వేరేవేరే చిత్తాలు పెట్టుకొన్నవారు తగాదా పడడం చూస్తున్నాను.

స్త్రీ యుగ యుగాలనుండి అనేక బాధలు పడుతున్నది. ఈ బాధానివారణకు, ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం, స్త్రీలకు పురుషు లతోపాటు చాలావరకు సమానహక్కులు, బాధ్యతలు వచ్చినవి. స్త్రీ పురుష సంబంధాలలో ఇది చాలా కలవరానికి కారణం అయింది.

నిజంగా స్త్రీల కష్టనివారణకు ఏర్పడింది ఇది.

అయినా దాంపత్య జీవితంలో మాత్రం ఇది ఎన్నడు కని విని ఎరుగని విపరీతాలు పొటమరిస్తున్నాయి. సంసార జీవితంలో మాత్రం ఇది సరైనది కాదని ఒక పాశ్చాత్యవేత్త అభిప్రాయం.

రాబర్ట్ లించ్ ఒక యువదంపతులను ఎనిమిది సంవత్సరాలు పరిశోధించిన పిమ్మట చెప్పినది.

"సమానహక్కులు, అధికారాలు సాధించారు కనుక, సమాన

యోగ్యత, అర్హతలు అలవరచుకోవాలని ఆశయంగా పెట్టుకొన్నారు. ఇది పొరపాటని అనుభవంమీద తెలిసింది."

దంపతు లెవరూ "ఇది నాది"అనుకోరాదు. "మనది" అనుకోవాలి.

ఈమధ్య మా ఆవిడతో "నీ సొమ్ము నాకింద చాలా పడింది. నేను ముసలివాడ నయాను. ఎవరుముందో ఏమో, కొంతడబ్బు నీ కిస్తాను, వుంచుకో"మంటే, "మీా రున్నంతవరకు అక్కర్లేదుగదా! మరి మీారే లేనపుడు ఈ డబ్బు కాపాడుతుందా ?" అన్నది.

పురుషుడు పోయినతర్వాత స్త్రీది బానిసబ్రతుకు. సంఘంలోను, కుటుంబంలోను ఆమె అభాగిని. వార్ధక్యంలో స్త్రీలేని పురుషుని జీవితమూా దుర్భరమే.

ఆమె ఎప్పుడు ఎంత పైకం కావాలంటే అంత యిస్తూవుంటాను. గ్రామాంతరం వెళుతున్నపుడు "ఎంతకావాలని" అడిగితే "ఇరవై" అంటుంది. "ముప్ఫై తీసుకో, అవసరం వస్తుందేమో" నంటే, "వద్దండీ, ఎంత చేతిలోవుంటే అంతా ఖర్చవుతుంది" అని తీసుకోదు.

భార్య అడిగినపుడు యివ్వకపోతే ఆమె యింట్లో ధాన్యమో, అపరాలో దిగబోస్తుంది. ఆమె అడిగినప్పుడు యివ్వకపోవడం యేం న్యాయం ? భార్యను అర్ధాంగిగా గాక, పెద్దమనిషిగా భావించినట్లవుతుంది.

అసలు దంపతులలో అనురాగం వుంటే ఆర్థిక తగాదాలు రానే రావు. అనురాగం లేనపుడు అన్నీ తగాదాలే.

ఒకసారి మా పాలేరు వచ్చి "మన బండి విరిగిపోయిందండి" అన్నాడు. "ఎలా విరిగిందిరా?" అని నే నడుగుతూంటే, కన్నతల్లి వచ్చి "అబ్బాయికి దెబ్బ తగల్లేదుగదా?" అన్నది. నాకుమాత్రం

కుమారునిమీద ప్రేమ లేదా? కాని తల్లికీ తండ్రికీగల తారతమ్యమదే. తల్లి ప్రాణం అలా అనిపించింది.

"Woman, the world of the love, of emotion, of sympathy."

నేను ప్రతిదీ స్త్రీతో సంప్రదించడమేగాదు, ఆమె మాటను మన్నిస్తున్నాను. మరీ ముసలివాళ్ళమైన తర్వాత ఆమెలోని మాధుర్యాన్ని గ్రహిస్తున్నాను.

వయస్సులో శరీరాల కలయిక, అది మోహము.

ఒకరి సుఖానికై ఒకరు తోడ్పడడం, త్యాగం చేయడం— ఇదీ ప్రేమ. పరస్పరం వీడలేని అనుబంధం.

వృద్ధులమైన తర్వాత మిత్రులవలె కలసిమెలసి సంభాషించుకొని ఆనందిస్తున్నాం.

మాటల సందర్భంలో "మళ్ళా జన్మలోకూడ మీరే నాకు భర్తగా వాల"ని అన్నదామె.

ఇది నా గొప్పతనానికి చెప్పుకోవడంలేదు. ఇంత చదువు చదివి, యెందరి పెద్దల సన్నిధిలో మెలిగిన నేను చప్పున ఆమెతో "నాకూ అదే కోరిక" అనలేకపోయినందుకు విచారిస్తున్నా. ఎంత కాలానికో ఆమాట ఆమెతో అన్నా. 'విప్రాత్ పశ్చిమ బుద్ధయః' అన్నారుగదా! చదువు వేరు, సంస్కారం వేరు.

ఒకసారి నేను వూరువెళ్ళి తిరిగివచ్చాక "మనుమడు ఆనంద్ "అమ్మా, నిన్ను తాత ఏమీ అనడేమే?" అని అడిగాడండీ. వీడికి ఆమాట ఎందుకు తట్టిందో" నన్నది ఆవిడ.

"నేను వార్ధక్యంలో నీకు లొంగిపోయాను గదా !" అన్నాను.

"వార్ధక్యంలో ఏమిటండి ! మీా రెప్పుడో లొంగిపోయా" రన్నది.

దాంపత్యంలో కూడ పరిహాసా లవసరం. జీవితంలో పరిహాసం, సరసం లేకపోతే ఏమున్నది ఆనందం !

"సానితో సరసాలుగాని పెళ్ళాంతోనా ?" అన్నది పాత మాట !

ఒకసారి మే మిద్దరం మా అమ్మాయి శకుంతలగారి ఇంటివద్ద వుండగా నూతన దంపతులు వచ్చారు.

"మీా రిద్దరు అన్యోన్యంగా వుంటున్నారా ? అదిగో మా ఆవిడ. ఆమెని అడగండి. మే మెంత కలసిమెలసి వుంటున్నామో."

"ఆఁ ! ఇప్పు డుంటున్నాం లెండి కలసి మెలసి" అన్నదావిడ.

"కావలసింది ఇప్పుడే – వయసులో ఎలా వున్నా ఫర్వాలేదు" అన్నా.

వయసు, మనసు పెరిగిన తర్వాతనేగదా జీవితం !

మిత్రుడు నారాయణరాజు ఒకసారి "అవ్వగారూ, తాతగారు అందరకు మంచివారు. మీాకూ మంచివారేనా ?" అన్నారు. "నాయనా, వారిని దగ్గర పెట్టుకునా అడగడం?" అన్నది చమత్కారంగా. ఇటువంటి చమత్కారాలు లేకపోతే జీవితం శుష్కం, శూన్యం అయిపోతుంది.

"నిజం చెప్పు. వయసులో నిన్నేమైనా అన్నానా ?" అన్నాను ఒకసారి.

"అసలు మనఇంట్లో ఒకరి నొకరు చెడుగా అనుకోవడమనేది లేనేలేదు. నే నెప్పుడు పడితే అప్పుడు పుట్టింటికి వెళ్ళేదాన్ని. ఏమి చేసినా మీారేమీా అనేవారు కారు.

"నన్నేకాదు, అమ్మాయి శకుంతల చదువు మానినపిమ్మట, కమ్యూనిస్టు స్త్రీలతో కలిసి మహిళా సంఘాలలో పనిచేసినపుడుకూడ మీారేమీా అనలా" అన్నది

ఒకసారి వేమూరి జగపతి భార్య శ్రీకృష్ణ వచ్చి ఆమెతో మాట్లాడుతున్నది. ఆ అమ్మాయి మనుమరాలు వరస అవుతుంది. నేనూ వెళ్ళి పరిహాసంగా "ఇతరు లున్నపుడైనా నేను వస్తే నుంచో వద్దా?" అన్నా. "ఆమె పరాయిది కాదుగదండీ. మనుమరాలేగా?" అన్నది ఆలోచించకుండానే ఇంత చక్కని సమాధాన మిచ్చింది.

ఇటువంటి మధురస్మృతు లెన్నో వున్నవి జీవితంలో.

గృహసంబంధమైన విషయాలలో స్త్రీలు నేర్పరులు. అందులో వారిమాట వినడం మంచిదని నా అనుభవం.

త్రిపురనేని గోపీచంద్‌గారు కూడ మాటలసందర్భంలో ఒక సారి యిదే అభిప్రాయాన్ని వెల్లడించారు.

మా అబ్బాయి మితభాషి. అందరిలో కలవలేడు. నేనూ మొదట అలాగే వుండేవాడిని.

అత నొకసారి వుత్తరంలో "అమ్మ ఆరోగ్యం ఎలా వున్నది? కులాసాగా వున్నదా?" అని రాసిన భాగాన్ని చదువుతూంటే వాళ్ళమ్మ "వాడిని ఇప్పుడు కన్నట్లున్నద"ని ఉప్పొంగి పోయింది. మనసులో ప్రేమవుంటే చాలదు. దానిని వెల్లడించితేనే ఆనందం.

ఇది గుర్తెరిగే నేను ఆనందింపజేసి, ఆనందిస్తున్నా—ఇంటా, బయటా!

ఇదివరకు నా రచనలన్నీ మా అల్లుడే అచ్చు వేసుకునేవాడు. అతను లేడు యిప్పుడు. 'ఘంటశాల చరిత్ర' రెండవ ముద్రణ అచ్చు వేయడం సమస్య అయింది.

ఈ సంగతి కనిపెట్టిన నా సతి "ఆలోచిస్తా రెందుకు? వారిని వీరిని అడుగుతారా? ఒక ఎకరం అమ్మి అచ్చువేయించండి" అంది.

నే నెవరిని అడగతలచ లేదు. మిత్రులు ఇది గ్రామానికి సంబంధించినదని కొంత పోగుచేసి యిచ్చారు. మిగతా 3 వేలు చేతిది పడింది.

గ్రామానికికూడా నేను సేవ చేశానని ఆనందిస్తున్నాను. ఈ చరిత్రలో ఘంటసాల ప్రతిష్ఠ పెరిగిందని అంటున్నారు విజ్ఞులు.

ఈ కారణా లన్నిటినిబట్టి ఆమె సంస్కారం, ఆత్మగౌరవం గల దని, నాకు తోడు నీడ అనుకొని ఆనందిస్తాను.

స్త్రీని కాదని ఏం చేయగలం ? సాధింపులు ఎటువంటివారికీ తప్పవు. 'ఇంటిలోనిపోరు ఇంతింత గాదయా' అన్నాడు వేమన.

అనుకూలవతి, వివేకవతి అర్థాంగి అయితే ఎంత ఆనందం ! ఎంత గౌరవం! ప్రయోజనం!

మా ఆవిడ ఆరోగ్యవంతురాలు కాదు. అయినా నేను సభ లకో, సమావేశాలకో, మిత్రసందర్శనానికో తరుచు గ్రామాంతరం వెళుతూంటా.

"నిన్ను యీ వయసులో, అనారోగ్యంలో విడిచి వెళ్ళి, నీపట్ల మహాపరాధమే చేస్తున్నా" నంటూంటా.

అలవాటయిన ప్రయాణాలు. "ఈసారి మిత్రులనందరినీ చూచి ఇంటిపట్టునే వుందా"మని ప్రతిసారీ అనుకుంటా. కాని వుండ లేను.

"ఫర్వాలేదు, ఈ జబ్బు రోజూ వుండేదే, ప్రాణం తీసేది కాదు. నేను అలవాటు పడిపోయాను. మీ రెక్కడవుంటే ఏమండి, మీవంటి భర్త దొరకడం నా అదృష్టం" అంటుందా ఇల్లాలు.

గాంధీమహాత్ము డన్నమాట గుర్తువచ్చింది.

"నేను భర్తగా కస్తూరిబాయిపై అధికారం చేసినంతవరకు ఆమె హృదయంలో నాకు ప్రవేశం కలగలేదు. నా అధికారా లన్నిటిని వదులుకొని అస్త్ర సన్యాసం చేసినపిమ్మట, ఆమె హృదయంలో నిగూఢమైన అమృతభాండం నాకు గోచరించింది!"

ఈ మాట కలకాలం ఎల్లరూ మననం చేసుకోవలసినది.

East and West
Home is best

సకల ప్రపంచంలోను గృహస్థాశ్రమమే శ్రేష్టము.

# శ్రీ చెరుకువాడ వేంకటనరసింహం

"జీవిత వ్యామోహంలో పడనివాడు, జీవితాన్ని ఆనందించగలడు"

—గాంధీజీ

అమాయకత్వాన్ని సూచించే ముఖము, స్వచ్ఛతను ప్రకటించే తెల్ల నిక్కరు,పట్టుదలను సూచించేముక్కు,హృదయవైశాల్యంసూచించే వక్షస్థలము, లోకశ్రేయము నుత్సహించే శ్రవణపుటములు, త్యాగాన్ని సూచించే ముండనము, జన్మచేతనే సమత్వాన్ని సూచించే దేహాకారము, వస్త్రధారణ కలవారు మన చెరుకువాడవారు.

ఆయన చదువుకున్నది తక్కువ, తెలుసుకున్నది ఎక్కువ. తెలిపినది ఇంకా ఎక్కువ. గొప్ప వయోజన విద్యాప్రచారకుడు. ఆయన ఉపన్యాసాలు పామరులను పరిణతులను చేసినవి. ఆయనవంటి వక్త అరుదు. పల్లెటూరివారికి తెలిసే మాటల్లో, ఆ ఉపమానాలతో, వారిలో ఒకడై చెప్పినవాడు చెరుకువాడ. చెరుకువాడ వాక్కు చెరుకురసం గదా !

ఆంధ్రదేశంలో ఆయన వెళ్ళని వూరుగాని, ఆయన వాక్కు వినని వ్యక్తిగాని వుండరంటే అతిశయోక్తి కాదు. ఆయన ఆంధ్ర డెమాస్తనీస్, ఉపన్యాసకేసరి. ఆంధ్రదేశాన్నంతా వుర్రూతలూగించాడు—వుపన్యాసాలద్వారా.

ఒక విషయాన్నిగురించి అనుకూలంగాను, ప్రతికూలంగాను గంటలతరబడి చెప్పగల ప్రజ్ఞావంతుడు; హాస్యచతురతలో అందె వేసిన చేయి.

ఆయనవంటి కాంగ్రెసు ప్రచారకులు ఎవరున్నారు ? ఆనాడు బౌద్ధమత ప్రచారానికి బౌద్ధభిక్షువులు బయలుదేరి, బుద్ధభగవానుని బోధలు బోధించినట్లే, నరసింహంగారు నడుంకట్టి కాంగ్రెసు మతాన్ని

లోకానికి వంటబట్టేటట్లు బోధించాడు. కాళ్ళుబలపాలు కట్టేటట్లు పాదచారియై ప్రచారం చేశాడు ఆ పరివ్రాజకుడు.

బౌద్ధుల ప్రచారకళ, జైనుల సేవాదీక్ష, వేదవిదుల ధర్మతత్పరత—వీటి మేళవింపు ఆయనలో చూడగలం.

ఆయన నియోగిశాఖలో జన్మించాడు గాని స్వభావముచేత శుద్ధవైదీకి. ఆయనసేవకు శతకోటి యజ్ఞఫలం లభించగలదు. తన జన్మలో ఇంగ్లీషు చదువు చదువుట మినహా మరేపాపము చేయలేదని చెప్పే ఛాందసు డాయన !

ఆయన పెక్కుగ్రంథాలు వ్రాయలేదుగాని, వ్రాసినవి రెండూ రత్నాలే. "స్వరాజ్యదర్పణము"—కాంగ్రెసు యువకులకు వేదం. 'శాసనసభలు'—ఒక ప్రమాణగ్రంథము. ఆ గ్రంథా లానాడు కాంగ్రెసు ప్రచారకులకు చాలా ఊతగా ఉండేవి.

ఆయన భీమా కంపెనీలలో పనిజేసి "భీమాడిండిమ" అని ప్రఖ్యాతి గాంచాడు. కాని భీమాకంపెనీల తిరుగుళ్లు తెలిపి లోకానికి హెచ్చరిక కలిగించాడు.

"ఆదర్శప్రాయమైన ఉపాధ్యాయ ధర్మాన్ని నెరపిన ఈనాటి బృహస్పతే మన చెరుకువాడ ఆయన వర్తన, త్యాగం అనితరం — చెరుకువాడ ఎందరికో పెంపు కలగజేశాడు. ఆంధ్రదేశానికి చైతన్యం కలగజేశాడు. కాని ఆయన పల్లకీబోయీ !

"కృష్ణాపత్రిక చతురతకు, చురుకుదనానికి, వాడుకమాటలకు, సొగసైన పోకడలకు,హాస్యరసప్రవాహమునకు,ఆనందమొసగు వెణుకులకు, తావలమైన లోటివ్రాతలు చెరుకువాడ పని" అని అంటారు ఆచార్యరంగాగారు.

—15-10-'39 చిత్రగుప్త.

ఆయన కొంతకాలం విద్యాలయంలో పదియేండ్లుగా ఉపాధ్యాయుడుగా పనిచేసినందున, ఆంధ్ర జాతీయకళాశాలలో అధ్యాపకుడుగా

పనిచేసినా ఆయన గురువుగా గుర్తింపబడలేదు. ఏకలవ్య శిష్యులే ఆయనకు ఎక్కువ.

"ఆయన లోకులను పెంచాడు. కాని తాను పెరగలేదం" టారు ఆచార్యరంగాగారు. నేనూ అట్లాగే అనుకున్నాను. ఆయన పదవులకై ప్రాకులాడదలచలేదు. అధికారానికి అర్రులు చాచలేదు. ఆచార్యరంగాగారన్నట్లు ఆయన ఈనాటి బృహస్పతి. గురుస్థానంకంటె ఉత్తమమైన పదవి ఏది ? ఆయన కోరింది అదే. ఆయన రాణించింది అందులోనే. స్వీయకీర్తి, పలుకుబడి, ప్రాపకం, స్వార్థం కోరువారు ఆయనను అనుసరించగలరా ?

ఆయన శిష్యబృందంలో ప్రహ్లాదునివంటి భక్తులు, వికర్ణునివంటి ధర్మనిర్ణయవేత్తలు, అభిమన్యునివంటి వీరులు, అర్జునునివంటి సవ్యసాచులు, దుర్యోధనునివంటి సంపత్తిగలవారు, అతిరథులు, మహారథులు, ఏకలవ్యులు కలరు. ఆయన యీనాటి ద్రోణాచార్యులు. ఆయన తన శిష్యగణాన్ని జూచి గర్వపడతాడు. ఆయనకేమీ కొదువ. ఆయన కోరేది పెంపే ! పదవులు పెరవారికే !

నరసింహంగారు గాంధీమహాత్ముని అడుగుజాడల్లో నడిచి, స్వచ్ఛందంగా దరిద్రాన్ని వరించి పదవీవ్యామోహంలో పడకుండా, జీవితకాలమంతా అక్షరాలా ఆచార్యుడుగా వుంటూ, శిష్యుల వున్నతి జూచి వుప్పొంగుతూ, వారి నమస్కారాలు స్వీకరిస్తూ "అభివృద్ధిరస్తు" అని ఆశీర్వదిస్తూ 'ధన్యోస్మి' అని అనుకుంటూ ఆనందంలో వుండుటే ఆయన అభిమతము.

ఆయన జన్మతః ఆచార్యుడు. అజాతశత్రువు. పరశ్రేయము, పరోపకారము ఆయనకు పరమప్రియము.

"సర్వేజనా స్సుఖినోభవంతు" అనునదే ఆ ఆచార్యుని సంకల్పం.

పంతులుగారి తాతము త్తవలది మా ఊరే. ఆయన తోబుట్టువుని తమ మేనమామ ఘంటశాల ఉద్దండ నరసింహంగారికిచ్చారు.

బాల్యంలో ఎక్కువగా తాతయ్య తవలవద్ద వుండేవారు. అలా మా వూరికి రాకపోక లెక్కువగా ఉండేవి. ఈవిధంగా మా వూరైన ఘంటశాలకు, పంతులుగారికి అవినాభావ సంబంధం ఏర్పడుటవల్ల, ఈ గ్రామమందు ఆదరాభిమానము లధికమైనవి. ఈ ఉపన్యాస చక్రవర్తి ఈ గ్రామములోనే భూగోళాన్ని గురించి ప్రథమంగా ఉపన్యసించినట్లు చెపుతుండేవారు.

అసహాయోద్యమము ఆరంభమైన తర్వాత పంతులుగారితో, బ్రహ్మయ్యగారికి, నాకు ఒక అనుబంధం ఏర్పడింది. వారితో కలసి కాంగ్రెసు ప్రచారానికై వెళ్తూవుండేవారం. అనేక సభలు, సమావేశాలలో కలుస్తూవుండేవారం. పంతులుగారు అన్నిటా పెద్దవుటచేత వారిని నేను గురువుగా భావించేవాడిని. వారు నన్ను ఆప్యాయంగా 'ఏం సుబ్బయ్యనాయుడూ!' అని సంబోధిస్తూ కుశలప్రశ్న లడుగుతూ వుండేవారు.

పంతులుగారు తణుకులో కాపురం పెట్టిన తర్వాత వారు జబ్బుపడ్డారని తెలిసి మిత్రులు బ్రహ్మయ్యగారు, నేను సందర్శించ వెళ్లాము. మమ్మల్ని చూసి వారెంతో ఆనందించి తాము బలహీనంగావుండికూడా తమ తోట చూపెట్టారు. అప్పట్లో నేను రచించిన "మనరైతుపెద్ద" అనే బ్రహ్మయ్యగారి చరిత్రలోని గురుత్రయమే (అనగా ముట్నూరి కృష్ణారావుగారు, పట్టాభిగారు, చెరుకువాడ వేంకటనరసింహంగారు) వినిపించగా ఆనందబాష్పాలు రాల్చారు.

విజయవాడ వచ్చినపుడు పంతులుగారిని దర్శించి 'హంపీ పిలుపు' ఇచ్చాను. దానివెల ఎనిమిదణాలు వుండటం చూచి, నాకు యివ్వబోయారు. అప్పుడు నేను "మీరు నా గురువులు. మీ ఆశీర్వచనం కోరుకుంటాను గాని, మీ ధనాన్ని ఆశించను" అంటే, "ఏమిటోయ్, ఇంత శ్రమపడి, ఖర్చుపడి, పుస్తకాలు ఊరకనే యివ్వడం మంచిది కాద"ని, ఆశీర్వదించారు.

నేను ఎవరికీ పరిచయాన్ని పురస్కరించుకొని పుస్తకం ఇచ్చి

ఖరీదు పుచ్చుకోను. అమ్మకంపని మా అల్లునిది. ఆయన ప్రచురణ కర్త.*

కృష్ణారావుగారియందు వీరికి గురుభావం. వారు కీర్తిశేషులైన తర్వాత వీరు "కృష్ణరాయలతో దివికేగలేక బ్రతుకుచున్నాడ జీవచ్ఛవంబు నగుచు" అంటూ ఆనాటి అల్లసాని పెద్దనవలె బాధపడ్డారు.

నరసింహంగారిది దివితాలూకా చిరువోలు. వారు 1-3-1887న ఘంటసాలలో జన్మించారు. చెరుకురసం దేశమంతటా గ్రోలింప చేశారు.

కృష్ణరాయలను కలుసుకొనుటకు 77 వ ఏట తెణుకులో 22-6-1964 న దివికేగారు.

తెణుకు,

8-11-48

మిత్రుడు చిరంజీవి గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారిని నేను చాలా చిన్నతనమునుండి బాగా యెరుగుదును. అతని స్వగ్రామమగు ఘంటశాల నాకు మాతామహస్థానమును, జన్మస్థానమునగుట చేతను,

---

* శివరామకృష్ణ మీకు రాయల్టీ ఏమిస్తున్నాడండీ అన్నగారూ?" అని మునిమాణిక్యంగా రడిగారు. "ఆయన నాకు ధనపూర్వకంగా ఏమీ యివ్వడంలేదు. కాని నా పుస్తకాలను మిత్రుల కివ్వడం ద్వారా అంతకంటె అధికంగానే నాకు ముడుతోంది" అన్నాను.

శి. రా. కృ. అప్పుడప్పుడు అంటూండేవాడు "ఇక మీకే రాయల్టి ఇవ్వాల్సి వుంద"ని. నేను నవ్వుకొనేవాడిని.

సి. ఆర్. రెడ్డిగారి చరిత్రకు ఆంధ్ర సాహిత్య ఎకాడమీ 2 వేలు ఇచ్చినందుకు నా సోదరుడు వెలమాటి పద్మనాభంగారు సంతోషంపట్టలేక "మా అన్నగారికి 2 వేలు వచ్చినవి" అన్నారు. మా అమ్మాయి శకుంతల "ఇక మీ అన్నగారు ఆ పుస్తకంపుచ్చుకొని ఊరూరు తిరిగి పంచిపెట్టడానికి సరిపోతాయిలెండి" అన్నది. ఇది నాకు పుస్తకాలవలన వచ్చే రాబడి.

మా జ్యేష్టసోదరికూడా ఆ గ్రామవాసినిగా నుండుటచేతను, నాకా గ్రామములోని పిన్న పెద్దలందరితోను మిక్కిలి సన్నిహితమైన చిర పరిచయము కలదు. ఇతను వ్రాసిన "ఘంటసాల చరిత్ర", "ఆచార్య రంగా", "మన రైతుపెద్ద" అనే గ్రంథముల నిటీవలనే చూచి చాలా సంతోషించినాను. ఈ ఘంటశాల గ్రామచరిత్రను నన్ను వ్రాయు మని నా మిత్రుడు కీ॥ శే॥ కౌతా శ్రీరామశాస్త్రిగారు 25 సంవత్స ముల క్రిందట ఎంతో ప్రోత్సహించెను. నేటి కా పని మిత్రుడు వెంకటసుబ్బయ్యగారు సమగ్రముగా నిర్వర్తించుట మిక్కిలి ముదావ హము. ఇతని రచనాకౌశలము చాల ప్రశంసనీయముగా నున్నది. సన్నిహిత సమకాల సమవయస్కుల ఔద్ధత్యమున కానందించుటయే గాక వారి గుణగణ పరిశీలనా ప్రావీణ్యముచే నితని ఉదారత, రసజ్ఞత ప్రకటితమగుచున్నది. ఇతను వ్రాసినవి సామాన్యవ్యక్తుల జీవితచరిత్ర లైనప్పటికిని, నిజానికవి వారినేదో ప్రయోజనాపేక్షతో, ఉత్ప్రేక్షాతి శయోక్త్యలంకారములతో ప్రశంసించే వందిమాగధస్తోత్రములు కావు. వారి సమకాల స్థల సందర్భ చరిత్రలన్నీ అందు చక్కగా ప్రతిబింబిత మగుచున్నవి. ఇదియే చరిత్రలు వ్రాయవలసిన సరియైన పద్ధతి అని ఒక ప్పుడు శ్రీ ముట్నూరు కృష్ణరాయ గురుపాదులు సెలవిచ్చినట్లు జ్ఞాప కము. ఇతని భాషాశైలి జిగురూ రుచీలేని పొడి మరబియ్యపు పిండి వచనశైలిగాక మనోహరమైన నవల కావ్యంగా నడిచింది. ఇట్లే సద్గ్రంథములింకెన్నో వ్రాసి ధన్యజీవిగా యీ మిత్రుడు చిరకాలము వర్ధిల్లుగాక !

ఇట్లు,

మిత్రుడు, శ్రేయోభిలాషి,

చె॥ వేం॥ నరసింహాము.

తణుకు,

22_11_1959.

మిత్రమా !

శుభమస్తు.

శ్రీ గురుపాదుల జీవితచరిత్ర వ్రాయబూనుట ఎంతయో సముచితముగా నున్నది. నా కా సంగతి మిత్రుడు చిరంజీవి శ్రీ బ్రహ్మయ్య చెప్పగానే నీ పేరే నాకు స్ఫురించింది. శ్రీ కమలాకరం వెంకట్రావు గారుకూడా ఈ పనికి దక్షుడే. నీ విదివరకు యిట్టి జీవితచరిత్రలు కొన్ని వ్రాసి అట్టి కార్యములో కొంత నైపుణ్యముకూడా సంపాదించినావు. ఒక సుప్రసిద్ధ వ్యక్తి జీవితచరిత్ర వ్రాయవలెనంటే జనన ప్రభృతి మరణ పర్యంతం ఆ జీవితంలో జరిగిన తేదీలవారీ వివరాలు మాత్రం కాదు. అట్టి సంఘటనల ముందు వెనుక జరిగిన ఆయా దేశ కాలముల చరిత్ర అంతా ఆ జీవితాదర్శములో ప్రతిబింబించవలెను. నీ ప్రయత్నము అగ్రగణ్యముగా జయవంతమగుగాక !

ఇట్లు,

మిత్రుడు,

చె॥ వేం॥ నరసింహం.

---

నా గురువులలో ఒకరగు కవుతా శ్రీరామశాస్త్రిగారు ఆశించిన ఘంటసాల చరిత్ర రచించాను.

ఇక మరొక గురువగు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారి చరిత్ర పూర్తిచేసి, ఇక మూడవ గురువగు నరసింహంగారి కోర్కెకూడా నెరవేర్చవలసివున్నది.

మిత్రులు చాలామంది వ్రాయమంటున్నారు వారి చరిత్ర, నాకూ వున్నది. కాని సాచేత క్రింద పడుతున్నది.

ఇక నా జీవితంలో మిగిలిన కోర్కె అది.

# శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి

(9-2-1888 – 29-9-1950)

ఆంధ్రలోకానికి ఆయన చేసిన సేవ అపారము. ఆంధ్రలోకం ఆయనను అధికంగా పరిశోధకునిగా ఎరుగును. కాని ఆయన పరిశోధకుడే కాదు, మహాపండితుడు, పండితుడే కాదు కవి, కవిపుంగవుడే కాదు, సంప్రదాయకుడైన సంస్కర్త. సంస్కర్తే కాదు, ఆర్ద్రహృదయుడు. ఆర్ద్రహృదయుడే కాదు అమృతమూర్తి.

జీవన మొక లలితకళగా భావించి ప్రతిపనీ వీలైనంతవరకు శ్రద్ధగా నేర్పుగా చేయుటకు యత్నించిన కళోపాసకుడు.

జీవితంపట్ల అకుంఠిత విశ్వాసము 'ఆత్మవత్పరేషు' చూచే వారి వల్లనే ఏనాటికైనా ఈ లోకము స్వర్గమగును. ఆ కోటిలో చేరినవారు శ్రీ శాస్త్రి.

దేశాభ్యుదయము నాశించి ఆయన ప్రవేశించని రంగం లేదు. చేయని పరిశోధనలు లేవు తీర్పుచెప్పని పరిష్కారములు లేవు. ఆయన అనేక గ్రంథగ్రంథులను విప్పిన పరిశోధకుడు. తెనుగునకు మెరుగులు దిద్దిన మహాశిల్పి.

పండితుల మెప్పులకు గాక ప్రజాసామాన్యం హితంకోరి భాషాభివృద్ధికై సాహిత్య క్షేత్రములో కృషి చేసిన కర్షకోత్తముడు ప్రభాకరుడు.

ప్రాచీన గ్రంథ రాజములకు విపులమగు పీఠికలు రచించుటలో మహానిపుణుడు. ఆయన క్రీడాభిరామమునకు, బసవపురాణమునకు, అన్నమాచార్యుల చరిత్రకు, తంజావూరు ఆంధ్రనాయకుల చరిత్రకు వ్రాసిన పీఠికలు సుప్రసిద్ధములు.

రంగనాథ రామాయణ పరిష్కారములో వారి సహాయము స్తవనీయము. గ్రంథ సంస్కరణలో వారికి మించినవారు 'న భూతో న భవిష్యతి!'

అనువాదములలోను ఆయన ఆరితేరినవాడే. ఆయనచే అనువదింపబడిన 'నీతి నిధి' నిరుపమానమైనది. భాసకృతులను పెక్కింటిని తెనుగులోనికి తెచ్చుటలో ఆయన ఉభయభాషా ప్రావీణ్యత గోచరమగును.

"కడుపు తీపు", "కపోత కథ", "మూనాన్నాళ్ళ ముచ్చట" మొదలగు ఆయన ఖండకావ్యాలు – ఆయన కవితామాధుర్యానికి గీటురాళ్ళు.

"శృంగార శ్రీనాథము" ఆ కవిరాజుపై ఆయనకుగల అపార ప్రేమకు ప్రబల నిదర్శనమేగాక, రెడ్డిరాజుల చరిత్రపైకూడ వెలుగు ప్రసరింపజేసిన ప్రసిద్ధ గ్రంథము.

ఆయన శాసన పరిశోధన, పురాతన గ్రంథసేకరణ, సంస్కరణ, పురాతన గ్రంథప్రచురణ ఆయనకు ఆంధ్రభాషలోగల నేర్పుకు, ఆంధ్రభాషాభిమానమునకు, ఓర్పుకు ప్రబల నిదర్శనములు.

అంతరించి పోతున్న శాసనములను, గ్రంథరాజములను శిల్ప ఖండములను సంతరించిపెట్టి, ఆంధ్రావనికేగాక, దక్షిణాపథమునకంతా మహోపకారము జేసిన మహాపురుషుడు.

మన సంగీతశాస్త్రానికి ఆదిపురుషుడైన శ్రీ తిరుపతి వెంకటేశ్వర సంకీర్తనాచార్యుడగు అన్నమాచార్యుని వర్ధంతి ఉత్సవము జేగీయమానముగా ఆరంభించిన వీరారాధకుడు.

ఆయన ఆదిలో రాళ్ళను, రప్పలను, పుస్తకాలను భద్రపరచుటలో అప్రమత్తుడై, అనంతరము మానవులను మహారోగములనుండి విముక్తమగుటకే గాక లోక కళ్యాణమునకై యోగసాధన చేసిన మహాయోగి.

ఇది వారి వార్ధక్యదశలో అందరకు తెలిసినను. వారి ప్రకృతి బాల్యమునుండి పరులబాధకు వ్యథ చెందుటేగాక దానిని తీర్చవలసినదిగా భగవంతునకు మొరలిడు లక్షణము ఆయనకు చిన్ననాడే అలవడిన సంగతి అందరూ ఎరుగరు.

మాస్టరు సి. వి. వి. తో స్వీయబాధా నివారణకై కలిగిన పరిచయము ప్రబలమై చివరకు పరబాధా నివారణకు పురికొల్పెను.

ప్రభాకరుని యోగసాధనకు రోగములనుకుదుర్చుటే లక్ష్యము గాదు. ఈ లోకములో ఈ ప్రజ్ఞతోనే బ్రహ్మానుభవము పొందుట తుదిలక్ష్యము.

ఈ లక్ష్యముతోనే వారి ప్రజ్ఞా ప్రభాకర రచన సాగినది. వారి ప్రజ్ఞా ప్రభాకరము, ప్రవచనములు అందుకొని అభివృద్ధి గాంచుటవసరము.

అరసున్ననుండి అశేష విషయాలపై వారు వ్రాసిన వ్యాస పరంపర ప్రచురించుట ఆంధ్రులు – ఆయనకు కాదు – తమకు చేసుకొను మేలు.

తిరుపతి వెంకటేశ్వర సన్నిధిని విద్యాజీవనము గడిపి శేష జీవితమును తిరుపతి వెంకటేశ్వర సన్నిధినే గడుపుతూ వేంకటేశ్వరునికే ఆంధ్ర దేశ శిల్పసంపదను అర్పించుటలో తనువు చాలించిన ఆయనజీవితము ధన్యము.

వారికృతులు, వారికృషి అంతా ఒక యెత్తైతే వారి హృదయము ఒక యెత్తు.

ఆంధ్రు లీనాడు తిరుపతిలో మరొక విశ్వవిద్యాలయము నెలకొల్పినందుకు ఆయన అమరలోకముననుండి ఆనందించి ఆశీర్వదించుచుండవచ్చును.

ఆయన అస్తమించినపుడు గ్రంథాలయ సర్వస్వములో పై విధంగా స్మృత్యంజలి ఘటించాను.

శాస్త్రిగారిది దివి తాలూకా కళ్ళేపల్లి. అది మా గ్రామానికి 5, 6 మైళ్ళలో వున్నది. శాస్త్రిగారి మాతామహస్థానము, అత్తవారి ఊరుకూడ మా గ్రామమే. అందుచేత మా గ్రామమంటే అభిమానం. వేసవికాలంలో ఆయన వస్తూ వుండేవాడు. 30 ఏళ్ళు ప్రాచ్య లిఖిత పుస్తక భాండాగారములో పని చేశారు. తర్వాత శ్రీ వెంకటేశ్వర ఇన్స్టిట్యూట్‌లో పని.

మా గ్రామములో పెద్ద, మంచిముసద్ది, సలహాదారు, సాహిత్యాభిమాని వేమూరి రత్నయ్యగారు. ఈయనవద్ద నేను ఆంధ్రభాషా భూషణము చదివాను. ఈయన కవికూడా. కొన్ని పద్యాలు గేయాలు వ్రాశాడు. 'హిందూమత రహస్యము'ను ప్రచురించాడు. ఈయనచేత నేను 1917 లోనే ఘంటసాల చరిత్ర వ్రాయించాడు. ఆయన దాన్ని ఎక్కడో పారవేశాడు. వీరితో తరుచు నేను కాలక్షేపం చేస్తూవుండేవాడిని.

ప్రభాకరశాస్త్రిగారికి వీరికి సాంగత్యం. వీరిరువురు సాయంత్ర సమయంలో మాగ్రామచివర ఆళ్ళ వెంకమ్మ చెరువువద్ద కలిసేవారు. నేనుకూడా వుండేవాడిని. శాస్త్రిగారికి ఘంటసాలను గురించి, ఏ పుస్తకములో ఏమున్నదో తెలుసు. నేను మద్రాసు వారింటికి 1937 లో వెళ్ళితిని. వారితో సంప్రదించి భోగట్టా సంపాదించితిని. మరొకసారి వెళ్ళి మద్రాసులో మకాం పెట్టి, గ్రంథాలయాలన్నీ తిరిగి సేకరించితిని. ఈ విధంగా శాస్త్రిగారు పరిచయుడై, సన్నిహితుడయ్యారు.

## శ్రీ వేమూరి నాగయ్య

ఈయన నల్లగా పొట్టిగా అందులో కొంచెము అందంగా ఉంటూ హాస్య ప్రకృతికలవాడు. అందరిని కవ్వించి నవ్విస్తూ వుండే

వాడు. చింతామణి నాటకంలో సుబ్బిశెట్టి పాత్ర ధరించి కడుపుబ్బ నవ్వించేవాడు అందుచేత కొంద రీయనను సుబ్బిశెట్టి అంటూకూడ ఉండేవారు. నాటకాలంటే బహుసరదా. మా వూళ్ళో గల రెండు నాటక సమాజాలకు ఈయన సభ్యుడుగావుండి వాటి అభివృద్ధికై కృషిచేశాడు.

ఈయన ఇల్లు మా ఇల్లు ఎదురుబదురు. ఈయన సంగతి ఇది వరకే కొంతవరకు చెప్పాను. వీరి తాత తండ్రులనుంచి వ్యాపారస్థులు. బందరులో కొంతకాలముచేసి తరువాత బెజవాడలో చేశారు. అందుచేత ఇక్కడ వారణాసి చిన్న అచ్చన్న పంతులుగారివద్ద చదువుకున్న తరువాత బెజవాడలో ధర్డుఫారమ్ చదివించారు. మా వలె స్కూలుఫైనలు పాసవకుండానే ఇంటికి చేరాడు. తరువాత మా అందరితో కలసి కొంతవరకు కాంగ్రెసు కార్యకలాపాలలో కృషిచేశాడు. 1930 లో సత్యాగ్రహిగా చేరి బందరు చౌకులో ఉప్పు అమ్మాడు గాని ఆయనను అరెస్టు చేయలేదు. ఆయనందుకు చాలా బాధపడే వాడు. తరువాత ఆయన మార్గము వేరయింది. బెజవాడలో ఖాయిదా వ్యాపారం తమవారితో కలసి చేశాడు. కొంతకాలం వ్యవసాయం చేశాడు. మాతో ఆడిపాడి అలరింపజేశాడు. అనేక కారణాలవల్ల వేమూరి శీతారామయ్యగారికి ఈయనకు మైత్రి మెండు. అయినప్పటికి అందరితో కలసిమెలసి ఉండేవాడు.

ఈయనభార్య సరస్వతికి మా ఆవిడకు చాలా స్నేహం. ఈయనకు ప్రఫుల్ల, నిర్మల ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు బుజ్జి అనే బ్రహ్మేశ్వరరావు కలరు. ఈ రెండవ ఆమె మంత్రిపాలెంలో ఉంటుంది. మా ఇళ్ళు రెండు దగ్గరుండుటచేత, నేను వాళ్ళనాన్న స్నేహితులగుటచేత చాలా ఆప్యాయతగ మాట్లాడుతుంది. నాకు ఆమె యెడల అట్టి భావమే కలదు. మిత్రుడు నాగయ్య మమ్ములను విడిచి వెళ్ళిపోయాడు. ఆయన భార్యను అప్పుడప్పుడు చూస్తూంటాను.

మిత్రుడు నాగయ్యగారు ఘంటసాలలో పొలం అమ్మి నిడుమోలులో కొన్నాడు.

కుమారుడు ఆ యిల్లు అమ్మేశాడు. దాన్ని చూస్తూవుంటే మిత్రుడూ జ్ఞాపకానికి వస్తాడు.

# కిసాను గొట్టిపాటి వెంకటసుబ్బయ్య

"ఈ భూమిమీద, ఏ మానవుడైనా తలఎత్తుకొని తిరుగుట కధికార మున్నయెడల అతనే రైతు. రైతే ధనమునకు మూల పురుషుడు, ఉత్పత్తిదారుడు, ధాన్యలక్ష్మికి పీఠం. తదితరులందరు వానిని ఆశ్రయించుకొని బ్రతుకు పరాన్నభుక్కులు".

—సర్దార్ పటేల్.

వెంకటసుబ్బయ్యగారు ఆంధ్ర దేశంలో రైతు నాయకుడుగా విఖ్యాతుడు. గత ముప్పది సంవత్సరాలనుండి రైతాంగ సేవలో అధికకృషి చేస్తున్న సంగతి సర్వజన విదితం. జమీందారీ వ్యతిరేకోద్యమం నాటినుండి నేటివరకు ఆయన ఎన్నో రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించి రైతులోక శ్రేయానికి అహరహం పోరాడుతున్నాడు.

వెంకటసుబ్బయ్యగారు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొని కారాగృహమున కరిగిన స్వాతంత్ర్య యోధుడు.

ఆయన రాష్ట్ర రైతు కాంగ్రెస్ అధ్యక్షుడుగా, కృష్ణాజిల్లా బోర్డు ఉపాధ్యక్షుడిగా, కృషీకార్ లోక్ పార్టీ ప్రథమాధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ స్వతంత్రపార్టీ ప్రథమాధ్యక్షుడిగా, ఆంధ్రప్రదేశ్ కిసాన్ సమ్మేళన సేవారంగంలో ప్రధానపాత్ర వహించి వున్నారు.

ఇటీవల ఆంధ్రరైతాంగాన్ని తీవ్రంగా కలవరపరచిన అదనపు

భూమిశిస్తు చట్టానికి వ్యతిరేకంగా సాగిన సత్యాగ్రహ సమరంలో నాయకత్వం వహించి, రైతాంగం శక్తిని ద్విగుణీకృతం చేశాడు.

త్యాగమే లక్ష్యంగా, సేవయే పరమావధిగా జీవితాన్ని రైతులోకానికి అంకితం చేసుకొన్న ఉత్తమ నాయకుడు, మన రైతు సర్దార్.

ఆచార్య రంగాకి ఆయన కుడిభుజం. లచ్చన్నగారు లక్ష్మణుడైతే, ఈయన హనుమంతుడు. ఎందరు మారినా రంగాగారిని వీడని వీరులు వీరిద్దరు. ఆచార్య రంగాగారిలా వ్రాస్తున్నారు.

"ఎవ్వరీ వెంకటసుబ్బయ్య ? గొప్ప విద్యావంతుడు కాదు. సాధారణ రైతు. స్వయంగా కాయకష్టం చేసి, కాయలుకాచిన హస్తములతోనే కలం రైతుసేవకై పట్టిన పసిమిగల పండిన రైతు

చూచితిరా మీరు వెంకటసుబ్బయ్యను. ఆయన 1933 లో నావలెనే, ఆ బందరులో, ఆ ఎండా కాలంలో, ఆ పండువంటి ఖద్దరు వుత్తర్యంపు తళ్కులతో నూచినట్లైతే ఆ నిండుయౌవనంపు, నిండు రక్తంపు నవ్వులతో ముందుముందుకు వస్తున్న యువకరైతు సేవకులని మీరును, నావలెనే వీరిని సంపాదించుకొందాం రైతు ఉద్యమానికి అని కోరుకుందురు.

"అలాగా హత్తుకుపోయినవి మా హృదయాలు. ఆనాటినుండి అంకితమైరి వెంకటసుబ్బయ్యగారు రైతు ఉద్యమ నాయకత్వమునకు!

రాష్ట్ర ప్రభుత్వపు ధాన్యాల కమిటీలో మూడు సంవత్సరాలు సభ్యులుగా వుండిరి. వారి నిష్కర్షమగు ధోరణి, వ్యవసాయ ఖర్చులనుగురించి వారిచ్చు ఖచ్చితమగు నిరభ్యంతరమగు అనుభవపూర్వకమైన సంజాయిషీ, సలహాలు ప్రభుత్వోద్యోగులకు వూపిరి సలుప నివ్వలేదు.

అంతర్జాతీయ లేబరు ఆఫీసువారికి పంపుటకై వ్యవసాయ కూలీలకు కనీసపు సౌకర్యము లెట్టివి యేర్పరచడం, ఈ తూర్పు దేశాలలో సాధ్యమో తెలుపుటకై భారతప్రభుత్వము 1949 లో సభ జరిపింది. దానికి ఆంధ్రరైతాంగము తరపున శ్రీ వెంకటసుబ్బయ్యగారిని ప్రతినిధులుగా ప్రభుత్వము పిలిచింది. ఆ సమయాన వారు నా కోసం గిన తోడ్పాటు గమనార్హమైనది.

కంట్రోళ్ళవల్ల రైతాంగమునకు కలిగిన కష్టములు వారికి అనుభవైకవేద్యము. కనుకనే రైతుల ధాన్యాలకు సక్రమమగు ధరలు చెలించక తప్పదనే 15 సంవత్సరాల మా ఆందోళనకు యీ అన్యాయపు కంట్రోళ్ళ వ్యతిరేకోద్యమమును వెంకటసుబ్బయ్యగారే అదేక దీక్షతో నడిపిరి.

అసలాయన జమీందారీ రైతుకనుక "మాకొద్దీ జమీందారీ పొందు" అనే శ్రీ రామనాయుడు నా వుద్యమమందు 1931 నుండి వుత్సాహులై కృషి చేసిరి. దివితాలూకాలో ప్రతి గ్రామమందు రైతుసంఘములను 1933 36 సంవత్సరాలలోనే స్థాపించిరి.

తన స్వసంఘీయులైన చల్లపల్లి జమీందారు వ్యక్తిగతంగా బహు మంచివారైనను, జమీందారీ పాలనాన్నే యెదిరించు మా బోంట్లతో చేతులు గలిపి వెంకటసుబ్బయ్యగారు రైతుసేవ చేయుచుండిరి.

ఆ 1948_5 సంవత్సరాలలో దివితాలూకా యంతటా కమ్యూనిస్టుల దౌర్జన్యాలు తదితరప్రాంతాలకంటే హెచ్చుగా చెలరేగుచుండటమే గాక, జమీందారీ వ్యతిరేకోద్యమము "డాలు"గా వుపయోగించుకొంటూ, రాజ్యాంగాధికారాన్నే కమ్యూనిస్టులు చేపట్టుకొనజూచుచున్న రోజులవి ! అప్పుడే వెంకటసుబ్బయ్యగారు యిటు నిజమగు రైతు వుద్యమ వ్యవహారాలను బలపరుస్తూ, అటు సేవాదళాల నేర్పరుస్తూ, గ్రామరక్షణ దళాల నిర్మించుతూ, మన హనుమద్దప్పా

రావుగారలకు కుడిభుజంగా నిలబడిరి. ఇటులే కమ్యూనిస్టు వ్యతిరేకో ద్యమమును సాధించినకొందరు పెత్తందారులు గ్రామకక్షులవల్ల వారు -వీరిపై కేసులు పెట్టజూచిరట. వీరు మాత్రం ధర్మమార్గాన్నే నడచిరి. పరీక్షాసమయం వచ్చినప్పుడల్లా తదేకదీక్షతో తనకున్న పరిమితశక్తిని రైతు వుద్యమమునందే కేంద్రీకరిస్తూ వుండు ఈ దీక్షాపరుని సలహా పొందుచుండుట నాకు తృప్తి కనుకనే 1944వసంవత్సరమందు మహాత్ముని తో నేను రెండుదినాలపాటుసాగించిన చర్చలఫలితాల ననుసరించి ఆ డిశంబరులో రైతువుద్యమమును రాజకీయాలనుండి తొలగింపవలయు నని తీర్మానించవలసియుండెను. మహాత్ములు రైతుకూలీ ప్రజారాజ్యా న్నంగీకరించిరి. అప్పుడే వెంకటసుబ్బయ్యగారు మహాత్ముని సమ్ముఖ మున నిల్చిరి. మా అందరి ఆలోచనకు తన అనుభవాన్ని జోడించిరి. తత్ఫలితం చరిత్రాత్మకమగు మా ఒడంబడిక, అటులే కాంగ్రెస్ సంఘాల ఎన్నికలల్లో పెరుగుచున్న అవినీతి, పట్టాభి - కళాయుగపు ధర్మచ్యుతిబద్ధమగు రాజకీయ దౌర్భాగ్యజీవితమును జూచి రోసి, బైటకు పోదామన్నవారిలో ప్రథములు మన గొట్టిపాటి.

జనరల్ ఎన్నికలు జరిగిన పిమ్మట కమ్యూనిస్టుల బలగాల జూచి, వారి నియంతృత్వధోరణి నెదిరించుటకై కాంగ్రెస్‌ను తిరిగి బలపరచుదామన్న మమ్ముల హృదయపూర్వకంగా అనుసరించినదీ వారే !

వారి కార్యదీక్షకు, కార్యనిర్వాహకశక్తికి చల్లపల్లిలో 1952 లో 250 మంది విద్యార్థులతో జరిగిన రైతాంగ విద్యాలయమే సాక్షి.

ఇంతటి మాంధాత రైతు వుద్యమానికి దొరకుట భారత రైతాంగ అదృష్టం. వారు కుడిభుజం అని చెప్పుకోగలుచున్నందుకు మా దంపతులం అదృష్టవంతులం. ఆంధ్రులలో యింతటి కార్యదీక్షా పరులున్నందులకు గర్వపడుదాం !"

(జమీన్ రైతు 3_7_53)

1966-11-12 న సర్దార్ లచ్చన్నగారి అధ్యక్షత క్రింద వెంకటసుబ్బయ్యగారి సన్మానసభ ఒంగోలుతాలూకా మేదరమెట్లలో వైభవంగా జరిగింది. అందులో అనేకులు ఆయన సేవలను ప్రశంసించారు.

ఆచార్య రంగాగారు ఆయన రైతుభక్తిని, సేవను కొనియాడి ఆయనను "రైతు సర్దార్" బిరుదుతో సత్కరించారు.

బందరులో నేను థర్డుఫారంచదువుతుండగా ఈయన ఫస్టుఫారం చదువుతుండేవాడు. విద్యార్థిదశలో మాకు నాయకుడయిన కీ॥ శే॥ వెంకటేశ్వర్లుగారికి ఈయన పినతండ్రి కుమారుడే. ఆయన అజమాయిషీలోనే ఈ వెంకటసుబ్బయ్యకూడా బ్రహ్మమందిరంలో మాతో వుండేవాడు. మేము స్కూలుఫైనల్‌తో చదువు మానగా ఈయన థర్డుఫారంతో మానివేశాడు.

చదువు మానివేసిన తరువాత ఘంటసాలలో మేము కాంగ్రెస్ గోత్రికులుగా వుండి పరస్పరం సంప్రదింపులతో వ్యవహారం వ్యవహరించుకొనేవారం.

వయసులో నేను పెద్దవాడినైనా చురుకు చొరవలను పురస్కరించుకొని ప్రథమస్థానం గొట్టిపాటి బ్రహ్మయ్యగారిదే. ద్వితీయ స్థానం నాది. నాకంటే వయస్సులో చిన్న అయిన ఈ వెంకటసుబ్బయ్య, దోనేపూడి సీతారామయ్య, గొట్టిపాటి నరసింహం వరుసక్రమంలో వుండేవారు. గ్రామ రాజకీయాలలోనూ, కాంగ్రెస్ వ్యవహారంలోనూ మేమంతా సహచరులం. మా గ్రామంనుంచి 1920 లో కాళీ ఓటుపెట్టెలు పంపిన, ఏ కార్యం సాధించినా మా సమష్టి కృషిఫలితమే.

1929 లో మహాత్ముడు మా వూరు వచ్చినప్పుడు కాంగ్రెస్ స్వచ్ఛంద సైనికులకు ఈయన సేనాధిపతిగా వ్యవహరించారు. ప్రజాసమూహం అంతటినీ క్రమశిక్షణలో వుంచుట చూచి మహాత్ముడు "ఇది మీ జాతీయసేనా?" అని ప్రశంసించారు. నల్ల జెండాల కేసులో ఈయన్ని అరెస్టుచేసి వదిలిపెట్టారు.

1930 ఉప్పు సత్యాగ్రహానికి పూర్వం మా గ్రామంలో నరసింహ దేవర సత్యన్నారాయణగారి అధ్యక్షత క్రింద జరిగిన కృష్ణాజిల్లా సహకార సభకు ఈయన వాలంటీర్లకు కెప్టెన్‌గా వుండి ఎంతో సేవచేశారు.

1930 లో కారాగృహానికి నేనూ, ఆయనా కలసి వెళ్ళాం. ఈయన అంటాడు. "నాకు మీ పుస్తకాలు బాగున్నాయి అని అంటాడు నాతో. కాదు ఆ పుస్తకాలు వ్రాసేది మా అన్నగారు నేను కాదని వారికి చెపుతాను. నేనూ, అంటాను, "పేపర్లలో మీ స్టేట్‌మెంట్స్ చూస్తున్నామండీ అని కొందరంటూ వుంటే రైతులపని అంతా చూసేది మా తమ్ముడు కిసాన్ వెంకటసుబ్బయ్య అని అంటూ వుంటానని అంటాడు. ఇటూ పేరువూరూ వకటగుటచేత నన్నెరిగిన వారు కొంతమంది నేనే స్వతంత్రపార్టీలో పనిచేస్తున్నట్లు, వెంకటసుబ్బయ్య ఈ పుస్తకములు వ్రాస్తున్నట్లు అనుకోవటంలో ఆశ్చర్యం లేదు.

ఈయన భార్య శ్రీమతి సరస్వతమ్మ ఉదారస్వభావంగల మహిళ. మహాత్ముని ఖద్దరు సంచారంలో ఈమె తనమెడలోని బంగారపు గొలుసును గాజులను ఆయన కర్పించి ధన్యత గాంచెను.

1933_3_29 లో ఈమె నా సహచరిణి, మరికొందరు మహిళలతో కారాగృహాని కరిగింది.

ఈ వెంకటసుబ్బయ్యగారు జననం జూన్ 15,1903, 1924నుంచి మాతోపాటు వ్యవహరిస్తున్న రాజకీయ నాయకుడు. కొంతకాలం నుంచి ఆయన స్వతంత్రపార్టీలో వున్నప్పటికి పరస్పరం గౌరవమర్యాదలతో, ప్రేమభావంతో నన్ను సుబ్బయ్య అన్నయ్యా ! అని పిలుస్తూ వుండటం ఆనందకరమైన విషయం.

ఈయన భార్యకూడా నా భార్యను అక్కయ్యా అని సంబోధిస్తుంది. మా యిల్లు వారింటికి దగ్గర. మనసులు మరీ దగ్గర.

## శ్రీ దోనేపూడి సీతారామయ్య

స్నేహము - ప్రేమ మానవుణ్ణి ఉత్తమశీలునిగా చేస్తాయి. అతని హృదయంలోని కాఠిన్యాన్ని, కల్మషాన్ని కడిగేస్తాయి. త్యాగం, స్వార్థరాహిత్యం మొదలైన ఉదాత్త ప్రవృత్తులను కలిగిస్తాయి.

రాహుల్ సాంకృత్యాయన్.

"గాంధీయుగంలో మా గ్రామంలో నలుగురువ్యక్తులు విశిష్టత సంపాదించారు.

వరుసక్రమంలో వారు శ్రీ బ్రహ్మయ్య, వెంకటసుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, సీతారామయ్యగార్లు.

జగమెరిగిన బ్రాహ్మణుడు బ్రహ్మయ్యగారు. వారినిగూర్చి నేను చెప్పవలసింది లేదు. ఆయన కాంగ్రెస్ రాజకీయాలకు తనను అంకితం చేసుకొన్నాడు.

ఇక కవి వెంకటసుబ్బయ్య, కిసాన్ వెంకటసుబ్బయ్యగార్ల మాట ఎవరూ చెప్పకుండా వారిపేర్లే చెపుతున్నవి వారి విశేషాలు.

"సీతారామయ్యగారు తనను గ్రామసేవకు అంకితం చేసుకొన్నాడు.

## వేమూరి వెంకట్రామయ్య

పదవులు కొందరకు అలంకారమయితే కొందరు పదవులకే అలంకారం. సీతారామయ్యగారు ఉత్పత్తి కొనుగోలు సంఘానికి, పంచాయితీబోర్డుకు, విశాల సహకార పరపతిసంఘానికి, ఘంటసాల గ్రామ సంఘానికి, శ్రీ జలధీశ్వర దేవాలయ ట్రస్టీల సంఘానికి అధ్యక్షుడై పదవులకే అలంకారం తెచ్చెను.

ఆయన ఎట్టి ధవళవస్త్రధారుడో అట్టి పరిశుద్ధ వర్తనుడు, సౌమ్యుడు. దాతృత్వం కలవాడు, మితభాషి, స్ఫురద్రూపి. అందరిచే అతడు మంచివాడనిపించుకొన్నవాడు. ఈయన 1909 లో జన్మించాడు.

మా అందరిలో బ్రహ్మయ్యగారితో అధిక సంబంధం కలవాడు. అసలు సీతారామయ్యగారి తండ్రి వెంకట్రాయులుగారు, బ్రహ్మయ్యగారి తండ్రి వీరరాఘవయ్యగారు మిత్రులు. పూర్వము ధర్మాగోటకం కొరకు పోరాడిన ధర్మవీరులు. అందుచేత తన స్నేహితుని కుమారుడైన బ్రహ్మయ్యగారియందు ఆప్యాయత అధికం. తెలుగు ఇంగ్లీషు చదువుకొనటానికి సీతారామయ్యగారిని ఆయన వద్దకు పంపారు. ఆ చదువుకొన్నది కూడ చాలా తక్కువే. ఆయన శిష్యుడని అనుకోలేదు తన సహచరుడు, సోదరుడు ప్రేమపాత్రుడుగా భావించారు బ్రహ్మయ్యగారు.

1926 లో మద్రాసు శాసనసభకు స్వరాజ్యపార్టీ అభ్యర్థులుగా అయ్యదేవర కాళేశ్వరరావు, కొల్లిపర సూరయ్యగారు నిలబడ్డారు.

గొట్టిపాటి నరసన్నగారి కుమారుడు వెంకయ్యగారు, వెంకట్రాయులుగారు ఒకే పార్టీ, ఒకే మాట. అందువల్ల వెంకయ్యగారి ప్రోత్సాహంతో అడుసుమిల్లి గోపాలకృష్ణయ్యగారికి ఒక ఓటు ఇవ్వ నిశ్చయించుకొన్నారు. దోనేపూడివారిలో వెంకట్రాయులుగారు పెద్ద. వారిలో 19 ఓట్లు కలవు.

దోనేపూడి సీతారామయ్యగారు బ్రహ్మయ్యగారి యెడల ప్రేమాభిమానములే గాక కాంగ్రెస్‌యందు భక్తి అధికం. అందుచేత ఒక్క వెంకట్రాయులుగారి ఓటు మినహా తతిమ్మా ఓట్లన్నీ కాళేశ్వరరావు, సూరయ్యగార్లకే పడవి. ఆయన తన 17 వ ఏటనే పోలింగ్ స్టేషనులో తన తండ్రిగారి యెదురుగా నిల్చి, బహిరంగంగా కాన్వాస్ చేయటం అందరికి ఆశ్చర్యం కలుగజేసింది. ఆయనకు న్యాయమని

తోచింది అలా పోట్లాడటం, నాటినుండి నేటివరకు అలాగే ఆయన కలవాటు.

చిలకలపూడి, రుద్రవరం గ్రామాల్లో వీరికి భూము లున్నవి. అందులో చిలకలపూడంతా ఘంటసాల గ్రామస్తులదే. వెంకట్రామయ్యగారు ఈ రెండుగ్రామాల్లో మాగాణి చేయించాలని చాలా ప్రయత్నం చేశారు. తండ్రి సాధించలేని పని తనయుడు సాధించుట సంతోషకరము గదా! బ్రహ్మయ్యగారి మైత్రితో ఈపని నెరవేరినది "సీతారామయ్యగారి సహనానికి అంతనేది లేదు. ఎంతో ఓపికతో ఈ కార్యక్రమమంతా చేసేవాడు. పట్టుదలతో కార్యాలు సాధించటం అతని కర్తవ్యం. గ్రామంలో రోడ్లనిర్మాణం చేయటంలో, పంటకాలువల నిర్మాణంలో, హైస్కూలుకి ప్రభుత్వంనుండి గ్రాంటు ఇప్పించి భవన నిర్మాణానికి కావలసిన కార్యనిర్వహణ చేయటంలో నన్ను ఉత్సాహపరచుటయే గాక గ్రామంలోవుండి ఆ పని పాటలను శ్రద్ధాసక్తులతో నిర్వహిస్తూవుండేవాడు (నా జీవనసౌరభం 20) (గొట్టిపాటి బ్రహ్మయ్యగారు) పై సంగతులన్నీ ఆయన బాహ్య కార్యకలాపాలు. కాని ఆయన్ను అర్థం చేసుకొనేవా రెంతమంది? ఆయన పార్టీగతభావాలు లేక శత్రు మిత్ర భేదం లేక అందరికు సాయపడతాడు కోపం, ఈర్ష్య, స్వార్థం ఆయన్నంటవు

ఆయన ఒకరికి అనుచరుడు కాడు. మరొకరు ఆయనకు అనుచరుడుగా వుండాలని కోరడు.

ఆయన ప్రజాసేవ అదొక తాత్వికమైనది. గూడూరు రామచంద్రరావు శిష్యుడగు చిలకలపూడి భాస్కరరావుగారు ఇంటర్ చదువుతూ గాంధీ మూవ్మెంట్‌లో కళాశాలను బహిష్కరించారు.

వేదాంతి, బ్రహ్మచారి కూడాను. సీతారామయ్యగారిపై భాస్కరరావుగారి ప్రభావం అధికం.

ఆయన్ను కష్టాల్లోనూ, సుఖాల్లోనూ దగ్గరగా చూచాను.

ఆయన రెండింటిని సమానంగా భావించినట్లు క్షేమం, మోదం లేక వుంటాడు.

ఆయనకు 31 సంవత్సరాల ప్రాయంలో భార్యావియోగం కలిగినా, తండ్రీ, మిత్రులు ఎంత చెప్పినా వివాహము ఒకసారేనని అనేవాడు. 1930 లో ఉప్పు సత్యాగ్రహంలో మాతోపాటు జైలుకు వచ్చాడు. ఆ అన్నం చూడగానే ఆయనకు వాంతి వెళ్ళేది. బ్రహ్మయ్యగారు తరువాత నాకు మిత్రుడు. ఆయనతండ్రి నాతో అనేవాడు. సుబ్బయ్యా! బ్రహ్మయ్య, నీవుచెపితే మావాడు పెళ్ళిచేసుకొంటాడు. ఈమాట నేను ఆయనతో చెప్పగా పెళ్ళి చేసుకొని బాధపడేకంటే పెళ్ళి చేసుకోకుండానే బాధపడ తలచాను అన్నాడు.

పుత్రుడు లక్ష్మయ్య పోయిన తరువాత వివాహం చేస్కో వల్సిందని ఆయనతండ్రి వేధించాడు. ఆడపిల్లలు మాత్రం సంతానం కాదా అని ఆయన నిరాకరించాడు. ఆయనకు యిద్దరు కుమార్తెలు.

ఘంటసాలకు గుండేరు ఒక పెద్ద బాధాకరమైనది. దానికి వంతెన నిర్మాణవిషయంలో ఆయన పూనిన కార్యక్రమానికి నేనూ చేదోడుగా నిల్చాను. అది నేడు పూర్తగుట చాలా సంతోషం. ఇది ఆయన భల్లూకపు పట్టుకు ప్రబల నిదర్శనం. ఆయన పార్టీ కట్టక పోయినా సీతారామయ్యగారంటే ఘంటసాల్లోను, చిలకలపూడి, రుద్రవరం, కోసూరు మొ॥ చుట్టుప్రక్కల గ్రామాల్లో కూడ ఆయనంటే ఎంతో అభిమానం. ఆయనను స్వార్థమెరుగని వ్యక్తిగా భావిస్తారు. ఆయన అజాతశత్రువు. ఆయన యిదివరకు అప్పుడప్పుడు ఏ ఆధ్యాత్మిక పురుషునిదగ్గరకో, తిరుపతికో తరచు వెళుతూ వుండే వాడు ఇప్పుడు అవీ తగ్గినవి.

ఆయన తనపొలము వెళ్ళి ఎంతకాలమైందో. ప్రజాసేవతత్పరతే ఆయన ప్రధాన కార్యం.

ఆయన భార్య బాలమ్మ తన ముత్తవతల్లి పిచ్చమ్మగారివలె స్వచ్ఛముగా మాట్లాడేది. ఆమె పికెటింగు చేసింది. మంచి ఆర్ద్రత గల వ్యక్తి. ఆమె పోవటం విచారకరం.

ఆయన లౌకికం తెలియని అలౌకిక పురుషుడు. జపతపములు లేని వేదాంతి. సర్వోదయ సంస్థలో మెంబరు కాని సర్వోదయ మూర్తి. ఆయన దీక్షాదక్షత, ఆత్మశుద్ధి, లక్ష్యశుద్ధిగల నిరాడంబరుడు.

## శ్రీ ముమ్మన్నేని లక్ష్మీనారాయణ

సత్యాగ్రహ సమరం ఉధృతంగా జరుగుతున్న రోజుల్లో చాలా మంది కారాగృహానికి వచ్చారు, మహాత్ముని పిలుపు అందుకొని. జైలు శ్రీ కృష్ణజన్మస్థానమని ప్రసిద్ధిగాంచింది. జైళ్ళలో రాజమండ్రి సెంట్రలు జైలు పనిష్మెంటు జైలని ప్రతీతి. కృష్ణా, గుంటూరు, ఉభయగోదావరి, మలబారు, బొంబాయినుండి కూడ నేనున్న సమయాన వచ్చారు. సత్యాగ్రహులలో చాలామంది గీతాపారాయణము, హిందీ భాషాభ్యాసము చేస్తూవుండేవారు.

ఈ లక్ష్మీనారాయణ ఆ నాడు నవయువకుడు. 1930 లో మేము కారాగృహంలో ఉన్నపుడు అంతా కలిసిమెలిసి వుండేవారము. ఈయన నా వద్ద హిందీ నేర్చుకొని, అనంతరము— పంజాబులో హిందీ భాషలో ఉత్తీర్ణుడై, గుంటూరుజిల్లాబోర్డులో హిందీ టీచరుగా వుండి ఇప్పుడు రిటైరై ఖమ్మంజిల్లాలో వ్యవసాయం చేసుకుంటున్నాడు.

ఈయనది అమృతలూరు. అమృతలూరులోని సంస్కృత పాఠశాలలో అధ్యయనం చేశాడు. అటుతర్వాత "కోటయార్య వైదిక సాహిత్య గ్రంథమాల" స్థాపించి. ఈతి, కేశ, కథ మొదలగు ఉప

నిషత్తులకు వ్యాఖ్యానాలతో ప్రచురించాడు. ఆత్మసిద్ధి, అంతేవాసులతో హాంపీ విహారయాత్ర మొదలగు గ్రంథాలను రచించారు. ఈయన ఆర్యసమాజకుడు.

కవిరాజు చరిత్ర రచనలోను, లాలా లజపతిరాయ్ రచనలోను కొంత భోగట్టా ఇచ్చి నాకు తోడ్పడ్డారు.

ఈయన భార్యపేరు త్రివేణి, నరేంద్ర, కిశోర బాబులు ఈయన కుమారులు ప్రతిభ ఈయన కుమార్తె. ఈయన ప్రథమ కుమారుని వివాహం నా చేత 1966 న చేయించాడు నా శిష్యుడు.

శ్రీ నాగలింగం వెంకటేశ్వర్లు, మైనేని చినవెంకటప్పయ్యగార్లు ఈయన భాషా గురువులు. రాపర్ల సూర్యనారాయణ, కుడితిపూడి వెంకట్రామయ్య, పరుచూరి వెంకటసుబ్బయ్య, కలపాల రాజయ్య గార్లు ఈయన సహాధ్యాయులు - మిత్రులు.

31-8-55

ఆర్యా! నమస్తే!

కుశలమా? మీరు వ్రాసిన కవరు చేరింది. మీ వన్నీ పరిణతి చెందిన భావాలు, వ్రాతప్రతి మీకు చూపివుంటే నా పుస్తకం చాలా బాగుండేది. ఎక్స్‌కర్షన్ ముగించుకొని వచ్చినతోడనే ప్రారంభించి పదిరోజుల్లో ముగించాను. ప్రెస్సులో మాత్రం నాలుగు మూడునెలలుంది. స్త్రీల విషయంలో మీరు వ్రాసిన భావం చాలా ఉదాత్తంగా వుంది. అట్టి భావాలే రచయితకు గౌరవాన్నిస్తాయి—నా పొరపాటిప్పుడు బాగా గమనించాను. "శరత్ జీవితం" చదివాను. ఆ పోకడ నాకు రాదు. తక్కువశబ్దాలు ప్రయోగించి ఎక్కువ భావాన్ని వెల్లడి చేయగల ప్రతిభ మీ కలంకు వుంది ప్రస్తుతం "కల్లూరి చంద్రమౌళి" జీవితం వ్రాద్దామనుకొంటున్నాను. అందుకని శరత్ జీవితం

నాలుగుపర్యాయాలు చదివాను. ఒక పర్యాయం మీతో కలిసి ప్లాటు ఏర్పాటు చేసికొని మీ సలహా పూర్తిగా పొందిన పిదప గాని పుస్తకం మొదలుపెట్టను. మీ రాకను తెలపండి

లక్ష్మినారాయణ.
ఉల్లిపాలెం
10-7-62

పెద్దలకు—నమస్కారాలు !

మీరు వ్రాసే ప్రతిఉత్తరం నేను చదువుతుంటాను, మీ దస్తూరి బాగా చదవకలిగిన వారిలో నేనొకదాన్ని. మీ పుస్తకాలు నేను తరచుగా చదువుతుంటాను. మీరు వ్రాసేభాష అతి సామాన్యులకు కూడా అందుబాటులో వుంటుంది. మీ గ్రంథాల్లో 'వేదన' అనేది నా హృదయాన్ని నీరు చేసింది అందులో ప్రత్యక్షరంలోనూ కరుణారసం ఉబికివస్తుంది. కర్కశ పాషాణహృదయాలు సహితం అందులోని కరుణారసవాహినీ సంఘటనను అరిగి కరిగి పోక మానవు. 'రైతుపెద్ద', దేశోద్ధారకుని జీవితచరిత్రలు ఇంకా చదువలేదు. 'మధురజీవనం' ఆమూలాగ్రం చదివాను. అందులో మీరు ఉదహరించిన సంస్కృత శ్లోకాలు మాత్రం నా కర్థం కాలేదు.

మీరు వ్రాసే వుత్తరాల్ని భద్రపరచి అప్పుడప్పుడు చదువుతుంటాను. మా కుటుంబంయెడ మీరు చూపే స్నేహవాత్సల్యాలకు నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ఇట్లు.
త్రివేణి.
పల్లెకోన
20-12-66

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున శ్రీ పండిత గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారికి జరుగుచున్న సన్మానసభాహ్వాన మందినది,

హృదయ మానందంతో పొంగిపోయింది. అదేరోజున మా పల్లెలోన హైస్కూలు నూతన గృహప్రవేశ మహోత్సవం జరుగుతుంది. శరీరాన్నిక్కడుంచి మనస్సును సన్మానసభకు పరుగెత్తిస్తున్నా.

శ్రీ పండిత గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారు నాకు జాతీయ భాషా గురువులు. ఉప్పుసత్యాగ్రహ సమరయోధులంగా రాజమండ్రి కారాగారంలో కలసిమెలసి కాలక్షేపం చేసేం. వారప్పటికే ఇంగ్లీషు, హిందీ, బెంగాలి, తెలుగుభాషల్లో ఆరితేరినవారు. సంస్కృతభాషా పరిచయంకూడా వారికి లేకపోలేదు. పండిత వెంకటసుబ్బయ్యగారు మంచి ప్రతిభావంతులు. ప్రతిభకు కార్యదీక్షను తోడుచేసిన కర్మ ప్రవణులు. వారికి శారీరికబలంకంటే, ఆత్మబలం హెచ్చు. అలాగే వారి గ్రంథాల్లోకూడా భాషాబలంకంటే భావనాబలమే హెచ్చుగా కన్పిస్తుంది. వారేది వ్రాయ తలపెట్టినా దాన్ని కూలంకషంగా పరిశోధించి వ్రాస్తారు. అది పాఠకుని హృదయంలో గ్రుచ్చుకుపోయి దాగొంటుంది ఆషామాషీ వ్రాతలంటే వారి కసలు గిట్టవు. జీవిత చరిత్రలు వ్రాయటంలో వారిది అందెవేసిన చేయి.

వారి హృదయంలో కరుణ, హాస్యం రెండు సమపాళ్ళలో వుంటాయి. వాటిని రెంటిని వారి రచనల్లోకూడా పాఠకులు చూడ గలుగుతారు.

పండిత వెంకటసుబ్బయ్యగారు బృహద్గ్రంథ రచయితలు. అట్టి గ్రంథాలు చదివే ఓపిక, అలవాటులేని ఈ రోజుల్లోకూడ వారి పుస్తకం పుచ్చుకొంటే అది సాంతమయ్యేదాక విడువ బుద్ధిపుట్టదు. అంతేకాదు ఆహారంకూడా రుచించదు. అట్టి రసాత్మకమైన రచనాశక్తి అభ్యాస మూలకంగా వచ్చింది కాదు వారికి. అది వారిలో మొదటినుండీ ఉండి అట్టి పండిత గొట్టిపాటి వెంకటసుబ్బయ్యగారిని సన్మానిస్తున్న

ప్రభుత్వాన్నభినందించుట ప్రతి రచయితకు కర్తవ్యము కాగలదు. సన్మానితులకు నా హృదయపూర్వక నమోవాకములు.

ఇట్లు,

ముమ్మనేన్ని లక్ష్మీనారాయణ.

పల్లెకోన,

7-4-68

పూజ్యశ్రీ వెంకటసుబ్బయ్యగారికి,

నమస్తే !

ఈ మధ్య మీరు వ్రాసిన "లాలాజీ" జీవిత చరిత్ర సమీక్ష చదివాను. చాలా బాగుందన్నాడు. ఆ సమీక్షకునికే గాదు చాలామంది రచయితలకే అది బాగా నచ్చివుంటుంది. మీ శైలి, సహజం మొదలుపెట్టితే విడువబుద్ధి పుట్టదు. విసుపు పుట్టదు. ఈ మధ్య రెండు మూడు బాగా చదివి అలా వ్రాద్దామని ప్రయత్నించి లాభం లేక విడిచివేసాను. అది విప్లవవీరుల చరిత్ర. మరల దాన్ని నా శక్తిలోనే ప్రారంభించాను.

సెలవు, నమస్తే,

ఇట్లు,

లక్ష్మీనారాయణ.

## శ్రీ తుమ్మల సీతారామమూర్తి

"సాధారణ వ్యక్తులను మహనీయులుగా, త్యాగమూర్తులుగా తీర్చిదిద్దగలశక్తి గాంధీజీలో వుంది." —గోఖలే.

ఈయన జగమెరిగిన బ్రాహ్మణుడు. ఈయనలో ఆంధ్రాభి

మానం కన్నా ధర్మాభిమానమే ఎక్కువ. ముమ్మూర్తులా ధర్మమూర్తి మన సీతారామమూర్తి.

ధర్మావేశమో, నైతికావేశమో లేనిది ఆయన కలము పట్టడు. ఉత్తమ కావ్యప్రయోజనమగు ధర్మబోధ ఈయన రచనలన్నిటా రాణించినది. ఈయన కృతులు నీతికి నెలవులు, కవితారీతికి గనులు.

తేట తెలుగంటే ఈయనకు పంచప్రాణం. కేవలం కవి మాత్రమే కాదు, వ్యాకరణ పారంగతుడుకూడా. ఆంధ్రభాషా తత్వ నిరూపణమందు దక్షుడు. పండితుడే కాదు. ఆంధ్రజాతీయ చరిత్రా పరిశోధనలలో గొప్పవాడనడానికి "రాష్ట్రగాన"మే తార్కాణం.

"రాష్ట్రగానము"వల్ల ఈయనకు గౌరవమబ్బింది.

"ఆంధ్రప్రజ ఆలోచనల, ఆరాటముల, ఆశయముల అవగాహన మొనర్చికొన్న పెద్ద. 'అభినవతిక్కన' రాసిన 'రాష్ట్రగానము' నెవరు చదివి ఆనందించలేదు? కనుకనే గదా 20,000 కళాభిమానులు జనవరి 28 వ తేదీన (1949) నిడుబ్రోలులో కనకాభిషేకము చేసిరి.

ఆచార్య రంగా ('మాతృభూమి' 3-4-49)

'బాపూజీ ఆత్మకథ'ను 'తుమ్మల' పద్యకావ్యముగా రచించెను. ఈ కృతికి సి. ఆర్. రెడ్డిగారు తిలకరచన చేశారు. రెడ్డిగారన్నట్లు "తిక్కనతో సజాతీయుడైనవాడు మన చౌదరి. అనగా సరిసమానుడనిన యతిశయోక్తికి బలికి యపాయములేదు. ఆ వర్గమున నగ్రాసనము లేకున్నను, ఆసనత్వము గలవాడు. దేశప్రేమమనే మహనీయ కార్యదీక్షకు పురికొల్పు గ్రంథములలో నీ యాత్మకథకు మించినది ఈ దేశమున, ఈ కాలమున మరియొండులేదు....తుమ్మల సీతారామమూర్తి మహాత్ముని ఆస్థానకవి. ఈ స్థానము శాశ్వతము." అటు తర్వాత 'మహాత్మకథ'నుకూడ రచించి ధన్యుడాయెను.

"నేలవిడిచి సాముగఆపిన యట్లుండు
సంఘగతికి దవ్వు సాగి వ్రాత

యుక్తి చణతకాదు - యుగలక్షణము గుబా
ళింపవలయు గావ్యలేఖనమున"—

తుమ్మలవారి ధ్యేయమిదే.

గాంధీయుగంలో జన్మించడం అదృష్టంగా భావిస్తున్నారు చాలామంది. శ్రీ సీతారామమూర్తి గాంధీయుగమున ఉండడమే గాక, ఆయన సాగించిన సత్యాగ్రహసమరంలో పాల్గొని ఆయన చరిత్రను రచించిన మహాభాగుడు కూడా. ఆయన ఎంతటి అదృష్టవంతుడు ! ఆ సంగతే కవి ఇలా అంటున్నాడు.

"గాంధియుగమునఁ బుట్టితి, గాంధి నడుపు
నుద్యమంబుల నలఁగితి నోపినంత
గాంధి నీక్షించితిని, గాంధి కవిత వ్రాయఁ
గంటి నీ జన్మమునకు నీ పంట చాలు."

ఆయన తనను గురించి సంగ్రహంగా, సమగ్రంగా చెప్పుకున్నా డీ పద్యమున.

"రాష్ట్రసిద్ధికొరకు రక్తమ్ము కార్చిన
కవిని నేను గాంధి కవిని నేను
బడలి బడలి తల్లి బాస కూడిగము సేయు
కవిని నేను దేశికవిని నేను."

ఇంతకంటె కావలసిన దేమున్నది? ధన్యుడవు నీవు సీతారామమూర్తి! ఆయన కృతులు_ఆత్మార్పణము, రాష్ట్రగానము (1938), ధర్మజ్యోతి (1940), పతితగపంట (1942), ఆత్మకథ ('50), ఉదయగానము ('54), శబల ('55), గీతాబోధ (57), సర్వోదయగానము ('60), తెనుగునీతి ('50), నేను ('62), పైరుపంట ('66). సమదర్శి (67), మహాత్మకథ ('68).

మహాత్మకథకు కేంద్ర సాహిత్య అకాడమీ అయిదువేలు బహూకరించి సర్రైనపని చేసింది.

2_12_1901 జననం. జన్మస్థలం గుంటూరుజిల్లాలోని కావూరు. 1920 నుండి 30 వరకు కాంగ్రెసుసేవ. 1930 లో ఉభయభాషా ప్రవీణ. '30_'57 వరకు జిల్లాబోర్డులో తెలుగుపండితుడు.

అభిమాన విషయాలు – గ్రామజీవనం, గాంధీతత్వం, సర్వోదయం, ఆంధ్రాభ్యుదయం, తిక్కన కవితామార్గం, చిన్నయసూరి సిద్ధాంతం.

నిడుబ్రోలులో గజారోహణము, గండపెండేరము, కనకాభిషేకము, సువర్ణ కంకణము.

బిరుదులు—అభినవతిక్కన, కళాప్రపూర్ణ. ఆంధ్రప్రదేశ్ అకాడమీ విశిష్ట సభ్యత్వం కలిగించింది.

వీరి నివాసం – అప్పికట్ల, గుంటూరుజిల్లా.

1936 లో బెజవాడలోని గ్రంథాలయ ప్రెస్సులో 'ఆత్మకథ' ప్రథమభాగం ఆయన అచ్చు వేయించేటప్పుడు, నేను నా 'గీతా భూమిక'ను అచ్చుకివ్వడంవలన మా పరిచయం మొదలై, మైత్రిగా మారింది.

నా 'భట్టుమూర్తి రామరాజ భూషణుడా ?', 'సరోజినిదేవి' గ్రంథాలపై అభిప్రాయాలు రాశాడాయన.

ఆయన గ్రంథాలన్నిటిని నాకు బహూకరించాడు. ఆయనను గురించిన సన్మాన సంచిక (నిడుబ్రోలు)లో 'ఆదర్శకవి' అని, ఆంధ్ర నలంద సన్మాన సంచికలో 'సువర్ణాభిషేకం' అనే శీర్షికలతో రాశాను. 'ఆత్మకథ'గురించి 7_9_'51 న 'జమీన్ రైతు'లో పరామర్శించాను. 1966 డిశంబరులో 'మహాత్మకథ'కు కొంత భోగట్టా పంపాను.

మునిమాణిక్యం నరసింహారావుగారికి, నాకు మా గ్రామంలో జరిగిన సన్మాన సభకు వచ్చి నన్నుగురించి నాలుగుముక్కలు చెప్పి, ఆశీర్వదించారు.

నేను రాసుకునే గదిచూచి "ఇటువంటి గది గనుక నాకుంటే ఇంకా బాగా రాసేవాడి" నన్నాడు.

"బ్రహ్మయ్యగారు, మీరు కలిసివుండడం మీకు, నాకు, దేశానికి మంచిద"ని మంచిమాట పలికారు.
ఆయన సందేశం యిది :

కం. మన కాంధ్రత్వము ప్రాణము,
తనువు సుమీ భారతీయధర్మము, యావ
న్మనుజాభ్యుదయ ప్రవీణత
యనుజా, విను, వజ్రకవచమై దిట వొసఁగున్.

అప్పికట్ల,
1_10_56.

మాన్యమిత్రులు, శ్రీ గొట్టిపాటి వేంకటసుబ్బయ్యగారికి, మహాశయా వందనములు. మీరు 27_9_56 'వాహిని'లో నన్ను గూర్చి వ్రాసిన వ్యాసమును ఇపుడే ఒక మిత్రుఁడు చూపగా చదివి, పులకించితిని. అందలి ప్రత్యక్షరమును మధురమై నన్నలరించినది. ఇప్పట్ల మీ హృదయౌదార్యత ఎంతో మెచ్చదగియున్నది. కృతజ్ఞుడను.

ఆంధ్రప్రదేశావతరణ సందర్భమున నన్ను గౌరవించుట యుచితమని వ్రాసితిరి. ప్రజలా ? ప్రభుత్వమువారా ?

ఆరోగ్యము చక్కఁబడ్డ నేను మీ యూరు వత్తును. మీరు నాకు పరమాప్తులు.

అప్పికట్ల,
16_1_57.

మాన్యశ్రీ

గొట్టిపాటి వేంకటసుబ్బయ్యగారికి,
సుహృన్మణీ! వందనములు.

నా సన్మాన సభకు విచ్చేసి నాకై అంత వ్యాసమును అంత రమణీయముగా రచించి, పఠించి, సన్మానించిన మీకు నా కృతజ్ఞతా పూర్వక ధన్యవాదములు సమర్పించుకొనుచున్నాడను. చిత్తగింపుడు.

భవదీయుడు,
సీతారామమూర్తి.

అప్పికట్ల,
12_4_57.

సుహృన్మణీ! వందనములు.

మీరు 15_3_64 వ్రాసిన లేఖలు చేరినవి. మీ ప్రశంసలందు కొన్న మేము ధన్యులము. మీ ప్రశంసలకుతగిన సుగుణసంపదను మాకు భగవాను డొసంగు గాక! నా భార్య మీ లేఖలు చూచి ముగురాలై నది. వినీతయైనది. మీ సౌజన్యమును మెచ్చుకొన్నది. మీకు నమ స్కారములు అందించుచున్నది.

మీ
సీతారామమూర్తి.

0_11_58

సుహృన్మణీ! వందనములు.

మీ 6_11 లేఖ చేరినది. నిజమే! నేను వారికేల? కానిందు మీరన్నట్లు ఓపిక పట్టుటే లెస్స. నేను ఒక్కొక్కప్పుడు దారితప్పి జాఱుచుందును. మీ వంటి మిత్రుల హితోక్తులు నన్న పుడు కాపాడును. నాకున్న సంపదయే యిది.

శ్రీ రంగా జయంతి సంచికలో మీ వ్యాసము చదివితిని. అది రంగా కొఱకా? నా కొరకా! కృతజ్ఞుడను.

మీ
తుమ్మల సీతారామమూర్తి.

అప్పికట్ల,
12-11-60.

మాన్యమిత్రులు వెంకటసుబ్బయ్యగారికి,
వందనములు.

సుహృన్మణీ! మీ రాదరముతో పంపిన ధన్యజీవులు, శారదార్చన-యిపుడే అందినవి. వెంటవెంటనే చదివితిని. అహా ! రమణీయమైన సృష్టి. ఈ కళాఖండముల సంపాదించి ప్రచురించిన మీరు ధన్యులు. (శ్రీ) రంగాగారికి మీరు నిజమైన సన్మానము చేసితిరి.

ఈ కృతులలో మీరు, (శ్రీ) రంగాగారు నా కొసంగిన పెద్దరికము చూచి విని ముడనైతిని. మీ వంటి ప్రజలు నన్ను ఎన్నడో గురించి గౌరవించితిరి గౌరవించుచున్నారు. గౌరవింపగలరు.

ఇట్లు,
మీ సీతారామమూర్తి.

## కవిపాదుషా పువ్వాడ శేషగిరిరావు

పువ్వాడవారు మొవ్వలో పుట్టి పెరిగినా, బందరులో స్థిర నివాస మేర్పరచుకున్నారు.

కవిత్వాన్ని ఒక ఉద్యమంగా సాగించిన చెళ్ళపిళ్ళ వేంకట శాస్త్రిగారు బందరులో కుదురుకొని, సాహిత్య సరస్వతికి నీరాజన లెత్తుచున్న రోజులలోనే పువ్వాడవారు ప్రవేశించారు.

ఆవేశమో, ఆవేదనో వచ్చినపుడే కవితలల్లి "సౌందరనందం" కావ్యముచేతనే ప్రసిద్ధులైన 'పింగళి', 'కాటూరి' వారిలో, పింగళి వారికి ప్రియశిష్యులైనారు.

శేషగిరిరావుగారు గద్యం, పద్యం, గేయం మూడింటను ప్రసిద్ధులయారు.

కరుణరసాన్ని, వీరరసాన్ని పోషించటంలో సవ్యసాచిగా ప్రసిద్ధి చెందారు.

మార్గ కవితలోను, దేశి కవితలోను ప్రఖ్యాతి గాంచారు.

పలుకులు మెత్తనివయినా పలుకుబడి మాత్రము మనోహరమైనది.

రచన లన్నిట శిల్పం తొణికిసలాడింది. ఆయన కావ్యగానం చేస్తూంటే, కవి, గాయకుడు, నటుడు కలసి త్రివేణీసంగమంగా తోస్తుంది.

క్షేత్రయ్య పదాలు అభినయానికి పుట్టినవికదా! అలాగే ఆ క్షేత్రమహత్యం ఈయనలో జాలువారింది.

సభారంజకుడు మా పువ్వాడ బావగారు తిరుపతివెళ్ళి వేంకన్నను స్తోత్రం చేస్తూంటే ఆ ప్రాంగణంలోవున్న వారందరూ పారవశ్యం చెందిన సంగతి ఎందరు ఎరుగుదురూ !

"బావగారు ! మీ బాణీని ఇన్సూర్ చేసుకో"మని చెపితే వినరుగదా !

బావగారి రచనలలో భావశబలత, భావోద్రేకం పోటీపడటమే గాక, ఛందస్సును మించిన భావబంధురత గోచరిస్తాయి. 1958 లో రిపబ్లిక్ దినోత్సవంలో ప్రెసిడెంట్ రాజేంద్రప్రసాద్‌గారి అధ్యక్షతను జరిగిన అఖిలభారత కవి సమ్మేళనమునకు ఆంధ్రకవిగా ఆహ్వానింపబడి సన్మానితులైనారు.

వీరు కావ్యాలు, నవలలు, నాటకాలు వ్రాశారు. అనేక విమర్శనా వ్యాసాలు వ్రాశారు. "శతపత్రం", "గోవత్సము", "పాలవెల్లి", "తాజ్ మహల్", "షాజహాన్" మొదలగునవి కావ్యాలు.

"ఏరువాక", "ఛౌరా", "ఎవరు", "ఆంధ్రతేజం", "పరశు రాముడు" మొదలగునవి గద్యకావ్యాలు.

"దుర్గాదాసు", "ఢిల్లీ దర్బారు", "పృథ్వీపుత్రి", "ప్రతాప రుద్రమదేవి", "ప్రాణ రక్షణ", "శిల్పకావ్యం" మొదలగునవి నాటికలు.

వీరి కావ్యాలను కొన్నిటిని ఆంధ్ర, మద్రాసు, ఉత్కళ విశ్వ విద్యాలయాల్లో పాఠ్యగ్రంథాలుగా పేర్కొన్నారు.

1930 లో హిందూ కాలేజీలో తెలుగుపండితులుగా చేరి, జాతీయ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు.

వీరికి శిష్య ప్రశిష్యులు అనేకులు.

ఉత్తమ ఉపాధ్యాయుడుగా, మహోపన్యాసకుడుగా, ప్రసిద్ధ కవిగా ప్రఖ్యాతిగాంచిన పువ్వాడ వారికి బందరులో షష్టిపూర్తిఉత్సవం వైభవంగా జరగనున్నది.

1936 లో శేషగిరిరావుగారు, వీరితో జంటగా కవిత చెప్పిన చోడవరపు జానకిరామయ్యగారు ప్రభృతులతో గ్రంధాలయోద్య మంలో కలసి ప్రసంగించుటద్వారా పరిచయ మేర్పడింది. నాటినుండి నేటివరకు సాగుతున్నది మా మైత్రి. వీరిని బావగా రంటాను. మా సోదరి అనసూయా దేవి నామము సార్థకం. ఆమె భక్తురాలు.నిత్యము పూజలు.

వీరికి నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కుమారు లంతా ప్రయోజకులు. కుమార్తెలు వివాహితులై సుఖముగా కాపు రాలు చేస్తున్నారు.

బావగారు తమ రచనలన్నీ నాకు బహూకరించారు. నా రచన లన్నీ వారింట వున్నాయి.

ప్రధమంగా రావుగారు నా 'గీతాభూమిక'కు మెరుగు లు దిద్దారు. అనంతరం 'అక్షరాభిషేకా'నికి పరిచయ వాక్యాలు వ్రాసి పసందు తెచ్చారు, నేను వారికి నా వ్రాతప్రతులు చూపించాను. వారు ఘంటసాల రెండు, మూడుసార్లు వచ్చారు. నేను అనేకమార్లు వారి ఆతిథ్యాన్ని స్వీకరించాను. వారి మొవ్వ, మా ఘంటసాల ప్రఖ్యాతి గాంచినవి. ఆ గ్రామా లెంత దగ్గరో మా హృదయాలు అంతకంటే సన్నిహితం. వారి ఉత్తరాలు చూస్తే తెలుస్తుంది.

బందరు

1-11-54

శ్రీ గొట్టిపాటి బావగారికి - నమస్కారోభయ కుశలోపరి

ఆర్యా !

పరమ శత్రువునకైన నాతో యిప్పుడు పోలికవద్దు. ప్రాణ మిత్రులైన మీకు అసలే వద్దు. ఉంటే కొన్ని విషయాల్లో వుండ నీయండి. అవి జన్మతః వచ్చినవి. వడ్డీలెఖ్ఖలు నాకు రావు. మీకు రావనుకొంటాను. వస్తే మన మిలా వుండముగదా!

ఇదివరకల్లా లక్షలసరుకు వందలకు అలవ సులవులుగా అమ్మే శాను. ఇప్పుడు వేలయినా రాబట్టుకోనేపని చేద్దామని ఒక నవల స్కూలుఫైనలు కెట్టుబుక్కుకు ఉద్దేశించి భాగస్వామ్యపు ఏర్పా టులతో వ్రాసి యిచ్చాను. అది ఫలిస్తే లక్షాధికారిని కాను గాని ఋణవిముక్తుడ ననిపించుకొంటాను. అలా జరిగితే ఇందుకోసం మళ్ళా జన్మ ఎత్తనక్కరలేదు. జరగదో—ఈ ఉన్న స్థితికి లోపం లేదు. గీతాభూమికా కర్తలకు నేను వ్రాయాలా? పురుషకారమే మనది. దైవం చేతిలో ఫలం పెట్టుకొన్నాడు. కేవలం ఏకరాష్ట్ర ప్రభుత్వమైతే తాను తిట్లు పడాల్సి వస్తుందని "మీ మీ కర్మలు" పొమ్మన్నాడు. అది నిజమే అనిపిస్తుంది. లేకపోతే గొట్టిపాటివా రలా వుండటమేమి? వారి గుండెకాయ గొట్టిపాటివా రిలా వుండటమేమి ? వీరి నిరుపురిని ఆదర్శప్రాయులుగా ఎంచే పువ్వాడవా రిలా వుండట

మేమి ? నిజానికి నేను తక్కువ వాడినని ఎందుకు అనుకోవాలి ? కవులలో నేనే అదృష్టవంతుణ్ణేమో !

పువ్వాడ శేషగిరిరావు.

భాస్కరపురము,

బందరు, 23-1-64

గొత్తిపాటి బావగారికి - ఉభయకుశలోపరి.

మీ కార్డు అందినది. ఏమి విరుద్ధప్రకృతి బావగారిది! 1) సంబుద్ధి, 'బావగారూ!' అని - కర్తవ్యం 'ఆనందిద్దాము' అని. ఆ ఆనందమునకు సమాన భాగస్వాములైన బావమఱదులలో ఎవరు ఎవరికి దారిబత్తెము యియ్యాలో తెలియదు. అథవా, ఏ ఒకరో ఇంకొకరికీయ తలచుకొంటే, దారిబత్తెము లేమూల? 2) ఇది ఇలా వుండగా, ఆభిజాత్యము? కమ్మబిడ్డది. అన్నమాట? వైశ్యునిది. ('ఆ! మీ రెందుకు స్వీకరిస్తారులెండి బావగారూ!' అని.) చెప్పకోవటమో, 'విప్రాత్ పశ్చిమ బుద్ధయః' అని—ఇదికూడ విరుద్ధప్రకృతియే అని పిస్తుంది. నిజానికి మన యిరువురదీ ఒకే కవికులమాయె! అద్వైతులకు ద్వైత మెందుకు చెప్పండి. లేనిపోని భేదభావాలు పెట్టుకొని, ఆ శంకలు లేవదీసికొని 'మెచ్చుకొన్నా' నంటూ బాధపడకండి ఇక పైన. మనమైత్రికి ముప్ఫయియేండ్లు వయస్సు. అల్పావశేష మిలాగే గడిస్తే ఇంకా మన కేం కావాలీ? శ్రీ గొట్టిపాటివారికి నా అభినందనము లందించండి. 'రటయో రభేదః' అని 'గొత్తిపాటి' 'గొట్టిపాటి'లు నాకు సమానులుగదా! అందరము కుశలము.

పువ్వాడ శేషగిరిరావు.

## శ్రీ కాకాని నరసింహారావు

నరసింహారావుగారిని ఆంధ్రలోకంలో ఎరుగనివా రుండరు. మధురకవిగా ప్రసిద్ధులు. ఈయన ఆచార్య పింగళి లక్ష్మీకాంతంగారి

శిష్యులు. "బాలప్రబోధము, శ్రీహరి, భక్తసంరక్షక, సరస్వతీ సామ్రాజ్యం, సువర్ణమాల సాధన, గీతామృత సారం" మున్నగు రచనలు చేశారు.

సరళశైలిని మృదుమధుర కవితను అనర్గళధారను రచించి మధురాతి మధురంగ కవితాగాన మొనర్చి శ్రోతలను మంత్రముగ్ధులను చేయు లబ్ధప్రతిష్టుడు. ఆంధ్రరాష్ట్రంలో అన్ని కళాశాలలు, ఉన్నత పాఠశాలలు ఆయనను పిలిచి గౌరవించారు.

శ్రీ జగద్గురువులు శృంగేరి పీఠాధిపతుల చేతను, కంచి కామకోటి పీఠాధిపతుల చేతను, గాయత్రీ పీఠాధిపతుల చేతను, పుష్పగిరి పీఠాధిపతుల చేతను, దివ్యజ్ఞాన సమాధ్యక్షుల చేతను, స్వామి చిన్మయానందగారి చేతను ప్రశంసింపబడెను. కాశ్మీరు శాలువలతో గౌరవింపబడెను. అనేక దేవస్థానముల చే సన్మానింపబడెను.

భగవాన్ సత్యసాయిబాబావారి దర్శన, స్పర్శ, ఆలింగన, సన్మానభాగ్య మందుకొనగల్గెను.

కమలీబాబావారిచే గౌరవింపబడెను.

ఈయన రెవెన్యూ శాఖలో ఉద్యోగముచేసి పదవీ విరమణ పొంది ప్రస్తుతము గుడివాడ సత్యనారాయణపురంలో యుంటున్నారు.

రావుగారు నూనూగు మీసాల నూతన యౌవ్వనము నుండి ఎరుగుదును. అప్పట్లో ఆయన దివితాలూకా కాజలో రెవెన్యూ ఇనస్పెక్టరుగా యుండెను. ఆ గ్రామంలో రామకృష్ణ గ్రంథాలయము స్థాపించారు. కాంగ్రెసు కార్యకర్తలుగా ప్రసిద్ధిచెందిన రామిరెడ్డి సుబ్బారెడ్డి, నరసారెడ్డి మొదలగువారు నాకు మిత్రులు. అందుచేత నేను తరుచు వెళ్తూండేవాణ్ణి. వారూ వస్తూయుండేవారు. వారిద్వారా రావుగారితో మైత్రి ఏర్పడింది. ఈయన ప్రథమభార్య సరోజినీ దేవి మంచి సంస్కారము గలది. వారికుమారుడే శ్రీవల్స. ఆమె 1956లో మరణించటం దురదృష్టము.

ఆయన నన్ను అన్నగారని ఆప్యాయతతో పిలుస్తూ ఉంటారు. ఆయన చదివిన పద్యము, శ్లోకము నేను note చేసుకోవటం చూచి "దీనిని అన్నగారు ఎక్కడో సద్వినియోగం చేస్తారు" అంటాడు. గుడివాడలోను, ఇతర సభలలోను మేము తరుచు కలుసుకుంటూ ఉంటాము.

శ్రీ రామకృష్ణ గ్రంథాలయ రజతోత్సవ సందర్భములో 20_3 1964 నరసింహారావుగారిని సన్మానించుట జూచి ఆనందించాను.

ఈయన ప్రథమ కళత్ర పుత్రుడంటే నాకెంతో అభిమానము. ఆయన్ని ఎంతో తీర్చి దిద్దాడు నరసింహారావుగారు.

[illegible] అందరియెడల మర్యాదగా ఉండు. వారు మర్యా[illegible] నీవు మర్యాదస్తుడవని." ఇది తండ్రులందరూ తమ [illegible]లసిన సంగతే.

[illegible]మిత్రులలో పువ్వాడ శేషగిరిరావు, నరసింహారావుగారు కవులు, చక్కని కంఠము గలిగి శ్రోతలను ఆనందింపజేయగల దిట్టలు.

గుడివాడ

16_2_56

సోదరా !

మీ జాబుచూచి నేను నా బంధుమిత్రులు చాలా ఆనందించాము. రాకరాక మీ యూరువచ్చి మీతో కులాసాగా కాలక్షేపం చేయకుండా వెంటనే తిరిగివచ్చుట నాకు చాలా అసంతృప్తిగానే యున్నది. కారులో చోటు దొరకక 13 సాయంత్రమునకు బందరు మీమనగా యిల్లు చేరవలసి వచ్చినది. మీ సరస్వతీ నిలయంలో, బ్రహ్మాయ్యగారి దర్బారులో, కోటేశ్వరరావుగారి సదనంలో నే ననుభవించిన ఆనందం వర్ణనాతీతము. అట్టివి జీవితములో మధురఘట్ట

ములు. ఎప్పుడోగాని లభింపవు. భగవంతు డనుగ్రహిస్తే సకుటుంబముగా మీ యూరు వచ్చి నాలుగురోజులుండి మీ సాహిత్య కుసుమ పరిమళము ననుభవించి ఆనందించవలెనను కోరిక గలదు. ఎన్నడు నెరవేరునో. మేము కుశలం. మీరెల్లరు కుశలురని తలంచెదను.

కాకాని నరసింహారావు.

గుడివాడ
27-11-56

సోదరా !

నమస్తే.

నా జీవితముమీద కప్పబడిన నల్లముసుగును తొలగించి, యిప్పుడిప్పుడే దృష్టి సారించగలుగుచున్నాను. ప్రారంభోత్సవమునాడే తిరిగి వేదికనెక్కి సభ్యులను [illegible] చూట...కవితావిలాసిని, భాషాసుందరులు మరల నా[illegible] మారంభించినారు. తొందరలో వ్రాసి పంపుదును. రానున్న [illegible] తికి ఆంధ్ర నలంద ఆధిపత్యము క్రింద తిక్కనజయంతి ఏర్పాటుచేయబడినది. మూడురోజులు సభలు జరుగును ఒకనాడు అభినవ తిక్కనకు సన్మానము. రెండవనాడు వడ్లమూడి గోపాలకృష్ణయ్యకు సన్మానము. మరొకనాడు కవిరాజు వర్ధంతి జరుగనున్నవి. ఆనాటికి మీ గ్రంథమును పూర్తిచేసి శ్రీ తుమ్మలకు బహూకరిస్తే బాగుండునేమో యోచించండి. శ్రీ మునిమాణిక్యం వారు కుశలం. మేము క్షేమం.

కాకాని నరసింహారావు.

## శ్రీ అయ్యంకి వెంకటరమణయ్య

సహజ మందహాసంతో, సమున్నతాకారంతో, తెల్లనైన జులపాలతో ఉంటారు వెంకటరమణయ్యగారు.

వించినవి_

ద్యమం ప్రజాతంత్ర ఉద్యమం నుండి మరి రెండు ఉద్యమాలు ఆవిర్భ
... గ్రంథాలయోద్యమం, గ్రంథాలయోద్యమం. గ్రంథాలయో
శాస్త్రీ అద్యమంగా నడిచింది యావద్భారతంలోను ఆంధ్రులే.

ఆం...లయోద్యమానికి పునాది వేసింది స్వర్గీయ నరసింహ
సాధించి, అయ్యంకి వెంకటరమణయ్య గారలు.

ఊర్పాంగిపో దేశమంతటా సంచారం చేసి, ఊరూరా గ్రంథాలయాలు
... లయ ... లయ సర్వస్వం' అనే పత్రిక బెట్టి, దానిపేర చేసే
గ్రంథా... దేశంలో ఏ మూల గ్రంథాలయసభ జరిగినా,
మంత్రమే ... త్సవం జరిగినా అక్కడకు హాజరై, గ్రంథాలయ
శ్రీ వెంకట..., మూర్తీభవించిన జా... గ్రంథాలయోద్యమం
... య్య. గ్రంథాలయ యాత్రలు సాగిస్తూ, బుర్ర
కథలు మొద... ప్రచార సాధనా... ద్వారా ప్రసిద్ధికి తెచ్చారు
గ్రంథాలయోద్యమాన్ని. అందుచేతనే ఆయన 'గ్రంథాలయ పితా
మహ' 'గ్రంథాలయ శాస్త్ర విశారద' '...గ్రంథాలయోద్ధారక' బిరుదులు
గాంచారు.

శ్రీ వెంకటరమణయ్య దివి తాలూకా అయ్యంకిలో 1889,
ఆగస్టు 30 న జన్మించారు.

"ఆంధ్రభారతి" పత్రిక నడిపారు. బాలభటోద్యమాన్ని నడి
పారు. ప్రకృతి వైద్యంలో ప్రవీణులు. దివ్యజ్ఞాన సమాజికుడై దాన్ని
ప్రచారం చేశారు. ఆంధ్రోద్యమంలో కూడ పాల్గొన్నారు. అధికంగా
వారు చేసింది గ్రంథాలయ సేవ. ఈనాడు ఆంధ్రప్రదేశ్ లో ఏడువేల
గ్రంథాలయాలున్నాయంటే అది అయ్యంకి వారి చలవే.

ఆయన జరిపిన అనేకసభలలో పాల్గొనే భాగ్యం నాకు లభిం
చింది. ఆయన జరిపిన సరస్వతీ సామ్రాజ్య యజ్ఞంలో భాగస్వామి
నయ్యాను.

కట్టమంచి రామలింగారెడ్డిగారి అధ్యక్షతను... త్సవం జరిపి, జరిగిన అయ్యంకివారి సభలో పాల్గొన్నాను ...ారు. దానిని

1950 లో గుడివాడలో ఆయన షష్టిపూర్తి ...

"సరస్వతీ సామ్రాజ్యం" పేరుతో సన్మానసంచిక ప్రకటించిన ... సంపుటి నాకు ఆయన ఆశీర్వదిస్తూ, బహూకరించారు.

"గ్రంథాలయజ్యోతి" వెంకటరమణయ్యగారి ...మమోహన బహూకరించారు నాకు.

...

మా ఘంటసాలలో 1914 లో స్థాపింపబడి... ...ందర్భంలో గ్రంథాలయాన్ని లోకల్ లైబ్రరీ అథారిటీకి అప్ప... ...ం. ఆయనకు నూతనవస్త్రా... బహూకరించి ధన్యుల... ...-1959)

## శ్రీ మల్లెల శ్రీరామమూర్తి

శ్రీ శ్రీరామమూ... మంచిమిత్రుడు. చురుకుదనం, చొరవ జాస్తి. అన్నిటా అగ్రశ్రేణి ...హించ కోరువాడు. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, కాంగ్రెస్ ఉద్యమం-వీటన్నిటితోను కృషి చేసిన ప్రసిద్ధుడు. పెద్దలతో పరిచ...య భాగ్యం కలిగినవాడు. వ్యాస రచయితగా ప్రసిద్ధుడు.

'ఇల్లు కట్టిచూడు, పెళ్ళిచేసి చూడు', సామెతకు 'పత్రిక పెట్టి చూడు' అనికూడా కలపవచ్చు. 1948 నుండి 'విజయవాణి' వారపత్రికకు సంపాదకుడై, దానిని నిర్విఘ్నంగా ఆయన నడపడం శక్తిసామర్థ్యాలను చాటుతున్నది.

'అయ్యంకి' వారితోపాటు గ్రంథాలయ సభ...లకు వస్తూండేవారు. తద్వారా నాకు మిత్రుడు. వీరి పెద్దబ్బాయి పెళ్ళికి ఉయ్యూరు వెళ్ళాను.

నాకు ప్రభుత్వం చేసిన సన్మానంలో ఈయన పాల్గొని, శాలువ బహూకరించి ఆ సన్మానసభా వృత్తాంతమంతా తన 'విజయ వాణి'లో ప్రచురించి, అందులో మా మైత్రిని పేర్కొన్నాడు.

మా గ్రామ గ్రంథాలయాన్ని, లోకల్ లైబ్రరీ అథారిటీకి అప్పగించిన సందర్భంలో మల్లెలవారిని రావించి నూతనవస్త్రాలతో సన్మానించాం.

అయ్యంకి వెంకటరమణయ్యగారు, శ్రీరామమూర్తిగారు చిరకాలమిత్రులు నాకు. గ్రంథాలయ సభలకు వీరిని పిలవనక్కర లేదు. వారంతట వారే వస్తూంటారు. వీరి నెప్పుడు రిక్షా ఎక్కడం చూడలేదు. పాదచారులై సంచరిస్తూంటారు. శ్రీరామమూర్తిగా రెంత పొట్టివాడో, అంత గట్టివాడు.

## శ్రీ పాతూరి నాగభూషణం

ఆంధ్రప్రదేశ్‌లో నాగభూషణంగారిని ఎరుగని అక్షరాస్యు డుండడు.

గత మూడు దశాబ్దాలనుండి ఆయన నిరంతరం జాతీయో ద్యమంలోను, గ్రంథాలయోద్యమంలోను కృషిచేస్తున్నారు. సత్యా గ్రహోద్యమంలో జైలుకు వెళ్ళిన దేశభక్తుడు.

స్వగ్రామమైన పెదపాలెంలో సేవాశ్రమ వాణీమందిర గ్రంథా లయాన్ని సమర్థవంతంగా నిర్వహించడంతో ప్రారంభమయింది ఆయన గ్రంథాలయసేవ. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘానికి కార్య దర్శిగా ఉండి, దానిని పటిష్ఠవంతం చేయడంలోను, 'గ్రంథాలయ సర్వ స్వం' నిర్వహణలోను శ్రీ సర్వోత్తమ భవన నిర్మాణంలోని, జోగి రాజుగారి గ్రంథాలను ప్రచురించడంలోను, శ్రీ సర్వోత్తమభవనంపై బాపూజీ మందిర నిర్మాణంలోను ఆయన చూపిన దీక్షాదక్షతలు కొనియాడదగినవి.

బెంగాలీలకు, ఆంధ్రులకు కొన్ని సమానగుణా లున్నాయి. వారు భారతభూమిలో కొన్ని ఉద్యమాలను ఆరంభించినట్లే ఆంధ్రులూ ప్రారంభించారు. వాటన్నిటిలో గ్రంథాలయోద్యమం ప్రథమం, ప్రధానం. ఆంధ్రోద్యమానికి, వందేమాతరం ఉద్యమానికి గ్రంథాలయోద్యమం దోహదం చేసింది. ఈ గ్రంథాలయోద్యమ వ్యాప్తి వలననే ఆంధ్రదేశంలో చైతన్యంకలిగి, గాంధీజీ ఆరంభించిన సత్యాగ్రహోద్యమంలో ఆంధ్రులు ఎక్కువగా పాల్గొన్నారు.

ఏ జాతి అయినా అభివృద్ధిగాంచాలంటే ముందు విజ్ఞానవ్యాప్తి కావాలి. విజ్ఞానప్రాప్తి సాధకమైన గ్రంథాలయోద్యమం అన్ని ఉద్యమాలకు పునాది. ఇది ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడింది.

ఈ ఉద్యమానికి అంకితమైనవారు, ఆహుతిఅయినవారు అసంఖ్యాకులు. అనేకులు అజ్ఞాతంగానే ఉండిపోయారు. కొందరి పేర్లు మాత్రమే ప్రసిద్ధిగాంచినవి.

గ్రంథాలయ కార్యదర్శులుగా తమను తాము ఈ ఉద్యమానికి అంకితం చేసుకున్న ఇద్దరిపేర్లు స్మరణీయములు.

ఈ ఉద్యమాన్ని తలవగానే అయ్యంకి వెంకటరమణయ్యగారి పేరు వెంటనే స్ఫురిస్తుంది. ఆయన 1914-38 వరకు కార్యదర్శిగా ఉండి కృషిచేశారు. ఆయన అడుగిడని గ్రామంలేదు, సాగించని ప్రచారపద్ధతి లేదు.

ఆయన అనంతరం గత ముప్ఫయి యేళ్ళనుండి సారథ్యాన్ని వహిస్తూ సౌధాల నిర్మించుకుంటూ వస్తున్నారు పాతూరివారు.

నాగభూషణంగారి జననం 1907-8-11. 1938 నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సర్వస్వ సంపాదకులు. రాష్ట్ర గ్రంథాలయ కమిటీ సభ్యుడు. రచనలు—గ్రంథాలయములు, రిజిస్ట్రేషన్, గ్రంథాలయ సర్వస్వ ప్రథమ పాఠములు, గ్రంథాలయ పట్టిక.

ఆయనతో నాపరిచయం ఆయన కార్యదర్శి కాకపూర్వంనుండి.

24-7-1938 లో బెజవాడలో జరిగిన గ్రంథాలయ సర్వసభ్య సభలో ఆయన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డాడు. అప్పుడు గ్రంథాలయ సంఘం ఆఫీసు బెజవాడనుండి నాగభూషణం గారున్న పటమటకు మార్చబడింది.

ఆయనతో మైత్రి ఏర్పడినందున కలసి అనేక గ్రంథాలయ సభలకు వెళ్ళాను. పెదపాలెంలో జరిగిన 24 వ గ్రంథాలయ సభలో బాల వాఙ్మయాన్ని గురించి ప్రసంగించారు.

నేను మా గ్రంథాలయానికి కార్యదర్శిగా, అధ్యక్షుడుగా ఉన్నందున ఆదినుండి గ్రంథాలయోద్యమంతో పరిచయం ఉంది. దివితాలూకా, కృష్ణాజిల్లా గ్రంథాలయ సంఘాలకు అధ్యక్షుడిగా ఉన్నాను కొంతకాలం 'గ్రంథాలయ సర్వస్వ' సంపాదకులలో ఒక డనుగా ఉండి దానిలో కొన్ని వ్యాసాలు రాసి, అనేక గ్రంథసమీక్షలు చేశాను

పాతూరివారి షష్టిపూర్తికి ఒక వ్యాసం రాశాను షష్టిపూర్తి ఉత్సవం 1967 ఆగస్టు 29న జరుగగా అందులో పాల్గొన్నాను.

ఆయనతో నా మైత్రి 30 ఏళ్ళ పైది.

## శ్రీ శరణు రామస్వామి చౌదరి

బంగరు మేలిమిఛాయతో, విశాలమైన ఫాలభాగం, మంద హాసవదనంతో సుస్పష్టమైన ఉచ్చారణతో, మధురంగా మాట్లాడే ఉత్తమ సంస్కారి శరణువారు.

1920 నుండి రాజకీయాలలోను, గ్రంథాలయోద్యమంలోను కృషిచేయుచున్న త్యాగశీలి, నిరాడంబరుడు, శాంతస్వభావుడు, దీక్షాదక్షుడు.

కాంగ్రెస్ పార్టీలో బాధ్యతగల పదవులెన్నో సమర్థతతో నిర్వ

హించి ప్రశంస పొందాడు. గుంటూరు జిల్లా హరిజన సేవక సంఘం కార్యదర్శిగా 7 సం॥ములుండి అన్ని తాలూకాల్లోనూ హరిజన వసతి గృహాలను ఏర్పాటుచేశాడు. ఆంధ్ర దేశంలో గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘానికి కార్యదర్శిగా P. C. C. కి సెక్రటరీగా, అనేక సంవత్సరాలు సేవచేశారు. అఖలభారత కాంగ్రెస్ సంఘానికి సభ్యుడిగా చాలాకాలం వున్నారు. ఆంధ్రోద్యమానికికూడ ఆయన అండగా కృషిచేశాడు.

తెలుగు దేశంలో పెదనందిపాడు ఫిర్కా పన్నుల నిరాకరణలో పేరుగాంచింది. దానిలో రామస్వామిగారి కృషి అనన్యమైనది. ప్రఖ్యాతిగాంచిన గుంటూరు నల్లజెండాల ప్రదర్శనలో ఆయనచెయ్యి ఉన్నది. 1929లో ఖద్దరు ఉద్యమంలో కృషిచేశారు.

భారతస్వాతంత్ర్య సమరంలో ఉప్పుసత్యాగ్రహం ఉజ్వలమైన ఘట్టం. నాలుగువందల సత్యాగ్రహులతో గుంటూరుజిల్లా అంతా ప్రచారమొనర్చి తెనాలి వచ్చినపుడు, 'కవిరాజు' త్రిపురనేని రామస్వామిగారు "వీరగంధము తెచ్చినారము, వీరు లెవ్వరో తెలుపుడీ' అన్న గేయము పలికినది. 'శరణు'గారి నాయకత్వాన వచ్చిన సత్యాగ్రహులను చూసినపుడే !

అనేకసార్లు కారాగృహవాసం చేసిన దేశభక్తుడు. శాసన సభ్యుడుకూడ అయారు.

గ్రంథాలయోద్యమమంటే చాలా అభిమానమున్న గ్రామం అమృతలూరులోని "ఉభయభాషా సంజీవని గ్రంథాలయం"తో ఈయనకు పన్నెండవయేటినుండి సంబంధమున్నది.

1928లో తెనాలి తాలూకా గ్రంథాలయసంఘానికి, 1931లో జిల్లా సంఘానికి అధ్యక్షుడుగా పనిచేశారు. రాష్ట్ర సంఘానికికూడ ఉపాధ్యక్షుడుగా ఉన్నారు. గుంటూరుజిల్లా L. L. A. అధ్యక్షుడుగా అనేక గ్రామాల్లో గ్రంథాలయాలు స్థాపించారు.